మంగళవారం
27.10.2026
పేజీలు : 12 వెల : రూ. 5/-

వెలుతురు

సంపుటి : 09
సంచిక : 134
తెలుగు దినపత్రిక
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD
www.velthuru.com
Follow :

వర్షాలు వస్తున్నాయ్..

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం శుభవార్త
- అర్నాబ్ తుపాను ప్రభావంతో తెలంగాణలో వానలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26:

వర్షాలు లేక ఎండిపోతున్న పంటలు చూసి అల్లాడుతున్న రైతులకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం శుభవార్త చెప్పింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నాబ్ తుపాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. నేడు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటలకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది.

పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరిక

రేపు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబ్ బాద్ జిల్లాల్లో అతిభారీ వర్షం పడే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది.

మహారాష్ట్ర సానుకూలం

తుమ్మిడిహెట్టి 152 మీటర్ల ఎత్తు ప్రతిపాదనపై పునఃపరిశీలనకు సిద్ధం

అధికారుల కమిటీ ఏర్పాటుకు సూచన

- బ్యారేజీ ఎత్తు, ముంపు, నీటి లభ్యతపై సమగ్ర అధ్యయనం
- ఆదిలాబాద్ ఆదివాసీల సాగు, తాగునీటి కల సాకారానికి అడుగు
- ముంపు భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సంసిద్ధత
- మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో చర్చలు సఫలం
- 'ఎక్స్' పోస్టు ద్వారా వెల్లడించిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

ముంబై, వెలుతురు, అక్టోబర్ 26

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం, ఎత్తు పెంపుపై తెలంగాణ ప్రతిపాదనకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. మహారాష్ట్రకు, అక్కడి ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండకపోతే ప్రస్తుతం 148 మీటర్లుగా ఉన్న ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు అభ్యంతరం లేదని తెలిపారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, సాంకేతిక అంశాలపై సమగ్ర అధ్యయనం చేసేందుకు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

ముంబైలోని సహ్యాద్రి రాష్ట్ర అతిథి గృహంలో సోమవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం సమావేశమైంది. ఈ భేటీలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం, దాని ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు - మిగతా 2 లో..

అమిత్ షా పరువు నష్టం కేసులో

రాహుల్‌కు ఊరట

- ఫిర్యాదుదారు బాధితుడిగా పరిగణనలోకి రాడని కోర్టు వ్యాఖ్య
- ఎనిమిదేళ్ల న్యాయపోరాటానికి తెర.. కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు
- సుల్తాన్‌పూర్ వెళ్తుండగా కాన్వాయ్‌లో స్వల్ప ప్రమాదం

సుల్తాన్‌పూర్, వెలుతురు అక్టోబర్ 26:

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కోర్టులో ఊరట లభించింది. 2018లో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు, ప్రస్తుత కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు సోమవారం రాహుల్ గాంధీని నిర్దోషిగా ప్రకటించింది. అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శుభం వర్మ తీర్పు వెలువరించారు. తీర్పు సమయంలో రాహుల్ గాంధీ స్వయంగా కోర్టుకు హాజరయ్యారు.

2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో బెంగళూరులో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై స్థానిక బీజేపీ నేత విజయ్ మిశ్రా 2018 ఆగస్టు 4న పరువు నష్టం ఫిర్యాదు చేశారు. అమిత్ షాను హత్య కేసులో నిందితుడిగా పేర్కొంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని ఫిర్యాదుదారు ఆరోపించారు. భారతీయ శిక్షాస్మృతిలోని 499, 500 సెక్షన్ల కింద కేసు కొనసాగింది.

ఫిర్యాదుదారుడి అర్హతపైనా వ్యాఖ్యలు

విచారణ సందర్భంగా రాహుల్ గాంధీ తరఫు న్యాయవాదులు తన వ్యాఖ్యలను సందర్భం నుంచి విడదీసి చూపించారని వాదించారు. తాజాగా తీర్పు వెలువరిస్తూ రాహుల్ వ్యాఖ్యలు పరువు నష్టం కలిగించే స్వభావం కలిగినవి కావని కోర్టు పేర్కొన్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ఫిర్యాదుదారు విజయ్ మిశ్రా ఈ కేసులో బాధితుడిగా పరిగణనలోకి రావడానికి అర్హుడు కాదని కూడా కోర్టు అభిప్రాయపడినట్లు రాహుల్ తరఫు న్యాయవాది తెలిపారు. దీంతో ఈ కేసులో రాహుల్ గాంధీకి ఊరట లభించింది. తీర్పుపై కాంగ్రెస్ కార్యకర్తలు కోర్టు వెలుపల సంబరాలు చేసుకున్నారు. - మిగతా 2 లో..

మారువేషంలో నేపాల్ వెళ్లి

సెర్చ్ ఆపరేషన్

మాజీ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య హత్య కేసు వివరాలు వెల్లడించిన సీపీ సజ్జనర్

2

గ్రావిటీతో నీళ్లిస్తే

రాజీనామా చేస్తా

ఉత్తమ్ నిరూపిస్తారా? : హరీశ్‌రావు సవాల్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26:

తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీళ్లు తీసుకురాగలమని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీళ్లు తీసుకురావడం సాధ్యం కాదని తేలితే ఉత్తమ్‌కుమారెడ్డి రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌ను కలిసిన నేపథ్యంలో - మిగతా 2 లో..

ఏఈఈ పరీక్షకు మరో అవకాశం

టీజీపీఎస్సీ కీలక నిర్ణయం

- ఒకే సమయంలో రెండు పరీక్షలు.. అభ్యర్థులకు ఊరట
- నవంబర్ 7న ఏఈఈ పరీక్ష రాసే అవకాశం
- అక్టోబర్ 30లోపు పత్రాలు సమర్పించాలి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26:

తెలంగాణలో ఏఈఈ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక వెసులుబాటు కల్పించింది. కేంద్ర ప్రభుత్వ సిబ్బంది ఎంపిక సంఘం నిర్వహించే జూనియర్ ఇంజినీర్ పరీక్ష, టీజీపీఎస్సీ నిర్వహించే సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ పరీక్షల తేదీలు ఒకే సమయంలో రావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అభ్యర్థులకు ఊరటనిచ్చింది. నవంబర్ 6, 2026న జూనియర్ ఇంజినీర్ పరీక్ష రాయాల్సి ఉండి, అదే సమయంలో ఏఈఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులు నవంబర్ 7న ఏఈఈ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తూ కమిషన్ నిర్ణయం తీసుకుంది.

అక్టోబర్ 30లోపు పత్రాలు సమర్పించాలి

ఈ వెసులుబాటు పొందాలనుకునే అభ్యర్థులు తమ వివరాలను టీజీపీఎస్సీకి సమర్పించాలి. నవంబర్ 6, 2026 తేదీతో ఉన్న జూనియర్ ఇంజినీర్ పరీక్ష ప్రవేశపత్రం ప్రతితో పాటు, ఏఈఈ దరఖాస్తు పత్రం, టీజీపీఎస్సీ ఒకేసారి నమోదు చేసుకునే విధానానికి సంబంధించిన గుర్తింపు సంఖ్య వివరాలను అందించాలి. ఈ పత్రాలను అక్టోబర్ 30, 2026 సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలి. అభ్యర్థులు ఈ పత్రాలను టీజీపీఎస్సీ కార్యాలయంలోని సహాయ కేంద్రంలో నేరుగా అందించవచ్చు. లేదంటే helpdesk@tgpsc.gov.in అనే ఈమెయిల్ చిరునామాకు పంపించాలి.

అర్హులైన అభ్యర్థులకు నవంబర్ 7న పరీక్ష

అభ్యర్థులు సమర్పించిన పత్రాలను పరిశీలించిన తర్వాత అర్హులైన వారికి మాత్రమే నవంబర్ 7, 2026న ఏఈఈ పరీక్ష రాసేందుకు అనుమతి కల్పించనున్నారు. జూనియర్ ఇంజినీర్ పరీక్షకు నవంబర్ 6న హాజరుకావాల్సి ఉండి, ఏఈఈ పరీక్షకు కూడా - మిగతా 11 లో..

'సర్' నిర్ణయాలన్నీ ఏకగ్రీవమే!

- సుప్రీంకోర్టులో ఎన్నికల సంఘం అఫిడవిట్
- చట్టబద్ధంగానే ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ
- ఫారం-6లో మార్పులు చేశారన్న ఆరోపణలను ఖండించిన ఈసీ

11

సర్ పెండింగ్ పనులు 4 రోజుల్లో పూర్తి చేయాలి

- రికార్డులు, ఆధారాలు పక్కాగా భద్రపరచాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

11

పెట్రోల్ కార్లకు

చెక్

ఈ100 ఇంధన వాహనాలకు గ్రీన్‌సిగ్నల్

- ఈ85, ఈ100 వాహనాల తయారీకి కేంద్రం అనుమతి
- పాత కార్లలో నేరుగా ఇథనాల్ వాడకం కుదరదు
- ముడి చమురు దిగుమతులు, కాలుష్యం తగ్గించడమే లక్ష్యం

2

భారతదేశంలో సంప్రదాయ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా ఇథనాల్ వాడకాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఈ85, ఈ100 ఇథనాల్ ఇంధనాలతో నడిచే ప్రత్యేక వాహనాల తయారీకి మార్గం సుగమం చేస్తూ సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్‌లో సవరణలు చేసింది. ఈ సరికొత్త నిబంధనల ప్రకారం వాహన తయారీదారులు 100 శాతం ఇథనాల్‌తో నడిచే ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాలను రోడ్లపైకి తీసుకువచ్చేందుకు చట్టపరమైన వెసులుబాటు లభించింది. - న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 26

రక్షణ రంగానికి డ్రోన్స్, గన్స్, హెలికాప్టర్స్

- కొనుగోలుకు డీఏసీ ఆమోదం
- రూ.2.12 లక్షల కోట్లు కేటాయించేందుకు కేంద్రం ఆమోదం

2

ఆర్టీసీ కండక్టర్ ప్రవళికకు యాజమాన్యం అండ

- టీజీఎస్ ఆర్టీసీ ఈడీ సిహెచ్. వెంకన్న భరోసా
- హెల్త్ బులెటిన్ పరిశీలిస్తున్న రవాణా శాఖ మంత్రి పొన్నం

12

రాహుల్‌కు ఊరట..

(మొదటిపేజీ తరువాయి)

ఎనిమిదేళ్లుగా కొనసాగిన విచారణ

కర్ణాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా బెంగళూరులో చేసిన వ్యాఖ్యలే ఈ కేసుకు కారణమయ్యాయి. అప్పట్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న అమిత్ షాను హత్య కేసులో నిందితుడిగా రాహుల్ పేర్కొన్నారని విజయ్ మిశ్రా ఆరోపించారు. 2023లో కోర్టుకు హాజరైన రాహుల్ గాంధీ అనంతరం బెయిల్ పొందారు. ఈ కేసులో రాహుల్ గొంతు నమూనాను ప్రసంగ రికార్డుతో పోల్చాలంటూ ఫిర్యాదుదారు చేసిన అభ్యర్థనను దిగువ కోర్టు తిరస్కరించగా, ఆ నిర్ణయాన్ని సవాలు చేసిన పిటిషన్లు కూడా ఉన్నత న్యాయస్థానాల్లో తిరస్కరణకు గురయ్యాయి. అక్టోబర్ 13న తీర్పు వెలువరించాల్సి ఉండగా,అనంతరం అక్టోబర్ 26కు వాయిదా పడింది. సోమవారం తుది తీర్పు వెలువడింది.

కాన్వాయ్‌లో వాహనాలు ఢీ

కోర్టు తీర్పు కోసం లక్నో నుంచి సుల్తాన్‌పూర్‌కు రాహుల్ గాంధీ రోడ్డు మార్గంలో వెళ్తుండగా పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేపై ఆయన కాన్వాయ్‌లో స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం సుమారు 10.15 గంటల సమయంలో కాన్వాయ్ ముందు వెళ్తున్న స్థానిక కాంగ్రెస్ నాయకులకు సంబంధించిన ఓ ప్రైవేటు కారు అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో వెనుకనున్న కొన్ని వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఘటనలో రాహుల్ గాంధీ సురక్షితంగా ఉన్నారు. తీవ్ర గాయాలైనట్లు సమాచారం లేదు. అనంతరం ఆయన కోర్టుకు చేరుకుని విచారణకు హాజరయ్యారు.

పెట్రోల్ కార్లకు చెక్

ఈ100 ఇంధన వాహనాలకు గ్రీన్‌సిగ్నల్

- ఈ85, ఈ100 వాహనాల తయారీకి కేంద్రం అనుమతి
- పాత కార్లలో నేరుగా ఇథనాల్ వాడకం కుదరదు
- ముడి చమురు దిగుమతులు, కాలుష్యం తగ్గించడమే లక్ష్యం

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 26:

భారతదేశంలో సంప్రదాయ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా ఇథనాల్ వాడకాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఈ85, ఈ100 ఇథనాల్ ఇంధనాలతో నడిచే ప్రత్యేక వాహనాల తయారీకి మార్గం సుగమం చేస్తూ సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్‌లో సవరణలు చేసింది. ఈ సరికొత్త నిబంధనల ప్రకారం వాహన తయారీదారులు 100 శాతం ఇథనాల్‌తో నడిచే ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాలను రోడ్లపైకి తీసుకువచ్చేందుకు చట్టపరమైన వెసులుబాటు లభించింది. అయితే.. ఈ కొత్త నిబంధనలు కేవలం రాబోయే కొత్త వాహనాలకే వర్తిస్తాయని, సామాన్య ప్రజలు తమ వద్ద ఉన్న పాత లేదా సాధారణ పెట్రోల్ కార్లలో నేరుగా ఈ100 ఇంధనాన్ని వాడటానికి వీలుండదని స్పష్టమవుతోంది.

ప్రస్తుతం మన దేశంలో లభించే సాధారణ కార్లు ఈ20 ఇథనాల్‌ను మాత్రమే తట్టుకోగలవు. కానీ ఈ85, ఈ100 ఇంధనాల కోసం ఇంజిన్లు, ఫ్యూయల్ సిస్టమ్‌లను ప్రత్యేకంగా డిజైన్ చేయాల్సి ఉంటుంది. ఇటీవల మారుతి సుజుకి సంస్థ దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన 'మహీంద్రా/మారుతి వాగన్ ఆర్ ఫ్లెక్స్ ఫ్యూయల్' కారు ఈ85 ఇథనాల్‌పై నడిచేలా రూపుదిద్దుకుంది. ఈ రకమైన ఇథనాల్ ఇంధనం సాధారణ పెట్రోల్ కంటే లీటరుకు దాదాపు రూ. 20 వరకు తక్కువ ధరకు లభిస్తుండటం విశేషం. అయితే, ఈ ఫ్లెక్స్-ఫ్యూయల్ కార్ల కొనుగోలు ధర సాధారణ మోడళ్లతో పోలిస్తే సుమారు రూ. 85,000 వరకు ఎక్కువగా ఉంటుంది.

అంతర్జాతీయంగా ముడి చమురు దిగుమతులపై భారత్ చేస్తున్న ఖర్చును తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించడంలో ఇథనాల్ కీలకపాత్ర పోషిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. దేశంలో చక్కెర ఉత్పత్తి, వ్యవసాయ వ్యర్థాల నుంచి ఇథనాల్ తయారీని ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో, ఆటోమొబైల్ రంగాన్ని పూర్తిగా హరిత ఇంధనం వైపు మళ్లించేందుకు ఈ నిబంధనల సవరణ ఎంతగానో దోహదపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. త్వరలోనే దేశీయ మార్కెట్లో మరిన్ని ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

రక్షణ రంగానికి డ్రోన్స్, గన్స్, హెలికాప్టర్స్

- కొనుగోలుకు డీఏసీ ఆమోదం
- రూ.2.12 లక్షల కోట్లు కేటాయించేందుకు కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 26:

రక్షణ దళాల కోసం రూ.2.12 లక్షల కోట్ల విలువైన సైనిక పరికరాలు కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సోమవారం ఆమోదం తెలిపింది. దీనితో తేలికపాటి మల్టీ-రోల్ హెలికాప్టర్లు, లాంగ్-రేంజ్ కామికాజ్ డ్రోన్లు సహా సైనిక ప్లాట్ఫారమ్లు, ఆయుధాలు కొనుగోలు చేసేందుకు వీలవుతుంది. రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన డీఏసీ (డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్) ఈ కొనుగోలు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకారం, భారత సైన్యం కోసం హై మొబిలిటీ వాహనాలు, సెల్ఫ్-ప్రొపెల్డ్ ట్రాక్డన్ సిస్టమ్, తేలికపాటి మల్టీ-రోల్ హెలికాప్టర్లు, స్వల్ప శ్రేణి వాయు రక్షణ వ్యవస్థ, కౌంటర్ అన్మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్ (సీ-యూఏఎస్) కొనుగోలుకు ఆమోదం లభించింది. అలాగే భారత సైన్యం కోసం ఇతర మానవ రహిత వైమానిక వ్యవస్థలు, నిఘా విమానాలు, సమీకృత నిఘా, దాడి వ్యవస్థలు, లాంగ్-రేంజ్ కామికాజీ డ్రోన్ వ్యవస్థలు కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. మరోవైపు భారత నౌకాదళం కోసం యాక్టివ్ ఆఫ్బోర్డ్ డెకాయ్ సిస్టమ్ (మారీచ్), ఇతర ప్రధాన నౌకాదళ ప్లాట్ఫారమ్ల కొనుగోలుకు కూడా ఆమోదం లభించింది. అలాగే భారత వైమానిక దళం కోసం హెలికాప్టర్లు, వాయు రక్షణ వ్యవస్థలు, రాడార్ల సేకరణకు డీఏసీ ఆమోదం తెలిపింది. కాగా, ఈ రక్షణ పరికరాల్లో దాదాపు 82 శాతం భారత పరిశ్రమల నుంచే కొనుగోలు చేయనున్నారు.టరుకు దాదాపు రూ. 20 వరకు తక్కువ ధరకు లభిస్తుండటం విశేషం. అయితే, ఈ ఫ్లెక్స్-ఫ్యూయల్ కార్ల కొనుగోలు ధర సాధారణ మోడళ్లతో పోలిస్తే సుమారు రూ. 85,000 వరకు ఎక్కువగా ఉంటుంది.

అంతర్జాతీయంగా ముడి చమురు దిగుమతులపై భారత్ చేస్తున్న ఖర్చును తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించడంలో ఇథనాల్ కీలకపాత్ర పోషిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. దేశంలో చక్కెర ఉత్పత్తి, వ్యవసాయ వ్యర్థాల నుంచి ఇథనాల్ తయారీని ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో, ఆటోమొబైల్ రంగాన్ని పూర్తిగా హరిత ఇంధనం వైపు మళ్లించేందుకు ఈ నిబంధనల సవరణ ఎంతగానో దోహదపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. త్వరలోనే దేశీయ మార్కెట్లో మరిన్ని ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

మహారాష్ట్ర సానుకూలం..

(మొదటిపేజీ తరువాయి)

ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై కీలకంగా చర్చించారు.

గిరిజనుల సాగు, తాగునీటి అవసరాలపై వివరణ

సమావేశంలో తొలుత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ జిల్లా అభివృద్ధిలో వెనుకబడి పోయిందని, గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదని తెలిపారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను వివరించారు.

ఆ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, ఎస్‌బీ చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి వివిధ దశల్లో ప్రయత్నాలు సాగుతున్నాయని గుర్తుచేశారు. ఐదు దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగినప్పటికీ ఆశించిన పురోగతి సాధించలేకపోయామని తెలిపారు.

2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. అయితే, ఆ ఎత్తుతో నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులతో పాటు ప్రాజెక్టు నిర్వహణ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. ఈ నేపథ్యంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల్లో ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు ఆ రాష్ట్రంలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, పరిహార విధానం ప్రకారం నష్టపరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

కొమురం భీమ్ పోరాటాన్ని గుర్తుచేసిన రేవంత్‌రెడ్డి

అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ-మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేశారు. పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతమని, అక్కడి గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను మహారాష్ట్ర సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని గుర్తుచేస్తూ, ఆ పోరాట కాలం నుంచి ఆదిలాబాద్ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదని, గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరారు.

విమానాశ్రయంతో సరిహద్దు ప్రాంతాలకు ప్రయోజనం

దేశ రక్షణ, జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాల పరంగా ఆదిలాబాద్ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యాన్ని రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఊతం లభిస్తుందని తెలిపారు. మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని, రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందని పేర్కొన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమని, పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు.

పునఃపరిశీలనకు ఫడ్నవీస్ అంగీకారం

తెలంగాణ ప్రతిపాదనపై దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందని తెలిపారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అయితే, తుది నిర్ణయానికి ముందు సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను అధ్యయనం చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మహారాష్ట్రకు, అక్కడి ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తుపై కుదిరిన ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు అభ్యంతరం లేదన్నారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు సాగాలని ఫడ్నవీస్ అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని, పరస్పర చర్చలు, సహకారంతో వాటికి పరిష్కారాలు కనుగొన్నామని గుర్తుచేశారు.

అధికారుల కమిటీతో సమగ్ర అధ్యయనం

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని ఫడ్నవీస్ తెలిపారు. సాంకేతిక పరిశీలనలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇదే సమయంలో రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను పరిశీలించాలన్నారు. ముంపు ప్రభావం, ప్రభావిత భూముల విస్తీర్ణంపై రెండు రాష్ట్రాల అంచనాలను సరిపోల్చి, ఇరు రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా పరిశీలించాలని సూచించారు. రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరిపి, తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించాలని పేర్కొన్నారు. ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు పునరుద్ఘాటించారు.

ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని, గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఆహ్వానం

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ అంతర్జాతీయ సదస్సుకు హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని, హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

హైదరాబాద్‌లో డ్రగ్స్‌పై ఉక్కుపాదం

ఫతేనగర్‌లో గంజాయి దందా గుట్టురట్టు

- గచ్చిబౌలిలో ఎండీఎంఏ పట్టివేత
- వృద్ధురాలి అరెస్టు.. 65 మందికి డ్రగ్స్ పాజిటివ్
- రెండు కేసుల్లో ఐదుగురు పరారీ.. సరఫరా మూలాలపై దర్యాప్తు

హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 26:

హైదరాబాద్‌లో మాదకద్రవ్యాల విక్రయాలపై ఈగల్ ఫోర్స్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు ముమ్మరం చేశారు. ఫతేనగర్‌లో ఇంటినే గంజాయి విక్రయ కేంద్రంగా మార్చుకున్న 75 ఏళ్ల వృద్ధురాలిని ఈగల్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేయగా.. గచ్చిబౌలిలో ఎండీఎంఏ విక్రయిస్తున్న ఫొటోగ్రాఫర్‌ను టాస్క్‌ఫోర్స్ బృందం అదుపులోకి తీసుకుంది. రెండు వేర్వేరు ఘటనల్లో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు, పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఫతేనగర్‌లో వృద్ధురాలి గంజాయి దందా

ఫతేనగర్‌లోని ఎల్‌బీఎస్ నగర్‌లో ఓ ఇంట్లో గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించిన ఈగల్ ఫోర్స్ బృందాలు సోదాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా 75 ఏళ్ల షేక్ జతేన్ బీని అరెస్టు చేసి, ఆమె ఇంట్లో 179.1 గ్రాముల గంజాయి, రూ.43,340 నగదు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి కొనుగోలుకు వచ్చిన 70 మందిని గుర్తించి పరీక్షలు నిర్వహించగా, 65 మందికి డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్లు సమాచారం. వీరిలో ముగ్గురు మైనర్లు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. 65 మందిని వివిధ పునరావాస కేంద్రాలకు తరలించారు. నిందితురాలిపై గతంలోనూ గంజాయికి సంబంధించి ఏడు కేసులు నమోదైనట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న మున్నీ బేగం, ఇమ్రాన్, హనీఫా బీ, ఖాజా బీ, ఖాజా పాషా కోసం గాలిస్తున్నారు.

గచ్చిబౌలిలో ఎండీఎంఏ పట్టివేత

మరోవైపు గచ్చిబౌలిలోని ఖాజాగూడ సర్వీస్ రోడ్డులో తెలంగాణ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించింది. డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫొటోగ్రాఫర్ ఆకుల సాయిరామ్‌ను అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 4.45 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకుంది. గ్రాము రూ.10 వేల చొప్పున డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు విచారణలో గుర్తించారు. నిందితుడి నుంచి కారు, డిజిటల్ తూకం యంత్రం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న మహేశ్‌రెడ్డి, తాండ్ర హరిశ్చంద్ర కోసం పోలీసులు గాలిస్తున్నారు. వీరు ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి చెందినవారిగా గుర్తించారు.రెండు ఘటనల్లోనూ మాదకద్రవ్యాలు ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయి? వీటి వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాజీనామా చేస్తా..

(మొదటిపేజీ తరువాయి)

హరీశ్‌రావు సోమవారం విలేకరులతో మాట్లాడారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ వల్లే కరవు

"తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్‌లో వర్షపాత లోటు ఎక్కువగా ఉన్నా.. ఇక్కడ పంటల సాగుకు విరామం ఎందుకు వచ్చింది? ఏపీలో ఎందుకు లేదు? దేవాదుల వద్ద పంపులు నడిపి ఉంటే వరంగల్ జిల్లాకు కరవు ఉండేది కాదు. శ్రీశైలంలో నీళ్లున్నా ఎందుకు ఎత్తిపోయలేదు? కల్వకుర్తిలో ఐదు మోటార్లున్నా రెండింటినే నడుపుతున్నారు. అవి కూడా రోజుకు రెండు గంటలే నడుపుతున్నారు. శ్రీశైలం నుంచి ఏపీ ఎంత నీటిని తీసుకెళ్తోంది? తెలంగాణ ఎంత తీసుకొస్తోంది? దేవాదుల, కల్వకుర్తి పంపుల వినియోగంపై శ్వేతపత్రం విడుదల చేయాలి. కన్నెపల్లి వద్ద నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా ఎందుకు వినియోగించుకోలేదు? ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరవే" అని హరీశ్‌రావు విమర్శించారు.

మూడేళ్ల తర్వాత మహారాష్ట్రతో చర్చలా?

"సీఎం రేవంత్‌రెడ్డి ఇవాళ మహారాష్ట్రకు వెళ్లారు. మేం 2014లో అధికారంలోకి వచ్చిన 42 రోజుల్లోనే ఆ రాష్ట్రంతో చర్చలు జరిపాం. కానీ, రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి వెయ్యి రోజుల తర్వాత చర్చలు జరుపుతున్నారు. మూడేళ్లు కాలయాపన చేసి ఇప్పుడు మహారాష్ట్రకు వెళ్లారు" అని హరీశ్‌రావు విమర్శించారు.

మారువేషంలో నేపాల్ వెళ్లి సెర్చ్ ఆపరేషన్

- మాజీ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య హత్య కేసు
- వివరాలు వెల్లడించిన సీపీ సజ్జనర్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26:

మాజీ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో ఈ ఏడాది మే నెలలో జరిగిన హత్య, దోపిడీ కేసులో ప్రధాన నిందితురాలు కల్పన సహా నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంట్లో పనిమనిషిగా పనిచేసిన కల్పన తన అనుచరులతో కలిసి హత్యకు పాల్పడి, ఆపై దోపిడీ చేసి నేపాల్‌కు పరారైనట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితులు దేశ సరిహద్దులు దాటి వెళ్లడంతో వారిని పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారింది. దీంతో దాదాపు ఐదు నెలల పాటు మూడు దఫాలుగా నేపాల్‌కు వెళ్లిన ప్రత్యేక పోలీసు బృందాలు స్థానికులతో మమేకమై, రహస్య నిఘా కొనసాగించి నిందితులను పట్టుకున్నాయి. ఈ ఆపరేషన్‌లో కీలకంగా మారిన అంశాలేంటి? నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ఎలాంటి వ్యూహాన్ని అనుసరించారు? అనే వివరాలు సీపీ సజ్జనర్ మీడియాకు వెల్లడించారు.

నేపాల్ వెళ్లి సెర్చ్ ఆపరేషన్ చేశాం

తనూజాను హత్య చేసి ఇంట్లో ఉన్న 225 గ్రా ఆభరణాలు చోరీ చేశారన్న సజ్జనర్ ఈ కేసును చేధించడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దింపామని తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు టాస్క్ ఫోర్స్, సీసీఎస్, జూబ్లీహిల్స్ పోలీసులతలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసామని, టాస్క్ ఫోర్స్ డీసీపీ ఆధ్వర్యలో 25మందితో సిట్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ముంబై, సూరత్, గుజరాత్, యూపీ, ఉత్తరాఖండ్, బీహార్ నేపాల్ బోర్డర్లకు టీమ్స్ పంపామని, నిందితుల వేటలో ఇతర రాష్ట్రాల పోలీసులు, రైల్వే పోలీసులు, బోర్డర్ అధికారులు సహకారం తీసుకున్నామని వివరించారు. పోలీసు బృందాలు మారువేషంలో నేపాల్ వెళ్లి సెర్చ్ ఆపరేషన్ చేశాయని, ఎట్టకేలకు కల్పనతో పాటు నలుగురు నిందితులను పట్టుకున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లో మాజీ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య హత్య కేసు తీవ్ర కలకలం రేపింది. ఈ ఏడాది మే 7న ఇంట్లో పనిచేసే నేపాలీ పనిమనిషి కల్పన ఆమె గ్యాంగ్ అర్ధరాత్రి దాటిన తర్వాత, తనూజ రంజన్ ముఖంపై దిండు ఉంచి, ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం ఇంట్లో నగలు, సొమ్ములతో పాటు మృతురాలి ఒంటిపై ఉన్న ఆభరణాలతో సహా దోచుకొని పరారయ్యారు.

కాళేశ్వరంపై బీఆర్ఎస్‌ది తప్పుడు ప్రచారం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26 : ఎల్‌నినో, కాళేశ్వరం ప్రాజెక్టు నీటి అంశాలపై బీఆర్ఎస్ రాజకీయ దుష్ప్రచారం చేస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 24 గంటలూ రాజకీయాలు చేయడమే బీఆర్ఎస్ లక్ష్యంగా పెట్టుకుందని, ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా వ్యవహరించకుండా కేవలం విమర్శలకే పరిమితమవుతోందని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రస్తుతం తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు తమకు ఓటు వేయలేదనే కారణంతో రాష్ట్రంలో మంచి జరగకూడదనే ఉద్దేశంతో బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన నీటిమట్టం ప్రస్తుతం లేదని చామల తెలిపారు. కన్నెపల్లి నుంచి మేడిగడ్డ వరకు నీటిని ఎత్తిపోసేందుకు 93.5 మీటర్ల నీటి మట్టం అవసరం కాగా, ప్రస్తుతం 89.20 మీటర్లు మాత్రమే ఉందన్నారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల వద్ద కూడా నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన స్థాయిలో నీరు లేదని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును గోదావరి నీటిని వినియోగించుకునేందుకే నిర్మించారని, ఎత్తిపోసిన నీటిని నిల్వ చేసుకునేందుకు తగినంత నిల్వ సామర్థ్యం కూడా లేదని అన్నారు. మేడిగడ్డ దిగువన దేవాదుల, సీతారామ వంటి ప్రాజెక్టులు ఉన్నందున గోదావరి నీరు తెలంగాణలోని ప్రాజెక్టులకే వెళ్తుందని స్పష్టం చేశారు. నీళ్లు ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోతున్నాయంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం వాస్తవ విరుద్ధమని అన్నారు. బొగ్గు, నీళ్లు, విద్యుత్ అంశాల్లో బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి లేకపోవడం వల్లే రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయని చామల ఆరోపించారు. ఎల్‌నినో ప్రకృతి పరిణామమని, దాన్ని ఎవరూ సృష్టించలేరని పేర్కొన్నారు. సుమారు 150 ఏళ్ల తర్వాత ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని, దీనిపై కూడా రాజకీయాలు చేస్తూ బీఆర్ఎస్ విషప్రచారం చేస్తోందని విమర్శించారు.

28న ఎల్‌నినోపై అఖిలపక్ష భేటీ

ఎల్‌నినో, కరువు పరిస్థితులపై ఈనెల 28న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు చామల తెలిపారు. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పక్షాలు హాజరై రాష్ట్రాన్ని కరువు పరిస్థితుల నుంచి గట్టెక్కించేందుకు తగిన సూచనలు, సలహాలు అందించాలని ఆయన కోరారు.

కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం

- కరువుపైనా బీఆర్ఎస్ అసత్య ప్రచారం
- కేటీఆర్‌పై సంచలన ఆరోపణలు చేసిన బల్మూరి వెంకట్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26 : కమిషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి, రాష్ట్ర ప్రజలను కరువులోకి నెట్టింది కల్వకుంట్ల కుటుంబమేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కన్నేపల్లి పంప్‌హౌస్‌ను కేటీఆర్ కన్నెపిల్లగా సంబోధించడంపై ఎద్దేవా చేశారు. కాళేశ్వరంపై వాస్తవాలను దాచిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు కరువుపైనా అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వం ప్రజలకు వాస్తవాలు వివరిస్తోందన్నారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల వద్ద నీటిని ఎత్తిపోస్తున్నామని తెలిపారు. ఎల్లుండి జరిగే ఎల్‌నినో అఖిలపక్ష సమావేశానికి కేసీఆర్‌ను తీసుకురావాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు.

కేటీఆర్‌పై తీవ్ర ఆరోపణలు

కేటీఆర్ అధికారాన్ని అడ్డుపెట్టుకొని పలువురు మహిళలను వేధించారని బల్మూరి సంచలన ఆరోపణలు చేశారు. ఆయన వేధింపులు భరించలేక కొందరు హైదరాబాద్ విడిచి వెళ్లిపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వ సొమ్ముతో ప్రైవేటు విమానాల్లో విలాసాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కే రామ్, రామ్ కేటీ వంటి మారుపేర్లతో విదేశీ ప్రయాణాలు చేశారని, ఆయనతో వెళ్లిన మహిళా ప్రముఖుల వివరాలు తనకు తెలుసన్నారు. తన ఆరోపణలను ఆధారాలతో నిరూపించేందుకు సిద్ధమని సవాల్ చేశారు. కేటీఆర్ అసలు పేరు అజయ్ అని, ఎమ్మెల్యే టికెట్ కోసమే కేసీఆర్ ఆయన పేరు మార్చారని వ్యాఖ్యానించారు.

అంతర్రాష్ట్ర ఏటీఎం చోరీ ముఠా గుట్టురట్టు

- రాజస్థాన్‌లో ప్రధాన నిందితుడి అరెస్టు
- రూ.25.45 లక్షల చోరీ కేసును ఛేదించిన కామారెడ్డి పోలీసులు

కామారెడ్డి, వెలుతురు, అక్టోబర్ 26: గాంధారిలోని ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.25.45 లక్షల చోరీ కేసును కామారెడ్డి పోలీసులు ఛేదించారు. రాజస్థాన్‌కు చెందిన ప్రధాన నిందితుడు రషీద్ (30)ను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర వెల్లడించారు. అక్టోబర్ 10 అర్ధరాత్రి దుండగులు నైటీలు, మాస్కులు ధరించి ఏటీఎం సీసీ కెమెరాలపై నల్లరంగు చల్లి, గ్యాస్ కట్టర్‌తో యంత్రాన్ని ధ్వంసం చేసి నగదు ఉన్న ఐదు బాక్సులను అపహరించారు. నకిలీ నంబర్ ప్లేట్లతో కూడిన స్కార్పియో వాహనంలో పరారయ్యారు. కేసు ఛేదనకు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఐదు రాష్ట్రాల్లో గాలింపు చేపట్టిన పోలీసులు అక్టోబర్ 20న రాజస్థాన్‌లోని బరోడామేవ్ సమీపంలో రషీద్‌ను పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.29,400 నగదు, రెండు సెల్‌ఫోన్లు, స్కార్పియో వాహనం, గ్యాస్ కట్టింగ్ పరికరాలు, కత్తులు, ఇనుప రాడ్, నకిలీ నంబర్ ప్లేట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని సోమవారం న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు, పరారీలో ఉన్న మిగతావారిని త్వరలో పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన డీఎస్పీ శ్రీనివాసరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, ఎస్సైలు ఆంజనేయులు, పుష్పరాజ్‌తో పాటు పోలీసు సిబ్బందిని అభినందించారు.

బ్రిక్స్ సమావేశాలకు

స్పీకర్ గడ్డం ప్రసాద్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26 : ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొనేందుకు తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం బయలుదేరి వెళ్లారు. శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఉదయం ఢిల్లీకి పయనమయ్యారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఆయన మాట్లాడుతూ.. బ్రిక్స్ సమావేశాల వేదికపై తెలంగాణ గొంతును బలంగా వినిపిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రగతితోపాటు తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలను సమావేశాల్లో వివరిస్తామన్నారు. అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ ఖ్యాతిని మరింత పెంచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. స్పీకర్ పర్యటన విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షించారు.

భారత మహిళా క్రీడాకారిణుల

విజయాలు దేశానికి గర్వకారణం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26 : అంతర్జాతీయ క్రీడా వేదికలపై భారత మహిళా క్రీడాకారిణులు సాధిస్తున్న అద్భుత విజయాలు దేశానికి గర్వకారణమని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మహిళల యూరోపియన్ చెస్ క్లబ్ కప్‌లో వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకం సాధించిన ప్రముఖ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి, ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు మంత్రి 'ఎక్స్' వేదికగా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఏళ్ల తరబడి కఠోర శ్రమ, త్యాగం, పట్టుదలతోనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని మంత్రి పేర్కొన్నారు.

కోనేరు హంపి, పీవీ సింధు తమ అద్భుత ప్రదర్శనలతో దేశ గౌరవాన్ని మరింత పెంచారని కొనియాడారు. వారి విజయాలు దేశంలోని ఎందరో యువతులకు స్ఫూర్తినిస్తూ, పెద్ద కలలు కనడానికి, తమ సామర్థ్యంపై నమ్మకంతో ముందుకు సాగడానికి ధైర్యాన్నిస్తున్నాయని అన్నారు. భవిష్యత్తులోనూ వీరిద్దరూ మరెన్నో విజయాలు సాధించి భారత ప్రజలకు గర్వకారణంగా నిలవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆకాంక్షించారు.

గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు బాధ్యత ఈసీదే

- నవంబర్ 6తో గడువు ముగియనున్నా బీఎల్‌ఓల నియామకం లేదు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26 : గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంలో జరుగుతున్న తప్పిదాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం ఎన్నికల కమిషన్ సీఈఓ సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం అందజేసింది. ఓటరు నమోదు బాధ్యత ముమ్మాటికీ ఎన్నికల కమిషన్‌పైనే ఉందని తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సహకారంతో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ ఎన్నికల కమిషన్ బాధ్యతగా వ్యవహరించడం లేదని విమర్శించారు. నవంబర్ 6తో గడువు ముగియనుండగా, ఇప్పటివరకు కనీసం బూత్ స్థాయి అధికారులను (బీఎల్‌ఓలను) కూడా నియమించలేదని, ఓటరు నమోదుపై ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించలేదని పేర్కొన్నారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ద్వారా లక్షలాది ఓట్లు తొలగించిన ఎన్నికల కమిషన్.. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు విషయంలో మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ స్పందించి ఇంటింటికీ వెళ్లి ప్రతి గ్రాడ్యుయేట్‌ను ఓటరుగా నమోదు చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు.

వాల్మీకి మహర్షి ఆశయాలు సమాజానికి స్ఫూర్తిదాయకం

మక్తల్‌లో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

మక్తల్, వెలుతురు, అక్టోబర్ 26 : వాల్మీకి మహర్షి జీవితం, ఆయన బోధనలు సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి. మక్తల్ పట్టణంలో నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సాహిత్య చరిత్రలో వాల్మీకి మహర్షికి విశిష్టమైన స్థానం ఉందన్నారు. రామాయణ మహాకావ్యాన్ని రచించి, ప్రపంచానికి ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువలను చాటిచెప్పిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. ఆయన రచించిన రామాయణం తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తూ, సమాజానికి నైతిక విలువలను బోధిస్తోందని పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి జీవితం పరివర్తనకు ప్రతీకగా నిలుస్తుందని, మనిషి తన ఆలోచనలు, ఆచరణ ద్వారా ఉన్నత స్థాయికి ఎదగవచ్చనే సందేశాన్ని ఆయన జీవితం అందిస్తుందని అన్నారు. వాల్మీకి మహర్షి బోధనలు నేటి సమాజానికి కూడా ఎంతో అవసరమని, ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని మంత్రి పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించడంతో పాటు వారి సేవలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి, సమానత్వానికి, సామాజిక ఐక్యతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి అభిప్రాయపడ్డారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వాల్మీకి సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి పూర్వ వైభవం

- 10రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల ఫైనల్ బిల్లుల చెల్లింపు
- పాలేరు నియోజవర్గ పర్యటనలో మంత్రి పొంగులేటి వెల్లడి

వెలుతురు ఖమ్మం, నేలకొండపల్లి అక్టోబర్ 26: పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లిలో ఉన్న 3వ శతాబ్దానికి చెందిన చారిత్రక బౌద్ధ స్తూపాన్ని, పరిసర ప్రాంతాలను అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం నేలకొండపల్లిలో పర్యాటక సదుపాయాల కల్పన, బౌద్ధ స్థల సంరక్షణ/పునరుద్ధరణ పనులకు మంత్రిగారు శంకుస్థాపన వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 3 వ శతాబ్దానికి చెందిన బౌద్ధ స్థూపాన్ని సుమారు 50-55 సంవత్సరాల క్రితం నేలకొండపల్లి గ్రామంలో గుర్తించారని, దేశంలోనే అత్యంత పెద్ద బౌద్ధ స్తూపాల్లో ఒకటిగా నిలిచిందని తెలిపారు. గత ప్రభుత్వాలు ఈ ప్రాంత అభివృద్ధిని ప్రారంభించినప్పటికీ పనులు పూర్తి చేయలేకపోయాయని అన్నారు. స్తూపం చుట్టూ ఉన్న ఒకటిన్నర కిలోమీటరు పరిధిలో పురావస్తు శాఖ అధికారులు గతంలో జరిపిన తవ్వకాల్లో ఎన్నో పురాతన వస్తువులు లభ్యమయ్యాయని, వాటిని భద్రపరిచేందుకు స్థానికంగా వసతులు లేకపోవడంతో హైదరాబాద్ మ్యూజియంలో ఉంచారని తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు ప్రపంచవ్యాప్తంగా వచ్చిన బౌద్ధ మతస్థులు, స్థానికుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని, రాబోయే రోజుల్లో బౌద్ధ కట్టడాలపై అవగాహన ఉన్న ప్రముఖ నిపుణులను, అధికారులను ఇక్కడికి ఆహ్వానించి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని అన్నారు. తన పాలేరు నియోజకవర్గంలో మంత్రిగారు విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడమేగాక వివిధ ప్రగతి పనులకు శంకుస్థాపనలు చేశారు.

10రోజుల్లో ఫైనల్ బిల్లుల చెల్లింపు

రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫైనల్ బిల్లులన్నింటినీ రాబోయే 10 రోజుల్లోగా లబ్ధిదారుల ఖాతాల్లో ఎలాంటి లంచాలకు తావు లేకుండా జమ చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని మంత్రి పొంగులేటి ప్రకటించారు. నేలకొండపల్లి రైతు వేదికలో నేలకొండపల్లి మండల లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ నేలకొండపల్లి మండలంలో మొదటి విడత కింద మంజూరైన 648 ఇళ్లలో సుమారు 620 ఇళ్లు పూర్తయ్యాయని, వివిధ కారణాల వల్ల మిగిలిన ఇళ్లను కూడా త్వరలోనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, కరెంటు, నీటి సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో రైతన్నలు నష్టపోకూడదనే ఉద్దేశంతో రెండో పంట వేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నట్లు మంత్రి అన్నారు. అంతకుముందు మంత్రి నేలకొండపల్లి మండలం అనాసాగరం నుండి పమ్మి వరకు 2.5 కిలోమీటర్ల మేర 2.80 కోట్ల అంచనా వ్యయంతో బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు. పాలేరు నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై అన్ని ఇంజనీరింగ్ శాఖల అధికారులతో మంత్రిగారు సమీక్షా సమావేశం నిర్వహించారు. కుసుమంచి మండలం, గోరిల్లపాడు తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని మంత్రి పొంగులేటి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ దివాకర టిఎస్, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మండల ఎంపీడీవో ఎర్రయ్య, తహశీల్దార్ రాంప్రసాద్, స్థానిక సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి తన పర్యటనలో భాగంగా ఏదులాపురం మున్సిపాలిటీలోని నాయుడుపేట జంక్షన్, టి.సి.వి. రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం-వరంగల్-నల్గొండ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశానికి హాజరయ్యారు

కాలువలే కాదు

రోడ్లు వదలకుండా కబ్జాలు

- ఆక్రమణలు తొలగించాలంటూ హైడ్రాకు వినతులు
- హైడ్రా ప్రజావాణికి మొత్తం 42 ఫిర్యాదులు

హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 26: వరద కాలువలే కాదు.. ప్రతిరోజూ తిరిగాడే రహదారులను కూడా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని హైడ్రా ప్రజావాణిలో పలువురు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. ఒకరిని చూసి మరొకరు ఇలా నిర్మించుకుంటూ పోతున్నారంటూ పేర్కొన్నారు. జీడిమెట్ల పరిధిలోని సుభాష్ నగర్, ఫాక్స్ సాగర్ చెరువు సమీపంలోని వెంకటాద్రి నగర్‌లో శ్రీ రాజరాజేశ్వరి ఆలయం సమీపంలో ప్రభుత్వ రహదారిన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారంటూ వెంకటాద్రి నగర్ హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోందన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం రాగన్నగూడలోని శ్రీశ్రీ విహార్‌లో వరద కాలువను ఆక్రమించినట్టు రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హైడ్రాకు ఫిర్యాదు చేసింది. స్థలాన్ని పరిశీలించి, ఆక్రమణలు నిర్ధారణ అయితే చర్యలు తీసుకుని నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని కోరింది. యెల్లారెడ్డిగూడలోని జె.పి. నగర్‌లో 40 అడుగుల వెడల్పు ఉండాల్సిన రోడ్డు క్రమంగా కుంచించుకుపోయి 25 అడుగులకే పరిమితమైందని స్థానికులు హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. రోడ్డును ఆక్రమించి కమర్షియల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, దీనివల్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం సిరిగిరిపూర్ గ్రామంలోని చోటా కుంట చెరువు ఎఫ్‌టీఎల్‌ను పునఃసర్వే చేసి, హద్దులను ఖరారు చేయాలని పట్టాదారులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చెరువు పరిధిలోని డంప్ యార్డును తరలించాలని, చెరువు భూమిలో కేటాయింపులను రద్దు చేయాలని, దిగువ నాలాలు, డ్రైనేజీలపై ఆక్రమణలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలా సోమవారం ప్రజావాణికి మొత్తం 42 ఫిర్యాదులు రాగా వాటిని హైడ్రా అడిషనల్ కమిషనర్ డి. ఆనంద్‌కుమార్ పరిశీలించి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అందజేశారు.

జగమెరిగిన
దౌత్యవేత్త కె. ఆర్.నారాయణన్

-అక్టోబర్ 27 దివంగత రాష్ట్రపతి జయంతి

పాత్రికేయునిగా, అధ్యాపకునిగా, ఉద్యోగిగా, విదేశాల్లో భారత విదేశాంగ శాఖ ప్రతినిధిగా, భారత రాయబారిగా, అత్యుత్తమ దౌత్యవేత్తగా, విదేశాంగశాఖ సెక్రటరీగా, వైస్ ఛాన్సలర్ గా, మూడుసార్లు ఎంపీగా, కేంద్ర మంత్రిగా, ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా, కే. అర్. నారాయణ్ అందించిన బహుముఖ సేవలు చిరస్మరణీయాలు. కొచెరిల్ రామన్ నారాయణన్ (కె.ఆర్.నారాయణన్) (1920 అక్టోబర్ 27 - 2005 నవంబరు 9) పెరుమథనం, ఉఝవూర్ గ్రామంలో పేద దళిత కుటుంబంలో కొచెరిల్ రామన్ వైద్యర్, పున్నత్తురవీట్టిల్ పాపియమ్మ దంపతులకు జన్మించారు. నారాయణన్ వాస్తవానికి 4 ఫిబ్రవరి 1921 న జన్మించినట్లు చెపుతారు. అయితే ఆయన మేనమామ, పాఠశాలలో యాదృచ్ఛికంగా 27 అక్టోబర్ 1920ను నమోదు చేయించినట్లు చెపుతారు. అదే తేదీని నారాయణన్ తన పుట్టిన తేదీగా ఎంచుకుని, అధికారికంగా ఉండటానికి అనుమతించారు. అలా అధికారిక రికార్డుల ప్రకారం, తేదీ 27 అక్టోబర్ 1920 జన్మదినం అయింది. ఆయన భారతదేశ 10వ రాష్ట్రపతి. నారాయణన్ సెయింట్ జాన్స్ హైస్కూలు కూతట్టుకుళంలో అనంతరం సెయింట్ మేరీ హైస్కూలు, కురవిలంగడ్ లో చదివి మెట్రిక్యులేషన్ (1936--37) పూర్తి చేసారు. ఇంటర్మీడియట్ విద్యను కొట్టయంలోని సి.ఎం.ఎస్ కళాశాలలో (1938--40) పూర్తి చేసారు. నారాయణన్ బి.ఎ (ఆనర్స్), ఆంగ్ల సాహిత్యంలో ఎం.ఎ డిగ్రీలను ట్రావెన్స్‌కోర్ విశ్వ విద్యాలయం (ప్రస్తుతం కేరళ విశ్వ విద్యాలయం) నుండి పూర్తిచేసారు. విశ్వ విద్యాలయంలో ప్రథమ శ్రేణిలో (ట్రావెన్స్‌కోర్ లో డిగ్రీలో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడైన మొదటి దళిత విద్యార్థి) ఉత్తీర్ణుడయ్యారు. ఆయన కుటుంబం తీవ్రమైన యిబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఢిల్లీ వెళ్ళి ది హిందూ, ది టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికలలో పాత్రికేయుడిగా (1944--45) పని చేసారు. ఎం.మున్షీ ప్రచురిస్తున్న సోషల్ వెల్ఫేర్ వారపత్రికకు లండన్ విలేకరిగా వ్యవహరించారు. పాత్రికేయులుగా కొంతకాలం పనిచేసిన తర్వాత, ఉపకార వేతనం సహాయంతో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో రాజకీయ శాస్త్రాన్ని అధ్యయనం చేసారు. నెహ్రూ ప్రభుత్వంలో భారత విదేశాంగ శాఖలో ఉద్యోగిగా నారాయణన్ తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. నారాయణన్ ప్రతిభను గుర్తించిన జవహర్ లాల్ నెహ్రూ ఆయనను రంగూన్ లోని భారత విదేశాంగ శాఖలో భారతదేశ ప్రతినిధిగా నియమిం చారు. ఆయన జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్, థాయ్‌లాండ్, టర్కీ, చైనా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు దేశాలలో భారత రాయబారిగా పనిచేసారు. అమెరికాలో భారత రాయబారిగా 1980 నుండి 1984 వరకూ నాలుగేళ్ళు పనిచేసారు. ఆయనను దేశంలో అత్యుత్తమ దౌత్యవేత్తగా నెహ్రూ పేర్కొన్నారు. 1949లో భారత విదేశాంగ సర్వీసులో (ఐ.ఎఫ్.ఎస్) నెహ్రూ అభ్యర్థన మేరకు చేరారు. దౌత్యవేత్తగా రంగూన్, టోక్యో, కెనడా , హనోయ్ లలో పని చేసారు. థాయ్‌లాండ్ (1967--69), టర్కీ (1973--75), చైనా(1976--78) ల భారత అంబాసిడర్ గా ఉన్నారు. 1954 లో ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ లో బోధించారు. అతను జవహర్‌లాల్ నెహ్రూ ఫెలోషిప్(1970--72) పొందారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో సెక్రటరీగా (1976) ఉన్నారు. 1978 లో పదవీ విరమణ చేసిన తరువాత అతను న్యూఢిల్లీ లోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయానికి వైస్-ఛాన్సలర్ గా 1979 జనవరి 3 నుండి 1980 అక్టోబరు 14 వరకు పనిచేసారు. ఈ అనుభవం తన ప్రజా జీవితానికి పునాదిగా ఆయన అభివర్ణించాడు. తరువాత పదవీ విరమణ నుండి తిరిగి వచ్చి ఇందిరా గాంధీ ప్రభుత్వ కాలంలో 1980 నుండి 84 వరకు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో భారత అంబాసిడర్ గా తన సేవలనందించారు.ఇందిరా గాంధీ అభ్యర్థన మేరకు రాజకీయాల లోనికి ప్రవేశించారు. 1984, 1989, 1991 లలో వరుసగా మూడు సార్లు పాలక్కాడ్ (కేరళ) లోని ఒట్టపాళం నియోజక వర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొంది లోక్‌సభకు ఎన్నికయ్యారు. రాజీవ్ గాంధీ కేబినెట్ లో రాష్ట్ర వ్యవహారాల మంత్రిగా ఉన్నారు. 1992 ఆగస్టు 21 న నారాయణన్ భారత ఉప రాష్ట్రపతిగా ఎన్నుకోబడ్డారు.

-రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్

మీడియా మాయాజాలం
కౌన్సెలింగ్ అత్యవసరమా?

వ్యాసకర్త: ఫిరోజ్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
ఫోన్: 9640466464

చేతిలో స్మార్ట్‌ఫోన్.. క్షణాల్లో ప్రపంచ వార్తలు.. నిరంతరం మోగే నోటిఫికేషన్లు.. అంతులేని వీడియోలు! సమాచా రాన్ని వేగంగా అందిస్తున్న డిజిటల్ ప్రపంచం మనిషి జీవితాన్ని సులభతరం చేస్తోంది. కానీ ఇదే సమాచార ప్రవాహం కొందరి మానసిక ప్రశాంతతను దెబ్బతీస్తోందా? వార్తలు తెలుసుకోవాలనే ఆసక్తి ప్రతి విషయాన్నీ పదేపదే చూడాలనే అలవాటుగా మారుతోందా? సామాజిక మాధ్యమాల్లో ఇతరుల విజయాలు, విలాసవంతమైన జీవితాలను చూసి తమను తాము తక్కువగా భావించే పరిస్థితి ఏర్పడుతోందా? ఈ ప్రశ్నలు వ్యక్తిగత అలవాట్లకే పరిమితం కావడం లేదు. డిజిటల్ సమాజం ఎదుర్కొంటున్న కీలక సవాలుగా మారుతున్నాయి. వినియోగదారులు ఎక్కువసేపు తెరపై ఉండేలా పనిచేసే సిఫారసు వ్యవస్థలు, సంచలనాత్మక శీర్షికలు, నిరంతర నోటిఫికేషన్లు ఈ ప్రభావాన్ని పెంచవచ్చు.

ముఖ్యంగా ప్రతికూల వార్తలను పదేపదే చూస్తూ, ఫోన్‌ను పక్కన పెట్టలేని అలవాటును 'డూమ్‌స్క్రోలింగ్' అంటారు. దీనివల్ల కొందరిలో ఆందోళన, మానసిక అలసట పెరిగే అవకాశం ఉంది. మరి సమాచారాన్ని అందించే సాధనమే మన ప్రశాంతతకు సవాలుగా మారుతున్నప్పుడు, దాన్ని ఎలా ఎదుర్కోవాలి? కౌన్సెలింగ్ ఎప్పుడు అవసరమవుతుంది?

అంతులేని ఫీడ్.. అంతరించే ప్రశాంతత!

డిజిటల్ వేదికల ప్రభావం ప్రతి ఒక్కరిపై ఒకేలా ఉండదు. వార్తలు తెలుసుకోవడం, విద్యా సమాచారం పొందడం, కుటుంబ సభ్యులతో సంబంధాలు కొనసాగించడం వంటి ప్రయోజనాలు వాటితో సాధ్యమవుతున్నాయి. సమస్య వాటి వినియోగం హద్దులు దాటినప్పుడు మొదలవుతుంది. నిరంతర నోటిఫికేషన్లు ఏకాగ్రతను దెబ్బతీయవచ్చు. నిద్రకు ముందు ఎక్కువసేపు ఫోన్ చూడటం విశ్రాంతికి ఆటంకం కలిగించవచ్చు. సామాజిక మాధ్యమాల్లో కనిపించే ఇతరుల విజయాలతో తమ జీవితాలను పోల్చుకోవడం కొందరిలో అసంతృప్తిని పెంచవచ్చు. నిర్ధారణ కాని సమాచారం భయాన్ని, గందరగోళాన్ని సృష్టించవచ్చు. అయితే ప్రతి మానసిక సమస్యకూ డిజిటల్ వినియోగమే కారణమని చెప్పడం సరైంది కాదు. కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగ ఒత్తిడి, వ్యక్తిగత అనుభవాలు, ఆరోగ్య సమస్యలు కూడా ప్రభావం చూపుతాయి. అందుకే వ్యక్తిని నిందించడం కంటే సమస్య స్వరూపాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. సమాచారాన్ని నమ్మేముందు దాని మూలాన్ని పరిశీలించడం, అవసరం లేని నోటిఫికేషన్లను నిలిపివేయడం, వార్తలు చూసే సమయాన్ని పరిమితం చేసుకోవడం, నిద్రకు ముందు ఫోన్‌కు దూరంగా ఉండటం వంటి మార్పులు ఉపయోగపడతాయి. ఫోన్ వినియోగం పనులకు, నిద్రకు, వ్యక్తిగత సంబంధాలకు ఆటంకం కలిగిస్తోందా అనే విషయాన్ని గమనించడం ద్వారా సమస్యను ముందుగానే గుర్తించవచ్చు.

మౌనంగా మదనపడాలా..
నిపుణుల సాయం పొందాలా?

ఫోన్ ఎక్కువగా చూస్తున్న ప్రతి ఒక్కరికీ కౌన్సెలింగ్ అవసరమని చెప్పలేం. అయితే ఆందోళన, నిద్రలేమి, నిరంతర దిగులు, ఏకాగ్రత లోపం లేదా రోజువారీ పనులు, చదువు, ఉద్యోగం, కుటుంబ సంబంధాలపై ప్రభావం చూపే ఇబ్బందులు కొనసాగితే అర్హత కలిగిన మానసిక ఆరోగ్య నిపుణుడిని సంప్రదించడం మంచిది. కౌన్సెలింగ్ అంటే తీవ్రమైన సమస్యలు ఉన్నవారికే పరిమితమైన సేవ కాదు. భావాలను అర్థం చేసుకోవడానికి, ఒత్తిడిని ఎదుర్కొనే పద్ధతులు నేర్చుకోవడానికి, ఆరోగ్యకరమైన అలవాట్లు ఏర్పరచుకోవడానికి కూడా ఇది తోడ్పడుతుంది. కుటుంబ సభ్యులు విమర్శించకుండా వినడం, పిల్లలు ఫోన్‌ను ఎందుకు ఎక్కువగా ఉపయోగిస్తున్నారో తెలుసుకోవడం, పాఠశాలలు, కళాశాలల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడం అవసరం. వ్యాయామం, పఠనం, ప్రత్యక్ష సంభాషణలకు ప్రాధాన్యం ఇవ్వడం మానసిక సమతుల్యతకు దోహదపడతాయి. అయితే ఇబ్బందులు తీవ్రంగా ఉన్నప్పుడు అలవాట్ల మార్పులే సరిపోతాయని భావించకూడదు. పరిస్థితిని బట్టి నిపుణుల సలహా, కౌన్సెలింగ్ లేదా ఇతర వైద్య సహాయం అవసరమవవచ్చు. మానసిక సమస్యల గురించి బహిరంగంగా మాట్లాడటం, సహాయం కోరేవారిని చిన్నచూపు చూడకపోవడం ఆరోగ్యకరమైన సమాజానికి అవసరం. మనసుకు సంబంధించిన సమస్యను గుర్తించి సహాయం కోరడం బలహీనత కాదు.. మనల్ని మనం కాపాడుకునే బాధ్యతాయుతమైన నిర్ణయం.

సాంకేతికత మన చేతిలోనా..
మనమే దాని చేతిలోనా?

స్మార్ట్‌ఫోన్‌ను మన అవసరాల కోసం వినియోగిస్తున్నామా? లేక ప్రతి నోటిఫికేషన్‌కు స్పందిస్తూ, అంతులేని వీడియోలు చూస్తూ మన సమయాన్ని, ప్రశాంతతను కోల్పోతున్నామా? ఈ ప్రశ్నకు సమాధానం మన డిజిటల్ అలవాట్లలోనే ఉంది. సాంకేతికత మనిషి జీవితాన్ని సులభతరం చేయాలి తప్ప, అతని ఆలోచనలు, నిద్ర, వ్యక్తిగత సంబంధాలను శాసించే స్థాయికి చేరకూడదు. ఈ బాధ్యత వినియోగదారులకే పరిమితం కాదు. వార్తా మాధ్యమాలు, సామాజిక మాధ్యమ వేదికలు కూడా సంచలనాల కంటే వాస్తవాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. సమాచారాన్ని ధృవీకరించడం, వార్తలకు సంబంధించిన తప్పులను సరిదిద్దడం, ప్రజల్లో అనవసర భయాన్ని పెంచకుండా బాధ్యతతో వ్యవహరించడం ముఖ్యం. వినియోగదారులు కూడా ప్రతి సమాచారాన్నీ గుడ్డిగా నమ్మకుండా పరిశీలించడం, తమ డిజిటల్ అలవాట్లపై నియంత్రణ పెంచుకోవడం నేర్చుకోవాలి. కుటుంబంతో గడిపే సమయం, తగిన నిద్ర, ప్రత్యక్ష సంభాషణలకు జీవితంలో తగిన స్థానం ఇవ్వాలి. డిజిటల్ ప్రపంచాన్ని పూర్తిగా దూరం పెట్టడం పరిష్కారం కాదు. దాన్ని విచక్షణతో వినియోగిస్తూ, అవసరమైనప్పుడు నిపుణుల సహాయం పొందడమే వివేకవంతమైన మార్గం. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందిందన్నది కాదు.. దానిపై మనకు ఎంత నియంత్రణ ఉందన్నదే ముఖ్యం. ఫోన్ మన చేతిలో ఉండాలి.. మన జీవితం దాని చేతిలో కాదు.

తెలంగాణ ఉద్యమకారుల వాగ్దానాలు
ఎక్కడ పాయే రేవంత్ రెడ్డి సారూ!

-మన్నారం నాగరాజు
తెలంగాణ లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారుల త్యాగాలకు విలువ లేదా? ప్రత్యేక రాష్ట్రం వస్తే తమ బతుకులు బాగుపడతాయని, తమ పోరాటాలకు గుర్తింపు లభిస్తుందని, తమ కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం దక్కుతుందని ఆశించిన తెలంగాణ సమరయోధులకు నేడు మిగిలింది నిరీక్షణేనా? కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అధికార పీఠాన్ని అధిరోహించడానికి మాత్రమేనా? ఉద్యమకారుల త్యాగాలను గుర్తిస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులకు ఇప్పుడు ఆ త్యాగాలు ఎందుకు గుర్తుకు రావడం లేదు? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారూ.. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులకు ఇచ్చిన మాటలు ఎక్కడ పాయే సారూ! తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే దశాబ్దాలుగా అణచివేతకు గురైన ప్రజలకు న్యాయం జరుగుతుందని, ఉద్యమంలో పాల్గొన్నవారికి సముచిత గౌరవం దక్కుతుందని ప్రజలు ఆశించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, మహిళలు తమ జీవితాలను పణంగా పెట్టారు. కొందరు తమ చదువులను మధ్యలోనే వదిలేశారు. మరికొందరు కుటుంబాలను పక్కనపెట్టి ఉద్యమ బాట పట్టారు. ఇంకొందరు పోలీసు కేసులు, జైళ్లు, నిర్బంధాలు ఎదుర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం కోసం జరిగిన పోరాటంలో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి. మరెన్నో జీవితాలు తీరని గాయాలను మోశాయి. వీరందరి త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందనే చారిత్రక సత్యాన్ని ఎవరూ విస్మరించలేరు. అలాంటి ఉద్యమకారులకు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత లేదా? ఉద్యమకారులకు నెలకు రూ.25 వేల పింఛను, 250 గజాల ఇంటి స్థలం కల్పిస్తామన్న హామీల పరిస్థితి ఏమిటి? ఈ హామీలు కేవలం ఎన్నికల సభల్లో ప్రజలను ఆకట్టుకోవడానికి చెప్పిన మాటలేనా? ఉద్యమకారుల జీవితాల్లో వెలుగులు నింపుతామని చెప్పిన నాయకులు, ఇప్పుడు వారి గోడును వినడానికి కూడా సమయం కేటాయించలేకపోతున్నారా? అధికారం కోసం హామీలు ఇవ్వడం, అధికారం వచ్చాక వాటిని మరిచిపోవడం రాజకీయాల్లో సాధారణమైపోతే ప్రజాస్వామ్యానికి అర్థం ఏముంటుంది? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారూ.. తెలంగాణ ఉద్యమకారులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. రూ.25 వేల పింఛను ఎప్పుడు అమలు చేస్తారు? 250 గజాల స్థలం ఎప్పుడు అందిస్తారు? అర్హులైన ఉద్యమకారులను గుర్తించి, వారి త్యాగాలకు తగిన గౌరవం ఎప్పుడు కల్పిస్తారు? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా కమిటీలు, సమావేశాలు, పరిశీలనలు అంటూ కాలయాపన చేస్తే ఉద్యమకారుల ఆవేదన ఎలా తీరుతుంది? ప్రభుత్వ నిర్ణయాలకు ఒక గడువు ఉండాలి. ఇచ్చిన హామీలకు అమలు ప్రణాళిక ఉండాలి. ప్రజలకు జవాబుదారీతనం ఉండాలి. ఇవేవీ లేకుండా పాలన సాగిస్తే అది ప్రజాపాలన ఎలా అవుతుంది? ఉద్యమకారుల సమస్యలపై కేకే కమిటీ ఏర్పాటు చేశారు, ఆ కమిటీ నివేదికలు, సిఫారసులు, పరిశీలనల పేరుతో వ్యవహారం ముందుకు సాగడం లేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు. కమిటీలు వేయడం తప్పు కాదు. సమస్యలను అధ్యయనం చేయడం కూడా తప్పు కాదు. కానీ అధ్యయనం పేరుతో సంవత్సరాలు గడిచిపోతే, బాధితుల జీవితాల్లో మార్పు రాకపోతే ఆ కమిటీల వల్ల ప్రయోజనం ఏమిటి? ఉద్యమకారులకు వయసు పెరుగుతోంది. ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. కుటుంబ బాధ్యతలు భారమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వారి సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వానికి ఇంకా ఎంత సమయం కావాలి? ఫైళ్లలో తిరిగే నివేదికల కంటే ఉద్యమకారుల చేతుల్లోకి చేరే పింఛనే వారికి నిజమైన న్యాయం కాదా? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్న తరుణంలోనూ ఈ హామీల అమలుపై స్పష్టత కోసం ఎదురుచూడాల్సి రావడం బాధాకరం. ఈ విషయంలో సోనియా గాంధీకి, రాహుల్ గాంధీకి, ప్రియాంక గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఉద్యమకారుల సమస్యలు గుర్తుకు రావడం లేదా సారూ? తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కాంగ్రెస్ పార్టీ పాత్రను ప్రస్తావిస్తూ రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకునే నాయకులు, అదే తెలంగాణ కోసం పోరాడినవారి సమస్యలను పరిష్కరించడంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నారు? రాష్ట్ర సాధన ఘనతను చెప్పుకునేటప్పుడు ఉద్యమకారులు గుర్తుకు వస్తారు. వారి సంక్షేమం గురించి మాట్లాడాల్సి వచ్చినప్పుడు మాత్రం ఎందుకు మౌనం ఆవరించుకుంటోంది? ప్రభుత్వాలు మారవచ్చు. ముఖ్యమంత్రులు మారవచ్చు. రాజకీయ పార్టీలు తమ విధానాలను మార్చుకోవచ్చు. కానీ ఒక రాష్ట్రం కోసం పోరాడినవారి త్యాగాల విలువ మాత్రం మారకూడదు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం అనేది ఏదో ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం కాదు. అది రాష్ట్ర చరిత్రకు, సామాజిక బాధ్యతకు, ప్రజాస్వామ్య నైతికతకు సంబంధించిన విషయం. ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఒకే రకమైన పరిస్థితులు ఉండకపోవచ్చు. అందుకే అర్హతలను పారదర్శకంగా నిర్ధారించాలి. నిజమైన ఉద్యమకారులకు న్యాయం జరిగేలా వ్యవస్థను రూపొందించాలి. అనర్హులకు ప్రయోజనాలు అందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ ఈ ప్రక్రియ పేరుతో అర్హులైనవారిని కూడా నిరవధికంగా నిరీక్షింపజేయడం మాత్రం సమర్థనీయం కాదు. రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని చేతబట్టి దేశమంతా పర్యటిస్తూ సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడుతున్నారు. ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు, గౌరవం కల్పించాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. మరి తెలంగాణలో ఉద్యమకారులకు న్యాయం చేయడంలో ఆ సమానత్వ స్ఫూర్తి ఎందుకు కనిపించడం లేదు? రాజ్యాంగం చేతిలో ఉండటం మాత్రమే సరిపోదు. దాని విలువలు ప్రభుత్వ నిర్ణయాల్లో ప్రతిబింబించాలి. మాటల్లో సామాజిక న్యాయం, చేతల్లో నిర్లక్ష్యం ఉంటే ప్రజలు ఎలా విశ్వసిస్తారు? దేశానికి సమన్యాయం చేస్తామని చెప్పే నాయకత్వం, తెలంగాణ కోసం పోరాడినవారికి ఇచ్చిన హామీలను నెరవేర్చడం ద్వారానే తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, ప్రజలకు ఇచ్చిన ఇతర హామీల విషయంలోనూ సమగ్రమైన పాలన అందిస్తామని ప్రకటించింది. ఎన్నికల సమయంలో ప్రజల ముందుంచిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ప్రభుత్వానికి మార్గదర్శకాలుగా ఉండాలి. హామీల అమలులో ఎదురయ్యే ఆర్థిక, పరిపాలనా సమస్యలను ప్రజలకు వివరించవచ్చు. అమలు సాధ్యాసాధ్యాలపై స్పష్టత ఇవ్వవచ్చు. అవసరమైతే దశలవారీ ప్రణాళికను ప్రకటించవచ్చు. కానీ మౌనం వహించడం, ప్రశ్నించినవారిని పట్టించుకోకపోవడం, గడువులేని హామీలతో ప్రజలను నిరీక్షింపజేయడం మాత్రం ప్రజాస్వామ్య పాలనకు తగిన విధానం కాదు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటలను అధికారంలోకి వచ్చిన తర్వాత మరిచిపోతే ప్రజల్లో రాజకీయ వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతుంది. ఒక్క హామీ అమలు కాకపోవడం వల్ల కలిగే నిరాశ కంటే, పదేపదే ఇచ్చిన మాటలు నిలబెట్టుకోకపోవడం వల్ల కలిగే అవిశ్వాసం మరింత ప్రమాదకరం. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం కోసం మాత్రమే ఈ ప్రశ్నలు రావడం లేదు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరాలనే ప్రజాస్వామ్య ఆకాంక్ష నుంచి ఈ ప్రశ్నలు పుడుతున్నాయి. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమాన్ని రాజకీయ విమర్శలకు పరిమితం చేయకుండా, ప్రభుత్వ విధానంలో ప్రాధాన్య అంశంగా చూడాల్సిన అవసరం ఉంది. రేవంత్ రెడ్డి సారూ.. తెలంగాణ ఉద్యమకారులు మీ ప్రభుత్వాన్ని అడుగుతున్నది ఏదో అసాధ్యమైన వరం కాదు. తమ త్యాగాలకు గుర్తింపు కావాలని, ఇచ్చిన హామీలకు కార్యరూపం కావాలని, మిగిలిన జీవితాన్ని గౌరవంగా గడిపే అవకాశం కావాలని కోరుతున్నారు. రూ.25 వేల పింఛను, 250 గజాల స్థలం హామీలపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా ప్రకటించాలి. అర్హులైన ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలి. అమలు చేయగలిగిన చర్యలకు నిర్దిష్ట గడువులు ప్రకటించి, వాటి పురోగతిని ప్రజలకు తెలియజేయాలి. కమిటీల నివేదికలు ఉంటే వాటి స్థితిగతులను వెల్లడించాలి. అడ్డంకులు ఉంటే వాటిని అధిగమించడానికి తీసుకుంటున్న చర్యలను వివరించాలి. ఇదే బాధ్యతాయుతమైన పాలన. తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను గౌరవించడం అంటే వారి చిత్రపటాలకు పూలమాలలు వేయడం మాత్రమే కాదు. సభల్లో వారి పోరాటాలను కొనియాడటం మాత్రమే కాదు. వారి కుటుంబాల కష్టాలను గుర్తించి, ఇచ్చిన హామీలను అమలు చేయడమే నిజమైన గౌరవం. ప్రజాపాలన అంటే ప్రజలను ఆశలతో ఎదురుచూడమని చెప్పడం కాదు. ప్రజల సమస్యలకు పరిష్కారాలు చూపించడం. ఉద్యమకారుల విషయంలోనైనా, సామాన్యుల విషయంలోనైనా ప్రభుత్వం మాటకు విలువ ఉండాలి. చివరగా ఒక్కటే ప్రశ్న.. తెలంగాణ కోసం ప్రాణాలను పణంగా పెట్టిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలే అమలు చేయలేకపోతే, ప్రజలకు ఇచ్చిన మిగతా హామీలపై నమ్మకం ఎలా కలుగుతుంది సారూ? తెలంగాణ సాధనలో త్యాగం చేసినవారిని నిరీక్షణలో ఉంచి, ప్రజాపాలన విజయవంతమైందని చెప్పుకోవడం ఎంతవరకు సమంజసం? మాటలు కోటలు దాటితేనే సరిపోదు.. ఆచరణ గడప దాటాలి. హామీలు ఎన్నికల వేదికలకే పరిమితం కాకూడదు.. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలి. తెలంగాణ ఉద్యమకారుల కళ్లలో ఎదురుచూపులు కాదు, గౌరవంతో కూడిన ఆనందం కనిపించినప్పుడే ప్రజాపాలనకు నిజమైన అర్థం చేకూరుతుంది. లేకపోతే ఉద్యమకారుల నోట వినిపించే ప్రశ్న ఒక్కటే "మా త్యాగాలు గుర్తున్నాయా సారూ.. మా హామీలు ఎక్కడ పాయే సారూ!"

సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల రగడ

-గాడిపల్లి సునీల్ గౌడ్
సీనియర్ జర్నలిస్ట్
9502022333

- **మెడికల్ బోర్డు చుట్టూ కార్మికుల ఆందోళన... అర్హులకు న్యాయం జరిగేనా..?**
- **ఏరియా ఆసుపత్రుల్లోనే మెడికల్ బోర్డులు పెండింగ్ నియామకాలు పూర్తి చేస్తామన్న భట్టి విక్రమార్క**

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న సింగరేణి బొగ్గు గని కార్మికుల జీవితాల్లో వారసత్వ ఉద్యోగాల అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. దశాబ్దాల పాటు భూగర్భంలో పనిచేసి అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న కార్మికు లు.. తమ వారసులకు ఉద్యోగాలు అందించి కు టుంబ భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఆశిస్తు న్నారు. అయితే, వైద్యపరమైన అనర్హత నిర్ధారణ ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులు, మెడికల్ బోర్డు సమావేశాల నిర్వహణపై నెలకొన్న సందే హాలు కార్మిక కుటుంబాల్లో ఆందోళనకు కారణమ వుతున్నాయి. వారసత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు అవకాశం దక్కు తోందా? వైద్య పరీక్షల ప్రక్రియలో జాప్యం ఎందుకు జరుగుతోంది? కార్మికుల ఆరోగ్య పరిస్థితులకు తగిన ప్రాధాన్యం లభిస్తోందా? అనే ప్రశ్నలు ఇప్పుడు కోల్‌బెల్ట్ ప్రాంతంలో వినిపిస్తున్నాయి.

దశాబ్దాల సేవకు దక్కాల్సిన భరోసా ఏది...?

సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేయడం అంటే నిరంతరం సవాళ్లతో కూడిన వాతావరణంలో విధులు నిర్వహించడం. భూగర్భంలో బొగ్గు వెలికితీస్తూ రాష్ట్ర విద్యుత్ అవసరాలకు, పారిశ్రామిక ప్రగతికి తోడ్పడుతున్న కార్మికులు అనేక ఆరోగ్యపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. వయసు పెరగడం, విధుల స్వభావం, అనారోగ్య సమస్యల కారణంగా ఇకపై పనిచేయలేని పరిస్థితి ఏర్పడినప్పుడు....నిబంధనల ప్రకారం వైద్యపరమైన అనర్హతను నిర్ధారించి, అర్హులైన వారి వారసులకు ఉద్యోగావకాశం కల్పించే ప్రక్రియపై వారు ఆశలు పెట్టుకుంటున్నారు...అయితే, మెడికల్ బోర్డు ద్వారా అన్‌ఫిట్‌గా ప్రకటించే విషయంలో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొందరు కార్మికులు ఆరోపిస్తున్నారు. నిజంగా ఆరోగ్య సమస్యలతో విధులు నిర్వహించలేని పరిస్థితిలో ఉన్నప్పటికీ, వైద్య పరీక్షల అనంతరం తమకు అనుకూలమైన నిర్ణయం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు కార్మిక వర్గాల్లో చర్చ సాగుతోంది. మరికొందరు దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని చెబుతున్నారు..అయితే, ఈ ఆరోపణలపై సమగ్ర పరిశీలన అవసరం. వైద్యపరమైన అనర్హత నిర్ధారణ అనేది సంబంధిత వైద్య ప్రమాణాలు, సంస్థ నిబంధనల ప్రకారం జరగాల్సిన ప్రక్రియ. అర్హులైన కార్మికులకు న్యాయం జరగడంతో పాటు, నిర్ణయాల్లో పారదర్శకత ఉండటం అత్యంత కీలకం.

బీఆర్ఎస్ హయాంలో ఒకలా..
ఇప్పుడు మరోలా...?

సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల ప్రక్రియపై గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తమకు మెరుగైన పరిస్థితులు ఉండేవని కొన్ని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. అప్పట్లో మెడికల్ బోర్డు సమావేశాలు తరచుగా నిర్వహించి, దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చేవారని వాదిస్తున్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సమావేశాల నిర్వహణ, వైద్య అర్హతల నిర్ధారణ, దరఖాస్తుల పరిష్కారంపై అసంతృప్తి వ్యక్తమవుతోందని ఆరోపిస్తున్నాయి...వందలాది కుటుంబాలు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో.. మెడికల్ బోర్డు ప్రక్రియలో జాప్యం తమ పిల్లల భవిష్యత్తుపై ప్రభావం చూపుతోందని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. అయితే, గత ప్రభుత్వ హయాంలోని విధానాలు, ప్రస్తుత విధానాల మధ్య వ్యత్యాసాన్ని నిర్ధారించాలంటే అధికారిక గణాంకాలు, పెండింగ్ దరఖాస్తుల వివరాలు, వైద్య బోర్డు నిర్ణయాలను పరిశీలించాల్సి ఉంటుంది...రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శల మధ్య అసలు సమస్య మరుగున పడకూడదన్నది కార్మికుల అభిప్రాయం. అర్హత ఉన్నవారికి నిబంధనల ప్రకారం ఉద్యోగాలు అందించడం, అనర్హతపై సందేహాలుంటే అప్పీల్ లేదా పునఃపరిశీలనకు అవకాశం కల్పించడం ద్వారా ఈ వివాదానికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.

భట్టి విక్రమార్క ప్రకటనతో కొత్త ఆశలు....

సింగరేణి కార్మికుల సమస్యలపై ఇటీవల నిర్వహించిన సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, కార్మికులు వైద్య పరీక్షల కోసం కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని సూచించారు...అలాగే, పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఉద్యోగాలకు సంబంధిం చిన న్యాయపరమైన ప్రక్రియలను పూర్తి చేసి, 15 రోజుల్లో నియామక ఉత్తర్వులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు..డిపెండెంట్ ఉద్యోగుల పేర్ల మార్పునకు సంబంధించిన పెండింగ్ సమస్య లను కూడా మానవీయ కోణంలో పరిశీలించాలని సూచించారు. ఈ నిర్ణయాలు అమల్లోకి వస్తే కార్మికులకు ప్రయాణ భారం తగ్గడంతో పాటు, వైద్య పరీక్షలు, దరఖాస్తుల పరిశీలన వేగవం తమయ్యే అవకాశం ఉంది. అయితే, మెడికల్ బోర్డు సమావేశాల నిర్వహణ ఒక్కటే సమస్యకు పూర్తి పరిష్కారం కాదు. నిర్ణీత గడువులో పరీక్షలు నిర్వహించడం, ఫలితాలను పారదర్శకంగా వెల్లడిం చడం, అర్హత సాధించిన వారసులకు నియామక ప్రక్రియను పూర్తి చేయడం కూడా అంతే ముఖ్యం.

ప్రకటనలు అమలయ్యేనా.? కార్మికుల ఎదురుచూపులు...

ప్రభుత్వం ప్రకటించిన చర్యలు క్షేత్రస్థాయిలో ఎంత వేగంగా అమలవుతాయన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. ప్రతి ఏరియా ఆసుపత్రిలో మెడికల్ బోర్డు ఏర్పాటు, నిర్ణీత తేదీల్లో సమావేశాలు, పెండింగ్ దరఖాస్తుల వివరాల వెల్లడితో పాటు వైద్యపరమైన నిర్ణయాలపై స్పష్టత ఇవ్వాలని కార్మికులు కోరుతున్నారు. అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కార్మికులకు వైద్యపరమైన న్యాయం జరగాలి. అదే సమయంలో, వారసత్వ ఉద్యోగాలకు సంబంధించిన నిబంధనలు అందరికీ సమానంగా అమలవ్వాలి..అర్హులైన వారసులకు నియామకాలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వైద్య అర్హతల నిర్ధారణపై అనుమానాలు వ్యక్తమైతే వాటిని పరిష్కరించే వ్యవస్థ ఉండాలి...సింగరేణి కార్మికులు కేవలం ఉద్యోగులు మాత్రమే కాదు.. రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములు. వారి కుటుంబాల భవిష్యత్తుకు సంబంధించిన ఈ సమస్యను రాజకీయ వివాదాలకు పరిమితం చేయకుండా, పారదర్శకమైన పరిపాలనతో పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు సింగరేణి యాజమాన్యంపైనా ఉంది....ప్రభుత్వాలు మారినా కార్మికుల కష్టాలు మారకూడదు. భూగర్భంలో బొగ్గు వెలికితీసి రాష్ట్రానికి వెలుగులు అందించే కార్మికుల కుటుంబాల్లోనూ భరోసా వెలగాలి. భట్టి విక్రమార్క ప్రకటించిన చర్యలు కార్యరూపం దాల్చి, అర్హులైన కార్మికులకు న్యాయం జరిగితేనే వారసత్వ ఉద్యోగాలపై నెలకొన్న ఆందోళనకు తెరపడుతుంది.

పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ

- ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్
- ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, యువత ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి
- టామ్ టామ్ ద్వారా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలి
- సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశం

శంకర్ పల్లి, వెలుతురు అక్టోబర్ 26 :
శంకర్ పల్లి మండల పరిధిలోని పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) వి. ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియకు నవంబర్ 6, 2026 చివరి తేదీ అని ఆయన స్పష్టం చేశారు. 30 అక్టోబర్ 2023 నాటికి డిగ్రీ (పట్టా) పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఈ ఓటరు లిస్టులో పేరు నమోదు చేసుకోవడానికి అర్హులని ఎంపీడీవో తెలిపారు. మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, యువకులు, మేధావులు, నిరుద్యోగులతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ తమతో పాటు తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల చేత తప్పకుండా ఓట్లు నమోదు చేయించాలని కోరారు.

గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలి
మండలంలోని అర్హులైన పట్టభద్రులందరికీ సమాచారం చేరేలా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఎంపీడీవో ఆదేశించారు. ఈ మేరకు మండలంలోని గౌరవ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించి, గ్రామాల్లో టామ్ టామ్ (దండోరా) ద్వారా ఈ సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, గడువు ముగిసేలోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రవీణ్ కుమార్ కోరారు.

శంకర్పల్లి ప్రజావాణికి 17 మంది అధికారుల హాజరు

ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్

శంకర్పల్లి, వెలుతురు అక్టోబర్ 26 :
మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన 17 మంది అధికారులు హాజరయ్యారని శంకర్పల్లి ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ రోజు జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి మొత్తం మూడు దరఖాస్తులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. వచ్చిన మూడు అర్జీలు కూడా రెవెన్యూ రంగానికి (భూమి సంబంధిత సమస్యలు) చెందినవేనని వెల్లడించారు. బాధితుల నుండి స్వీకరించిన ఈ మూడు దరఖాస్తులను తదుపరి విచారణ, త్వరితగతిన పరిష్కారం నిమిత్తం సంబంధిత శంకర్పల్లి తాసిల్దార్‌కు పంపించినట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యం : డీఎస్పీ

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్ సూచించారు. ప్రజల భద్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం దుమ్ముగూడెంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని డీఎస్పీ పేర్కొన్నారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, నేరాల నియంత్రణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను తెరవవద్దని హెచ్చరించారు. బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణకు దోహదపడుతుందని తెలిపారు.

ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం

- శంకర్‌పల్లి మండల రైతుల కోసం 150 క్వింటాళ్ల శనగ విత్తనాలు సిద్ధం
- తక్కువ నీటితో పండే పంటలు సాగు చేయాలని వ్యవసాయ శాఖ సూచన

శంకర్‌పల్లి, వెలుతురు అక్టోబర్ 26 :
తక్కువ నీటితో పండే పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారిణి చైతన్య సూచించారు. ఈ సందర్భంగా ఆమె ఒక ప్రకటనలో మాట్లాడుతూ వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి నీటి లభ్యతలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మండలంలో పంపిణీ చేసేందుకు మొత్తం 150 క్వింటాళ్ల శనగ విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంటల సాగులో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వర్షపాతం అనుకూలంగా లేకపోవడం, సాగునీటి లభ్యత తగ్గడం వంటి పరిస్థితులు ఏర్పడితే వరి సాగు చేసే రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు తమ ప్రాంతంలోని వాతావరణ పరిస్థితులు, భూగర్భ జలాల లభ్యత, నేల స్వభావం, సాగునీటి వసతులను పరిశీలించి పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు.

వరి సాగుకు ప్రత్యామ్నాయంగా శనగ, కుసుమ పంటలు
నీటి వినియోగాన్ని తగ్గించుకోవడంతో పాటు సాగు ఖర్చులను నియంత్రించుకునేందుకు శనగ, కుసుమ వంటి తక్కువ నీటి అవసరమయ్యే పంటలను ప్రత్యామ్నాయంగా సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా నీటి వనరులు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం ద్వారా వాతావరణ ప్రతికూలతల ప్రభావాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చని సూచించారు. మండలంలో అందుబాటులో ఉన్న 150 క్వింటాళ్ల శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విత్తనాల వినియోగం, పంటల ఎంపిక, సాగు పద్ధతులు, విత్తే సమయం వంటి అంశాల్లో వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా అనవసరపు సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు పంట దిగుబడులపై వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలి
రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అంచనా వేసుకుంటూ పంటల సాగుకు ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటలను ఎంపిక చేసుకోవడం, అందుబాటులో ఉన్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవడం, శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించడం ద్వారా వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉంటూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలని, పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె కోరారు.

ప్రభుత్వ వైఫల్యాలపై 'భారతీయ కిసాన్ సంఘ్' సమరభేరి!

- వరంగల్ డిక్లరేషన్ హామీలను నెరవేర్చకుంటే ఉద్యమం తీవ్రతరం.. బీకేఎస్ హెచ్చరిక

శంకర్ పల్లి, వెలుతురు అక్టోబర్ 26 :
రైతాంగానికి ఇచ్చిన వరంగల్ డిక్లరేషన్ హామీలను అమలు చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ రాష్ట్ర భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం

చేసింది. సోమవారం రంగారెడ్డి జిల్లా కంకర్ పల్లి మండల తహశీల్దారు ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి సంఘం ప్రతినిధులు ఒక సమగ్ర విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. ప్రభుత్వం ఏర్పాటై మూడు సంవత్సరాలు కావస్తున్నా, నాడు ఇచ్చిన ఏ ఒక్క మాటను కూడా పూర్తిస్థాయిలో నిలబెట్టుకోలేదని, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఈ సందర్భంగా బీకేఎస్ నేతలు మండిపడ్డారు. వెంటనే రైతాంగ సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రైతుల ఓట్లతో గద్దెనెక్కిన పాలకులు నేడు వారి అవసరాలను విస్మరిస్తే ఊరుకునేది లేదని, తమ హక్కుల సాధన కోసం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతాంగం పెద్దఎత్తున ఉద్యమ బాట పడుతుందని ప్రతినిధులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణలో అందరి భాగస్వామ్యం అవసరం

"అసెజ్ వావో" సంస్థ కృషి అభినందనీయం: బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 26:
బ్లూ ఓసియన్ ప్రాజెక్ట్ లో 132 – జీడిమెట్ల డివిజన్ వెన్నెల గడ్డ చెరువు సుందరీకరణ పనులను చేపడుతున్న "అసెజ్ వావో" సంస్థ ప్రతినిధులు సోమవారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బ్లూ ఓసియన్ ప్రాజెక్ట్ లో భాగంగా చెరువుల సుందరీకరణతో పాటుగా పర్యావరణ పరిరక్షణకై చేపడుతున్న చర్యలను ఎమ్మెల్యే కి తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.... జీవ మనుగడతోనే మానవ మనుగడ సాధ్యమని, పర్యావరణ పరిరక్షణలో అందరి భాగస్వామ్యం అవసరమని, చెరువులకు పూర్వ వైభవం తెచ్చేలా "అసెజ్ వావో" సంస్థ చేస్తున్న కృషి అభినందనీయ మని అన్నారు. ఈ కార్యక్రమంలో జెస్సీ తెలంగాణ సంస్థ ప్రతినిధులు కృపాకర్, ఆశిష్, మహేంద్ర, శిరీష, రోషిణి తదితరులు పాల్గొన్నారు. సాయికృష్ణ, వేముల రాజు ,కార్తీక్ లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు అండగా నిలుస్తున్న బిఆర్‌టియు

రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 26:
కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని"దుండిగల్ ఏరియా లోని డబల్ బెడ్ రూమ్ లో" సివిల్ కాంటాక్ట్ వర్కర్స్, కిరణ్ మేస్త్రి, షాహేన్వా, సహిల్, ముగ్గురు భవన నిర్మాణ కాంటాక్ట్ సివిల్ కాంటాక్ట్స్ వర్క్ గత కొన్ని నెలలు నుంచి డబల్ బెడ్ రూమ్ లో సివిల్ కాంటాక్ట్ పని చేసేవారూ... డబల్ బెడ్ రూమ్ లలో ఉన్న ఓనర్ లు పనిచేయించుకొని ఈ ముగ్గురు భవనిర్మాణ కార్మికులకు వేతనం మొత్తం 62,500/– రూపాయలు ఇవ్వాల్సి ఉండగా అవి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండడం తో డబల్ బెడ్ రూమ్ లలో ఉన్న ఓనర్ లు నిర్లక్ష్యం వహిస్తూ ఆ వేతనం ఇవ్వకుండా ముగ్గురు కార్మికులను ఇబ్బంది పెట్టేవారు. వేతనం ఇవ్వాల్సి ఉండగా పలుమార్లు డబుల్ బెడ్ రూములలో ఉన్న ఓనర్లు పని చేయించుకుని వేతనం ఇవ్వకుండా ఎన్నిసార్లు అడిగిన భవన నిర్మాణ సివిల్ కాంటాక్ట్ వర్కర్ ల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన కార్మికులు తమకు తెలిసిన తోటి కార్మికుల ద్వారా మనకు ఎవరైతే న్యాయం చేస్తారో అని తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని తన

కార్యాలయం వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన డబల్ బెడ్ రూములలో ఉండే ఓనర్ ల వద్దకు బయలుదేరి వారితో పలుమార్లు చర్చించి ముగ్గురు కార్మికులకు రావాల్సిన వేతనం మొత్తం 62,500/– రూపాయలు ఇప్పించడం జరిగింది... సివిల్ కాంటాక్ట్ భవన నిర్మాణ కార్మికులు మాట్లాడుతూ ఈ రోజుల్లో కూడా కార్మికులకు న్యాయం చేయడం లో ముందుండి ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా ఊరుకునే ప్రసక్తే లేదని, ప్రతి కార్మికునికి న్యాయం చేస్తున్న రవి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు..

ఆరుట్ల గ్రామంలో కామ్రేడ్ పాషా నరహరి 37వ వర్ధంతి వేడుకలు

- కామ్రేడ్ పాషా నరహరి గార్ల ఆశయాలు సాధిస్తాం
- సిపిఎం పార్టీ మంచాల మండల కమిటీ

సభ్యులు మార బుగ్గ రాములు పుల్లగల్ల గోపాల్

మంచాల వెలుతురు అక్టోబర్ 26:
మంచాల మండలం కామ్రేడ్ పాషా నరహరి గార్ల 37వ వర్ధంతి వేడుకల సందర్భంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆరుట్ల గ్రామంలోని పాషా నరహరిగార్ల. స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు సందర్భంగా సిపిఎం పార్టీ మంచాల మండల కార్యవర్గ సభ్యుడు మారబుగ్గ రాములు మండల కమిటీ సభ్యుడు పుల్లగళ్ల గోపాల్ మాట్లాడుతూ పేద ప్రజలకోసం నిరంతరం శ్రమించే నాయకులను ఆరోజు కాంగ్రెస్ బీజే పీ గుండాలు దారి కాచి చంపారని తెలిపారు ఎన్ని ప్రభుత్వాలు మారిన పేదల సమస్యలు తీర డం లేదని భూసమస్యలు నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కానీ ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కానీ పూర్తిగా విఫ లం అయ్యాయని తెలిపారు సమస్యలపరిష్కా రం కోసం నిరంతరం ఉద్యమాలు పోరాటాలు చేయడంతోనే వారి ఆశయాలు సాధిస్తామని అ న్నారుఈ కార్యక్రమంలో ఆరుట్ల గ్రామశాఖ కా ర్యదర్శులు కొండిగారి బుచ్చయ్య బోయపల్లి అం జయ్య చిందం బీరప్ప నక్కమల్లేష్ మాజీ కో అప్షన్ సభ్యులు మహమ్మద్ యూసఫ్ అలీ కొండిగారి శంకరయ్య బద్దు విజయ్ జోగు శేఖర్ సా తిరి సత్తయ్య అనుపాటి గణేష్ ఎర్పుల వీరేష్ సాతిరి నర్సింగ్ రావు కొండిగారి ప్రసాద్ ఎండీ జావీద్ అర్ల వెంకటేష్ అలవాల భాస్కర్ మహ మ్మద్అఖిల్ తదితరులు పాల్గొన్నారు

ఆరుట్ల శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో అన్నదానం

-34వ సోమవారం అన్నదానం వేణుగోపాలస్వామి భజనమండలి దుర్గామాత వడి బియ్యం

మంచాల వెలుతురు అక్టోబర్ 26:
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలోప్రతిసోమ వా రం గౌడ సంఘం పెద్దల దాతల సహకారంతో శివస్వాముల గురుస్వామి లొంగరి యాదగిరి ఆ ధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం34వ సోమవారం అన్నదాన ప్రభువు వేణుగోపా ల స్వామి భజనమండలి దుర్గామాత వడి బియ్యంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు ముందుగా కంఠమహేశ్వర దేవాలయంలో వేణుగోపాలస్వామి భజనమండలి సభ్యులు మాదు గుల కృష్ణగౌడ్ పుణ్యముత్తి అంజయ్య యాదవ్ నరసింహ సిద్ధగోని రమేష్ గౌడ్ మాడపాకుల యాదగిరి లొంగరి భాస్కర్ ఎన్నుదుల సురేష్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ కంఠమహే శ్వరస్వామికి

శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు అనంతరం భక్తులకు. అన్నప్రసాద కార్యక్ర మం ప్రారంభించారు ఈకార్యక్రమంలోగ్రామపంచాయతీ వార్డుసభ్యురాలు మాదుగులబాలమణి సుంకరి జంగయ్యగౌడ్ చెన్నారెడ్డి గూడ శివ స్వాముల గురుస్వామి రమేష్.ఓరిగంటి శ్రీనివాస్ గౌడ్ మాడపాకుల శేఖర్ సుంకరి లచ్చయ్యగౌడ్ భక్తులు మహిళా భక్తులు పెద్దఎత్తున పాల్గొని అన్నదాన ప్రసాదం స్వీకరించారు

ప్రజావాణి లేని ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రం.

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 26:
రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కొరకు ప్రజలు కలెక్టరేట్ వరకు వెళ్లడం కష్టం కాబట్టి స్థానిక మండల రెవెన్యూ అధికార కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించాలని ఆదేశించి నెలలు గడుస్తున్నా కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికార కార్యాలయంలో ప్రజావాణి నేటి వరకు నిర్వహించక పోవడం అధికారులు ప్రభుత్వ ఆదేశాలను ఉల్లగించడం కిందకే వస్తుందని దానిద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకత వస్తుందని కావున జిల్లా కలెక్టర్ బాధ్యతలు తీసుకొని ప్రజావాణి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, జనసేన అధికార ప్రతినిధి సతీష్ నేడు రెవెన్యూ అధికార కార్యాలయం ఎదురుగా మాట్లాడటం జరిగింది. జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూముల చుట్టూ సర్వే నిర్వహించి ఫెన్సింగ్ నిర్వహించాలని హై కోర్టు తీర్పు ఇచ్చి సమయం గడిచిపోయినప్పటికీ రెవెన్యూ అధికారులు ఇంకా చెయ్యకుండా తాత్సారం చేయవద్దని వెంటనే సర్వే నిర్వహించి ఫెన్సింగ్ చెయ్యాలని కోరుతూ నేడు ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. సుమారు 11 గంటలు అయ్యినప్పటికీ అధికారులు రాకపోవడం, ప్రజావాణి నిర్వహించకపోవడం దారుణమని, అధికారులు ప్రజలు ఇచ్చిన వినతిపత్రంలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన తర్వాత కూడా అనేక ఆలయాలు వెలిశాయి, అనేక స్థలాలు లక్షలకు అమ్ముడుపోయి ఇండ్లు కూడా కట్టుకున్నారని ఇది స్పష్టంగా అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందని ఇప్పటికైనా నిర్లక్ష్యం విడి హైకోర్టు ఆదేశాలను అమలు చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, జనసేన అధికార ప్రతినిధి నందగిరి సతీష్, నాయకులు రుంకు

దాద్ పల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఈశ్వర రామాంజనేయస్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం

మంచాల వెలుతురు అక్టోబర్ 26:
మంచాల మండలం దాద్ పల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఈశ్వర రామాంజనేయ స్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా దేవాలయంలో పూజా కార్యక్రమాలు కుంభాభి షేకాలు మంగళ హా రతి మహా నివేదన అభిషేకాలు మధ్యాహ్నం అన్నప్రసాదాలు సాయంత్రం భక్త సురేష్ గారి ప్రవ చనాలు దేవాలయ ప్రాంగణంలో సాయంత్రం స్వామి వారి ఊరేగింపులు గ్రామంలో అంగరంగ వై భవంగా నిర్వహించినారు భక్తులతో దేవాలయ ప్రాంగణం కిటకిటలాడింది దేవాలయ కమిటీ

చై ర్మన్ నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ నేనావత్ శాంతిరాజు నాయక్ మాజీ వైస్ ఎంపీపీ నర్సింగ్ వెంకటేష్ గౌడ్ ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులుగ్రా మ పెద్దలు వివిధ పార్టీల నాయకులు మహిళలు యువకులు పెద్దఎత్తున పాల్గొనివిజయ వం తంచేశారు

బిఆర్ఎస్ నాయకులు స్థాయికి మించి విమర్శ మానుకోవాలి

మోత్కూర్, అక్టోబర్ 26, వెలుతురు న్యూస్ :
ఎల్‌నినో ప్రభావంతో సంభవించే కరువు పరిస్థితులపై రాష్ట్ర ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు సూచిస్తుంటే, కొందరు బీఆర్ఎస్ నాయకులు అవగాహన లేకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై స్థాయికి మించి విమర్శలు చేస్తున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ బాలరాజు, మోత్కూరు మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం నాగార్జున రెడ్డి విమర్శించారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించడం సరికాదన్నారు. . గోదావరి జలాలను రైతులకు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చి, భారీగా ఖర్చు చేసినా ఆశించిన ఫలితాలు రాలేదని విమర్శించారు. కృష్ణా జలాల తరలింపు విషయంలోనూ గత ప్రభుత్వ విధానాలను ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా నష్టపోయిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తుంటే జీర్ణించుకోలేక కొందరు నాయకులు చౌకబారు విమర్శలు చేస్తున్నారని అన్నారు. ప్రజలను భయాందోళనలకు

గురిచేయడం మానుకుని, వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. ఈ సమావేశంలో పీఏసీసీ చైర్మన్ పెలంపూడి వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సుంకిశాల అనిల్, వార్డు అధ్యక్షులు అవిశెట్టి నాగరాజు, కందుకూరి నరసింహ, కూరెళ్ల అంజయ్య, దేవరపల్లి రంగారెడ్డి, అర్ధ ప్రతాప్‌రెడ్డి, కోమటి జనార్దన్, కందుకూరి మురళి, కూరెళ్ల యాదయ్య, మెంట నరసింహ, ఇంద్రాల భిక్షం, మందుల లింగయ్య, సుంకిశాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మూసీ వాగులో అక్రమ ఇసుక రవాణా

ట్రాక్టర్లు సీజ్

మోత్కూర్, అక్టోబర్ 26, వెలుతురు న్యూస్
అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మోత్కూర్ ఎస్సై కె. సతీష్ హెచ్చరించారు. దత్తప్పగూడెం గ్రామ శివారులోని మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం, ఆదివారం రాత్రి 10:30 గంటల సమయంలో ట్రాక్టర్ డ్రైవర్లు ప్రవీణ్, అనిల్ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, లైసెన్సులు లేకుండా మూసీ వాగులో ఇసుక తవ్వి రెండు ట్రాక్టర్లలో లోడ్ చేసుకుని తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై సతీష్ పోలీసు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకోగా,

డ్రైవర్లు పరారయ్యారు. పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రమాదకర బావిని పరిశీలించిన ఎమ్మెల్యే.

మోత్కూర్, అక్టోబర్ 26, వెలుతురు న్యూస్ :
యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలం పాటిమట్ల గ్రామంలోని బతుకమ్మ ఘాట్ వద్ద ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ప్రమాదకర బావిని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు సోమవారం పరిశీలించారు. గతంలో కురిసిన వర్షాలకు వరద ఉధృతితో రోడ్డు కోతకు గురికావడంతో వాహనదారులు, ప్రయాణికులు పక్కనే ఉన్న బావిలో పడిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ బండ రమ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే దెబ్బతిన్న రోడ్డును, ప్రమాదకర స్థితిలో ఉన్న బావిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, బావి వద్ద తగిన రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నూనెముంతల విమల, గ్రామ సర్పంచ్ బండ రమ, ఉపసర్పంచ్ దండెబోయిన సత్తయ్య, మోత్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాచకొండ బాలరాజు గౌడ్, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు కురిమేటి విక్రమ్ తదితరులు పాల్గొన్నారు

గౌరెల్లి కొత్తగూడెం రహదారిపై ప్రమాదం

మోత్కూర్, అక్టోబర్ 26, వెలుతురు న్యూస్ :
యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారి గౌరెల్లి కొత్తగూడెం మార్గంలోని ప్రధాన రహదారిపై సోమవారం ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో ప్యాసింజర్ ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, టీజీ 26 టి 6335 నంబరు గల ఆటో హైదరాబాద్ నుంచి మహబూబాబాద్ వైపు వెళ్తుండగా పాలడుగు గ్రామ సమీపంలో ప్రమాదానికి గురైంది. ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలు కావడంతో వారు ప్రథమ చికిత్స అనంతరం వెంటనే స్వగ్రామానికి అదే ఆటోలో వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. గౌరెల్లి కొత్తగూడెం మార్గంలోని 930పీ ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో రహదారి వెంట ఉన్న గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాహనాల రాకపోకలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదాలకు కారణాలను గుర్తించి, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వరుస ప్రమాదాలకు అడ్డుకట్ట వేసి ప్రయాణికుల భద్రతకు అధికారులు ప్రాధాన్యమివ్వాలని ప్రజలు కోరుతున్నారు.

డిండి ప్రాజెక్టుకు ఎదుల నుంచి నీరు

కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ ఆనగంటి కృష్ణ

మునుగోడు వెలుతురు అక్టోబర్ 26:

మునుగోడు నియోజకవర్గం రైతుల కలలను సహకారం చేయడంతో పాటు ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో దిండి ఎత్తిపోతల ప్రాజెక్టుకు ఎదుల రిజర్వాయర్ నుంచి వీటిని అందించాలనే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని మునుగోడు కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ ఆనగంటి కృష్ణ అన్నారు సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చొరవతో సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం ఆయన చేస్తున్న నిరంతర కృషి ఫలితంగానే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని అన్నారు

ఎమ్మెల్సీ బరిలో యర్కల శ్రీనివాస్‌గౌడ్

- పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం
- నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీకి ప్రకటన
- ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 26:
పట్టభద్రులు, నిరుద్యోగ యువత, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలవాలని నిర్ణయించుకున్నట్లు అటవీ శాఖలో డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న యర్కల శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. ఈ లక్ష్య సాధన కోసం తన ఉన్నత ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి అడుగుపెడుతున్నట్లు ఆయన వెల్లడించారు .హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. పట్టభద్రుల సమస్యలను పరిష్కరించడంతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తన ప్రధాన లక్ష్యాలని తెలిపారు.

ఉద్యోగాల భర్తీకి సమగ్ర ప్రణాళిక

ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి సమగ్ర ఉద్యోగ క్యాలెండర్ రూపొందించడం, నోటిఫికేషన్లు, పరీక్షలు, ఫలితాల ప్రక్రియను పారదర్శకంగా, నిర్ణీత సమయంలో పూర్తిచేసేలా కృషి చేయడం తన ప్రాధాన్యతలని పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువత కోసం గ్రంథాలయాలు, అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు కెరీర్ మార్గదర్శకత్వం, డిజిటల్ వనరులను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. డిగ్రీ పూర్తిచేసిన యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ తదితర అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందించాలని పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి, ప్రైవేటు రంగంలోనూ స్థానిక పట్టభద్రులకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సేవా సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. సీపీఎస్ రద్దు, ప్రమోషన్లు, బదిలీలు, పెండింగ్ బకాయిలు వంటి అంశాలపై ఉద్యోగుల తరపున కృషి చేస్తానని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, ఉద్యోగ భద్రతకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కూడా ప్రాధాన్యత ఇస్తానన్నారు.

విద్య, మహిళా సాధికారతకు ప్రాధాన్యం

ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలను అభివృద్ధి చేయడంతోపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను సకాలంలో విడుదల చేసే అంశంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య, పోటీ పరీక్షల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక సమాచార, శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు.
మహిళా పట్టభద్రులకు భద్రత, స్వయం ఉపాధి, కెరీర్‌లో తిరిగి కొనసాగేందుకు అవసరమైన అవకాశాలు కల్పించడం, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం తన కార్యాచరణలో భాగమని తెలిపారు. గ్రామీణ యువతకు వ్యవసాయ ఆధారిత పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

పట్టభద్రులకు అందుబాటులో ఉండే నాయకత్వం

నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రులు తమ సమస్యలను నేరుగా తెలియజేసేందుకు ప్రత్యేక సంప్రదింపుల వేదికను ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉన్నట్లు వెల్లడించారు. పట్టభద్రులు, నిరుద్యోగ యువత, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేయాలనే సంకల్పంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తన కార్యాచరణకు పట్టభద్రులు మద్దతుగా నిలిచి, ఎమ్మెల్సీగా సేవలందించే అవకాశం కల్పించాలని యర్కల శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

పట్టభద్రుల ఓట్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: ఎమ్మెల్యే

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో డిగ్రీ అర్హత కలిగిన వారు ఓటును నమోదు చేసుకొని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని అర్హులైన యువతి యువకుల ఓట్లను నమోదు చేయించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. సోమవారం రామన్నపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నల్లగొండ ఖమ్మం వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి కి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున గ్రాడ్యుయేట్ల మద్దతు అందించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రాడ్యూయేట్లను చైతన్యపరిచి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు చేయాలని తెలిపారు. నవంబర్ 6తేదీ లోపు అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటును నమోదు చేసుకోవాలని అర్హత కలిగిన పట్టబదులు ఎవరు ఓటు నమోదు చేసుకునే అవకాశాన్ని కోల్పోకూడదని తెలిపారు. ఓటు నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరు చురుగ్గా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పున్న జగన్మోహన్ మార్కెట్ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, సింగల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి, రామన్నపేట సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు కందిమల్ల గోపాల్ రెడ్డి, కొమ్మయ్య గూడెం సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, పాల్గొన్నారు.

మహర్షి వాల్మీకి బోధనలు సమాజానికి మార్గదర్శకం

జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి

రంగారెడ్డి జిల్లా వెలుతురు అక్టోబర్ 26:
రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె. కిరణ్మయి పాల్గొని మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి రచించిన రామాయణం ధర్మం, నీతి, సత్యం, ఆదర్శ జీవన విలువలను సమాజానికి బోధిస్తుందని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి జీవితం, ఆయన రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. మహర్షి వాల్మీకి బోధించిన విలువలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ సమాజంలో ఐక్యత, సోదరభావం, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి కేశురామ్, అధికారులు, సిబ్బంది, వాల్మీకి సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత

జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

రంగారెడ్డి జిల్లా వెలుతురు అక్టోబర్ 26:
సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 76 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి అర్జీలు సమర్పించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున, ప్రజావాణి ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా, పశువుల సంరక్షణ, వైద్య శిబిరాల నిర్వహణ, వ్యవసాయ ప్రణాళిక, విద్యుత్ సరఫరా అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా తాగునీటి సమస్యలను గుర్తించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పశువులకు తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. రానున్న రబీ సీజన్‌లో వేరుశెనగ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కరపత్రాలు, పోస్టర్లు, ఆడియో, వీడియో మాధ్యమాల ద్వారా వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపికపై రైతులకు సూచనలు అందించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా, ఓవర్‌లోడ్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 39, ఇతర శాఖలకు సంబంధించి 37, మొత్తం 76 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు డాక్టర్ కె. కిరణ్మయి, చంద్ర రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

రంగారెడ్డి జిల్లా వెలుతురు అక్టోబర్ 26:
సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పురోగతి, ఫారం-6, 7, 8 దరఖాస్తుల పెండింగ్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు తదితర ఎన్నికల అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఫారం-6, 7, 8 దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పుగా మ్యాపింగ్ అయిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతలను నిర్ధారించాలని, అనర్హులుగా గుర్తించిన సందర్భాల్లో అందుకు గల కారణాలను సంబంధిత ఆధారాలతో సహా రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సీఈఓ సూచించారు. ఓటరు నమోదు దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 6 చివరి తేదీ అని తెలిపారు. ఫారం-18 ద్వారా అందిన దరఖాస్తులను సంబంధిత అసలు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో క్షుణ్ణంగా పరిశీలించి, నకిలీ, తప్పుడు, డూప్లికేట్ దరఖాస్తులను గుర్తించాలని ఆదేశించారు. అనధికార వ్యక్తుల ద్వారా ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరగకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అర్హులైన పట్టభద్రులకు విస్తృతంగా అవగాహన కల్పించి, గడువులోగా దరఖాస్తులు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని, ఆమోదించిన తిరస్కరించిన దరఖాస్తుల వివరాలను సంబంధిత కార్యాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు.

పెండింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరిస్తాం - జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న ఎన్నికల సంబంధిత దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, స్పష్టమైన కారణాలతో కూడిన స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేస్తామని పేర్కొన్నారు. అనవసర జాప్యాన్ని నివారిస్తూ, పెండింగ్ అంశాలపై నిరంతర పర్యవేక్షణ చేపడతామని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం

- నవంబర్ 1న ఢిల్లీలో 'ఓట్ బచావ్--దేశ్ బచావ్' నిరసన ర్యాలీ
- జహీరాబాద్‌లో ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ నాయకుల చర్చ

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 26:
అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటర్ల జాబితాలోని తప్పులను సరిచేసి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, జహీరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ ఏ. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో 'ఓట్ బచావ్--దేశ్ బచావ్' హక్కుల పరిరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ పరిశీలకుడు సరల్ పటేల్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ నాగరిగారి ప్రీతం, డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ సర్వేలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్లు గుర్తించిన ఓట్ల అంశంపై చర్చించారు. అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి అర్హుడి ఓటును పరిరక్షించడం, జాబితాలోని తప్పులను సరిదిద్దడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.

ఢిల్లీలో భారీ నిరసన ర్యాలీ

ఓటు హక్కుల పరిరక్షణ కోసం నవంబరు 1న దేశ రాజధాని ఢిల్లీలోని

రామ్‌లీలా మైదానంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు తమ గళాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో-ఆర్డినేటర్ మహమ్మద్ గౌస్, ఆత్మ కమిటీ ఛైర్మన్ రామలింగారెడ్డి, మండల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, సువర్ణ, మల్లన్న పాటిల్, పవన్ రాథోడ్, ఉదయ్ శంకర్ పాటిల్, కోహిర్ పట్టణ అధ్యక్షుడు ముజాఫర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్షద్ అలీ, సామెల్, మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మక్సూద్ అహ్మద్, మాజీ పట్టణ అధ్యక్షుడు కండేం నర్సింలు, షంషీర్ అలీ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, కౌన్సిలర్ మహేష్ కుమార్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గెస్ట్ టీచర్లను రెగ్యులర్ చేయాలి

- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి
- ఆర్ కృష్ణయ్య డిమాండ్

వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 26 :
సంగారెడ్డి జిల్లా :- బీసీ,ఎస్సీ,ఎస్టీ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న 8 వేల మంది తాత్కాలిక టీచర్లను వెంటనే రెగ్యులర్ చేయాలని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యకులు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్ లోని బీసీ భవన్లో జరిగిన ఉద్యోగుల సంఘం సమావేశంలో ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ 10,నుండి 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాద్యాయులను రెగ్యులరైజ్ చేయాలని సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పును ఆయన గుర్తుచేశారు.కర్ణాటక, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్ తదితర రాష్ట్రాలలో లక్షలాది మంది తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో కాంట్రాక్ట్ డేలివేజ్ ఉద్యోగులను పర్మినెంట్ చేశారని, అవుట్సోర్సింగ్, పార్ట్ టైం, గెస్ట్ టీచర్, గెస్ట్ లెక్చరర్లు వేల సంఖ్యలో ఉన్నారన్నారు. వీరికి తీరని అన్యాయం జరుగుతుందని, శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. 20 సంవత్సరాలు గడుస్తున్న జీతాలు పెరగడం లేదని, కుటుంబ పోషణ భారం పెరిగి పిల్లల ఫీజులు, ఇంటి అద్దె చెల్లించలేక ఉద్యోగులు ఇబ్బందులకు గురువుతున్నారన్నారు.

బీసీ గురుకుల పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యా యుల బోధన ద్వారానే పరీక్షల్లో 99 శాతం ఫలితాలు సాధించి దేశంలోనే పేరు ప్రతిష్టలు సాధించారని ఆయన పేర్కొన్నారు. ఇంటర్లో 98.5 శాతం సాధించి రికార్డు సృష్టించారని, వీరి బోధన నైపుణ్యం, సీనియారిటీని పరిగణనలోకి తీసుకొని పర్మనెంట్ చేయాలని కోరారు. పర్మనెంట్ చేయడానికి అన్ని విద్యా అర్హతలు ఉన్నాయని, డిగ్రీ, పీజీ, బీఈడీ, టెట్ అన్ని అర్హతలు, బోధన అనుభవం 10, 20 సంవత్స రాలు ఉందని, వీటిని పరిగణనలోకి తీసుకొని పర్మనెంట్ చేయాలని కోరారు. నోటిఫికేషన్ ద్వారా మెరిట్ కమ్ రోస్టర్ ద్వారా ఎంపిక చేశారని, వేరే ఉద్యోగాలను వదలుకొని వచ్చారన్నారు. అంకిత భావంతో పని చేస్తున్నందున వేరే ఉద్యోగంలోకి వెళ్లలేదని చెప్పారు.తాత్కాలిక ఉద్యోగులపై సుప్రీంకోర్టు రాజస్థాన్ కేసులో పర్మినెంట్ చేయాలని తీర్పు చెప్పిందని ఆయన చెప్పారు.సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కూడా సుప్రీం కోర్టు తీర్పు చెప్పిందని, ఈ తీర్పును అమలు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలని ఒక విధాన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

24 గంటలు క్యాంపస్‌లోనే

గోస్కె శ్రీనివాస్, మెదక్ గెస్ట్ టీచర్ల ప్రధాన కార్యదర్శి.

వివిధ గురుకులాలలో పనిచేస్తున్న గెస్ట్ టీచర్లు 24 గంటలు స్కూల్ క్యాంపస్ లోనే ఉండి స్టూడెంట్స్ కి లోకో పేరెంట్ గా,డే డ్యూటీ, నైట్ డ్యూటీ,నైట్ కేర్ టీచర్,హాలిడేస్ డ్యూటీస్ మరియు వివిధ ఇన్చార్జిలుగా పని చేస్తూ,24 గంటలు క్యాంపస్ లోనే ఉండి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటిలు వేస్తున్నారు. ప్రభుత్వం మమ్మల్ని వెంటనే గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా 40 వేల రూపాయల జీతం పెంచి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకొని జస్ట్ టీచర్ల జీవితాలలో వెలుగులు నింపాలని కోరుతున్నాం.

ఉమ్మడి జిల్లా స్థాయిలో ఖేడ్ మైనారిటీ గురుకుల విద్యార్థుల పతకాల పంట

రాష్ట్ర స్థాయికి దూసుకెళ్లిన కుస్తీ వీరులు

వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 26 :
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గం నిజాంపేట పాఠశాల మైదానంలో ఈ రోజు జరిగినటువశీటి ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్ జి ఎఫ్ కుస్తీ పోటీల్లో ఖేడ్ పట్టణంలోని మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అండర్-19 విభాగంలో ఐదుగురు విద్యార్థులు (ఫహీం, శివ, అమన్, అయాన్, భూమేష్) బంగారు పతకాలు,ఒకరు (రేహాన్) వెండి పతకం సాధించారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచారని, ఈ ఐదుగురు రాష్ట్ర స్థాయి కుస్తీ

పోటీలకు ఎంపిక అయినట్టు జిల్లా కళాశాలల ఎస్ జి ఎఫ్ ప్రధాన కార్యదర్శి గణపతి, కుస్తీ కోచ్ మూడ్ జైపాల్, పీడీ విఠల్ నాయక్ తెలిపారు. వీరు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి కి ఎంపిక అయిన విద్యార్థులకు ఖేడ్ మైనారిటీ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రాములు వ్యాయామ ఉపాధ్యాయులు అజీజ్, సంతోష్ మరియు పాఠశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి పీడీ లు పి.ఇ.టి లు మరియు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

మహర్షి వాల్మీకి జయంతి శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నాయకుడు నౌబాద్ జగన్నాథ్

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్, 26:

మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని బీజేపీ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్ శుభాకాంక్షలు తెలిపారు. మహర్షి వాల్మీకి జీవితం, రచనలు సమాజానికి నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రామాయణ మహాకావ్యాన్ని రచించి మానవాళికి ధర్మం, సత్యం, కరుణ, జ్ఞానం వంటి గొప్ప విలువలను అందించిన మహర్షి వాల్మీకి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. ఆయన బోధనలు సమాజంలో నైతిక విలువలను పెంపొందించడంతోపాటు, సన్మార్గంలో నడిచేందుకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

పద్మశాలి సంఘం మెదక్ జిల్లా యూత్ అధ్యక్షునిగా పోల నవీన్‌కుమార్

- నియామక పత్రాన్ని అందజేసిన
- రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజకుమార్, జిల్లా అధ్యక్షుడు మేకల జయరాం
- పద్మశాలి అభివృద్ధికి కృషి చేస్తా..పోల నవీన్ కుమార్

కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 26 :
తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం (౦౨ూూ) మెదక్ జిల్లా యూత్ అధ్యక్షునిగా మండల కేంద్రమైన కౌడిపల్లికి చెందిన పోల నవీన్ కుమార్ నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజకుమార్, మెదక్ జిల్లా అధ్యక్షుడు మేకల జయరాములు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజకుమార్ మాట్లాడుతూ పద్మశాలీలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పద్మశాలి సమాజం అభివృద్ధి చెందాలంటే రాజకీయంగా ఎదిగి, రాజ్యాధికారంలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.జిల్లా యూత్ అధ్యక్షునిగా నియమితులైన పోల నవీన్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర,

జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పద్మశాలి సంఘం బలోపేతానికి, యువత అభ్యున్నతికి, పద్మశాలీల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. దీంతోపాటు జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుంటూరు రమేష్ నియామకం అయ్యారు. ఈ నియామకం పట్ల కౌడిపల్లి మండలానికి చెందిన పద్మశాలి సంఘం నాయకులు, యువకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు పిశ్కే నరసింహులు, శ్రీనివాస్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు

మతాల కంటే మానవత్వమే గొప్పది

- డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.డి. ముల్తాని
- పాదయాత్రగా బయలుదేరిన మహిళలకు పానీయాలు, అరటిపండ్ల పంపిణీ

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 26:
మతాల కంటే మానవత్వమే గొప్పదని, మతాలు, ఆచారాలు వ్యక్తిగతమైన అంశాలని సంగారెడ్డి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ ముల్తాని అన్నారు. ప్రజలు భక్తి మార్గంలో నడుస్తూ పరస్పర సోదరభావంతో మెలిగినప్పుడే దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉంటాయని పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్ నియోజకవర్గంలోని మచ్నూర్ గ్రామం నుంచి భవనమ్మపల్లిలోని తుల్జాభవాని ఆలయానికి పాదయాత్రగా బయలుదేరిన మహిళలకు ఆయన చల్లని పానీ యాలు, అరటిపండ్లు అందజేసి అభినందించారు. మత సామరస్యం, మాన వత్వం చాటేలా ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జ్యోతి నర్సింలు, అంజయ్య, కె. మల్లేశం, ఆకుల విష్ణు, ఆకుల పెంటన్న, ఓంకార్ పాల్గొన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 26:
పి.ఎ.సి.ఎస్ చౌటుప్పల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు మందోళ్ల గూడెం , ఎస్.లింగోటం, నెలపట్ల, అంకిరెడ్డి గూడెం నక్కల గూడెం, గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ూవీజ ఛైర్మన్ ఉబ్బు వెంకటయ్య, జిల్లా సహకార అధికారి జి. నాగార్జున రావు గారు, పి.ఎ.సి.ఎస్ ఛైర్మన్ ఈదుదుల మస్తాన్ బాబు యాదవ్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని రకాల వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకోవాలని మధ్య దళారులకు అమ్మవద్దని తెలిపారు. ఈ కార్యక్రమములో జశీ-శీజూ ూా.=. బి. సురేష్ గారు, ఎ.ఎం.ఒ. ముత్యాల నాగరాజు ఎ.ఎం.సీ వైస్ ఛైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,ూూజూ వైస్ ఛైర్మన్ పర్ని శివారెడ్డి , డైరెక్టర్లు బొబ్బిల రాజేందర్, సర్థంటి లక్ష్మమ్మ, జక్కిడి వెంకట్ రెడ్డి, నల్ల నరేందర్ రెడ్డి, రావుల స్వామి , గుర్రం మనోహర్ రెడ్డి, మల్కాపురం సుగుణమ్మ , మేకల దేవేందర్ రెడ్డి, బత్తుల శ్రీ హరి, ఆయా గ్రామాల సర్పంచులు తంగెళ్ళ వెంకటేష్, గంగాపురం వసంత, నాగేష్ గౌడ్ , భీమిడి ప్రదీప్ జీ , సుర్వి మల్లేష్ గౌడ్, ఉప సర్పంచులు పిన్నింటి శ్రీనివాస రెడ్డి, సుర్థంటి శ్రీధర్ రెడ్డి, బాతరాజు పవన్ ధనుంజయ ూవీజ డైరెక్టర్లు పబ్బు శ్రీకాంత్ ,ఢిల్లీ చంద్రకల, Ex MPTC బూర్గు క్రిష్ణరెడ్డి, చెన్నగోని వెంకటేశం,Ex PACS ఛైర్మన్లు వెల్గ రాజశేఖర్ రెడ్డి, చెన్నగోని అంజయ్య గౌడ్ , ఆయా గ్రామాల వార్డు మెంబర్లు, రైతులు, ముఖ్య నాయకులు ఎ.ఈ.ఓ శంకర్ , G.P.O. వెంకటరత్నం కార్యదర్శి రమేష్ , పాల్గొన్నారు.

మోత్కూర్లో ఆర్టీసీ డిపో సాధనకై అఖిలపక్ష సన్నాహక సమావేశం

మోత్కూర్, అక్టోబర్ 26,వెలుతురు న్యూస్ :
మోత్కూర్ మండల కేంద్రంలో ఆర్టీసీ డిపో సాధనకై అఖిలపక్ష సన్నాహక సమావేశం ఎర్రవెల్లి నర్సయ్య అధ్యక్షతన జరిగింది.కార్యక్రమానికి హాజరైన నాయకులు మాట్లాడుతూ మోత్కూరు,అడ్డ గూడూరు, గుండాల,ఆత్మకూరు మండలాల ప్రజలు ప్రతిరోజు భువనగిరి, బీబీనగర్,ఏమ్స్, హైదరాబాదు ప్రాంతాలకు విద్యా, వైద్యం, వ్యాపారం ఇతర అవసరాల కొరకు వెళ్లాలంటే ఈ ప్రాంతం నుండి తొర్రూరు సూర్యాపేట యాదగిరిగుట్ట డిపోల బస్సులు నడుస్తున్నప్పటికీ, తిరుమలగిరి నుండి వచ్చే బస్సులు ప్రయాణికులతో నిండి రావడంతో ఈ ప్రాంతంలో ప్రజల బస్సు ఎక్కాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.పైసలు పెట్టినప్పుడు కూడా బస్సులో నిలబడి పోవడానికి స్థలము లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని,కొన్ని బస్టాప్లో బస్సులు ఆపకపోవడం వల్ల ప్రయాణికులు ప్రయాణం చేయాలంటే నరకయాతనగా భావిస్తున్నారు.కావున మోత్కూరు మండల కేంద్రంలో ఆర్టీసీ డిపో ఏర్పడితే తప్ప ఈ పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రయాణ బాధలు తప్పవని అఖిలపక్షాల నాయకులు ఏకపక్షంగా తీర్మానం చేశారు.సమావేశం అనంతరం రాష్ట్ర నోడల్ అధికారి విద్యాసాగర్ సార్ గారికి మోత్కూరు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా వినతి పత్రము అందజేశారు. నోడల్ అధికారి మాట్లాడుతూ ఈ ప్రాంతానికి బస్సు డిపో అత్యవసరమని నా ప్రయత్నంగా ప్రభుత్వానికి ఆర్టీసీడిపో ఏర్పాటు కోసం లేఖ పంపుతానని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీనాయకులు కలమెల నర్సయ్య, కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న, మెంట నాగేష్,అవిశెట్టి ఐలమల్లు, కంచర్ల యాదగిరి రెడ్డి, లెంకల వేణు,సోమిరెడ్డి,బయ్యని రాజు, రిటైర్డ్ ఎమ్మార్వో దేవపాలెం, సామాజిక కార్యకర్త బ్రహ్మచారి , తీపి రెడ్డి సోమిరెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీనాయకులు పోన్నెబోయిన రమేష్,చౌగాని సత్యం, జంగ శ్రీను,సిపిఐ నాయకులు పులకర మల్లేష్,లక్ష్మీ నర్సయ్య,సిపిఎం బొల్లు యాదగిరి,బీజేపీ నాయకులు సజ్జనం మనోహర్, డాక్టర్ రఘు వర్ధన్, రిటైర్డ్ ఉపాధ్యాయులు మనోహరా చారి, వెంకటేశ్వర కాలనీ అధ్యక్షులు గట్టు వెంకటేశ్వర్లు ,ఎడ్ల నరేష్,గజ్జెల్లి మహేష్,కురిమేటి సైదులు, పత్రికా విలేకరులు జహంగీర్, పోచం సోమయ్య,దబ్బెటి సోంబాబు,బుర్ర శ్రీను, సైమన్, కూరెల్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

- వాల్మీకి ఆశయాలు భావితరాలకు ఆదర్శం
- మున్సిపల్ ఛైర్మన్ మహమ్మద్ యూనుస్

జహీరాబాద్వెలుతురు అక్టోబర్ 26:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సోమవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మహమ్మద్ యూనుస్ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి సంప్రదాయబద్ధంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి సాహిత్య సేవలను, ఆయన రచించిన రామాయణం గొప్పతనాన్ని స్మరించుకున్నారు. సంస్కృతంలో ఆదికవిగా ప్రసిద్ధి చెందిన వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. రామాయణంలోని ఆదర్శాలు నేటి సమాజానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు.మహర్షి వాల్మీకి జీవితం సత్యం, ధర్మం, నీతి, మానవతా విలువల ప్రాధాన్యతను చాటిచెబుతుందని, ఆయన బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు. మహనీయుల జయంతి వేడుకల ద్వారా వారి జీవిత చరిత్ర, ఆశయాలను భావితరాలకు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శిరీష సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు అక్రమ్, అప్పం శ్రవణ్, మాజీ వైస్ ఛైర్మన్ ఖాజామియా, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫెడరేషన్ ఆఫ్ పేపర్ ట్రేడర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడిగా కిషన్ సింగ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26

ఫెడరేషన్ ఆఫ్ పేపర్ ట్రేడర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా 64వ జాతీయ అధ్యక్షుడిగా 2026--27 కాలానికి ప్రముఖ వ్యాపారవేత్త, తిరుమల బాలాజీ పేపర్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ టీ కిషన్ సింగ్ ఎన్నికయ్యారు. ఈ పదవిని అధిరోహించిన హైదరాబాద్‌కు చెందిన నాలుగో వ్యక్తిగా నిలిచారు. దేశవ్యాప్తంగా పది వేల మందికి పైగా కాగితపు వ్యాపారులకు ప్రాతినిధ్యం వహించే అత్యున్నత సంస్థ ఇది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా జాతీయ పరిధిని విస్తరించడం, అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, జాతీయ కాగిత దినోత్సవానికి అధికారిక గుర్తింపు సాధించే దిశగా కృషి చేస్తామన్నారు. మరింత పటిష్టంగా అందరినీ కలుపుకొనిపోతూ వ్యాపారుల సంక్షేమమే కేంద్రంగా పని చేయనున్నామన్నారు. కాగిత వ్యాపారులకు విస్తృత అవకాశాలు సృష్టిస్తూ, నిరంతర వృద్ధికి దోహదపడగలమని తెలిపారు. నగరానికి చెందిన నాలుగో పరిశ్రమ నాయకుడిగా ఎఫ్‌పీటీఏ పగ్గాలు చేపట్టడంతో ఆయన ఎన్నిక నగరానికి గర్వకారణంగా నిలిచింది. హైదరాబాద్ నుంచి ఈ ప్రతిష్టాత్మక పదవిని చేపట్టిన వారిలో అమలోక్‌చంద్ సింఘ్వీ (1975), గోవిందాస్ రాఠీ (1989), అరవింద్ శర్మ (2007) ఉన్నారు. కిషన్ సింగ్ తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ (టీపీఎంఏ), ఎఫ్‌పీటీఏ రెండింటి మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా, టీపీఎంఏ అధ్యక్షుడిగా, ఎఫ్‌పీటీఏ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. ఎఫ్‌పీటీఏ పబ్లిక్ అవేర్‌నెస్ కమిటీ కన్వీనర్‌గా దశాబ్దానికి పైగా పని చేసి, అసోసియేషన్ ప్రచార కార్యక్రమాలలో, పరిశ్రమ భాగస్వామ్యంలో కీలక పాత్ర పోషించారు. 2026--27 అధ్యక్షుడిగా ఆయన ప్రాధాన్యతలలో ఎఫ్‌పీటీఏ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం, ఇప్పటి వరకు ప్రాతినిధ్యం లేని ప్రాంతాలకు సంస్థను విస్తరించడం, కాగితపు వ్యాపారులు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లను పరిష్కరించడం వంటివి ఉన్నాయి. వీటితో పాటు ఏటా నిర్వహించుకునే 'ఎఫ్‌పీటీఏ జాతీయ కాగిత దినోత్సవం'కు భారత ప్రభుత్వం నుంచి తగిన గుర్తింపు లభించేలా కృషి చేస్తారు. భారతీయ వ్యాపారులకు విస్తృత అవకాశాలు కల్పించేందుకు ఇతర దేశాలలోని కాగితపు వ్యాపార సంఘాలతో భాగస్వామ్యాన్ని పెంపొందించనున్నారు. ఉన్నత విద్యావంతుడు, నిపుణుడైన కిషన్ సింగ్ బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్ పట్టా, యూకేలోని గ్రీన్‌విచ్ విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి పోస్ట్‌గ్రాడ్యుయేట్ సర్టిఫికేట్ పొందారు. ఆయన సాధించిన విజయాలకు గుర్తింపుగా సంత్ కృపా రైజింగ్ స్టార్ అవార్డు, గోవిందలాల్ రాఠీ అవార్డు, కేసీ డాగా అవార్డు, జయంతిలాల్ షా అవార్డు, గ్రోత్‌ఎనేబ్లర్ గుర్తింపుతో సహా అనేక ప్రతిష్టాత్మక గౌరవాలు లభించాయి. ఎఫ్‌పీటీఏ జాతీయ నాయకత్వానికి ఆయన ఎంపిక కావడం భారతదేశ వ్యాపార, వాణిజ్య రంగాల్లో హైదరాబాద్ కొనసాగిస్తున్న విశేష సహకారాన్ని స్పష్టం చేస్తోంది. అపార అనుభవం, అసోసియేషన్ నాయకత్వ పటిమ, దార్శనికతతో దేశవ్యాప్తంగా కాగితపు వ్యాపారుల గళాన్ని బలోపేతం చేయడానికి, భారతదేశ పేపర్, ప్యాకేజింగ్ పరిశ్రమ సుస్థిర వృద్ధికి తోడ్పడనున్నారు.

గురునానక్ మందిర్ కమాన్‌ల నిర్మాణానికి భూమిపూజ చేసిన జగ్గారెడ్డి

- **సంగారెడ్డి పట్టణం లోని గురునానక్ మందిర్‌ను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేసిన జగ్గారెడ్డి**

సంగారెడ్డి, వెలుతురు, అక్టోబర్ 26 :

గత గురునానక్ జయంతి సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సంగారెడ్డి పట్టణంలోని బ్రాహ్మణవాడలో రెండు కమాన్ల నిర్మాణానికి జగ్గారెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. గురునానక్ మందిర్‌కు వెళ్లే ప్రవేశ మార్గంలో ఒకటి, మందిర్‌కు సమీపంలోని భవాని మందిర్ రోడ్డులో మరొక కమాన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అంతకుముందు గురునానక్ మందిర్‌ను సందర్శించిన జగ్గారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర్ ప్రతినిధులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటిని త్వరలో పరిష్కరిస్తానని జగ్గారెడ్డి హామీ ఇచ్చారు. మందిర్ ప్రాంగణంలో రావిచెట్టు కింద ఉన్న నాగదేవత ఆలయాన్ని అభివృద్ధి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్‌కు జగ్గారెడ్డి సూచించారు. ప్రస్తుతం ఉన్న విగ్రహాలను యథాస్థానంలోనే ఉంచి అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిక్కు ప్రముఖులు డాక్టర్ సర్దార్ సురేందర్ గోపి సింగ్, సర్దార్ తేజేందర్ సింగ్, సర్దార్ స్వరణ్ సింగ్, సర్దార్ సత్‌పాల్ సింగ్, డాక్టర్ సర్దార్ భరత్ సింగ్, సిక్కు గురువు గురుదేవ్ సింగ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, నరేన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల్లో ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించాలి

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి విజ్ఞప్తి చేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 26:

వచ్చే నెలలో గవర్నర్ కోటాలో భర్తీ చేయనున్న నామినేటెడ్ ఎమ్మెల్సీల్లో ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించాలని కోరుతూ, సోమవారం రోజున హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ,కాంగ్రెస్ పార్టీ బీసీలకు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు ఎన్నికల సమయంలో ఓటర్లుగానే మిగిలిపోతున్నారని, రాజకీయ పదవులు, నిర్ణయాధికారంలో మాత్రం తగిన ప్రాతినిధ్యం పొందలేకపోతున్నారని అన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపు సమయంలో కూడా ఆర్థిక స్థోమత లేదనే సాకుతో బీసీలకు అవకాశాలు నిరాకరించారని విమర్శించారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించకుండా సామాజిక న్యాయం సాధ్యంకాదని స్పష్టం చేశారు. వచ్చే నెలలో గవర్నర్ కోటాలో భర్తీ చేయనున్న నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవిలో అర్హత,సామాజిక సేవ,పార్టీ పట్ల నిబద్ధత కలిగిన బీసీ నాయకుడికి అవకాశం కల్పించి,బీసీల ఆత్మగౌరవాన్ని గౌరవించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో సామాజిక న్యాయం, కులగణన,బీసీల హక్కుల గురించి మాట్లాడుతున్నప్పటికీ, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఆ స్ఫూర్తికి అనుగుణంగా బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడం లేదని విమర్శించారు. సామాజిక న్యాయం మాటలకే పరిమితం కాకుండా,ఆచరణలోనూ బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు గవర్నర్ కోటా నామినేటెడ్ ఎమ్మెల్సీ లో అవకాశం కల్పించి, కాంగ్రెస్ పార్టీ బీసీల పట్ల తన నిబద్ధతను నిరూపించుకోవాలని జాజుల లింగం గౌడ్ కోరారు.

వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

- **ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించండి**
- **పుట్ల శ్రీనివాస్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి హైదరాబాద్**

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 26:

క్యాచ్ అప్ క్యాంపెయిన్ వాక్సినేషన్ ప్రోగ్రామ్ ద్వారా 23 -10-26 నుండి 31-10-26 వరకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జరుగుతుందని వ్యాక్సినేషన్ పూర్తిగా తీసుకొని పిల్లలకు, వ్యాక్సినేషన్ అసంపూర్తిగా పొందిన పిల్లలకు ఈ కార్యక్రమంలో టీకాలు వేయించడానికి సిబ్బంది సర్వే చేసి 100% క్యాచ్ అప్ క్యాంపెయిన్ ను విజయవంతం చేయాలని కోరారు లెప్రసి కేసు డిటెక్షన్ క్యాంపెయిన్ వచ్చే నెల 5 వరకు కొనసాగుతుందని ఫీల్డ్ సిబ్బంది సర్వే చేసి కేసులను గుర్తించి చికిత్స అందించాలని కోరారు. నాన్ కమ్యూనికేబుల్ డిసీస్ సర్వే, స్క్రీనింగ్, ఫాలో అప్ ప్రతిరోజు చేయాలి హ్యూం వ్యాక్సిన్ ను అర్హులైన బాలికలకు గుర్తించి, ఇప్పించండి. మీ లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయండి. దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు అవసరమైన అన్ని రకాల మందులు అందించాలి. సీజనల్గా వచ్చే వ్యాధులు వ్యాపించకుండా నియంత్రించాలి. ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నవి అని తెలియజేశారు డా. పుట్ల శ్రీనివాస్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి , హైదరాబాద్ సోమవారం రోజున నాంపల్లి క్లస్టర్ పరిధిలోని అఫ్జల్ సాగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నీ సందర్శించారు. ఈ సందర్భంగా ఐవీడనూ గారు హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, లాబొరేటరీ కేంద్రాన్ని, వివిధ రికార్డులు మరియు పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. గర్భిణీ స్త్రీల, పిల్లల వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించి తగు సూచనలు సలహాలు చేశారు.

అన్ని వ్యాక్సిన్లు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిల్వ ఉంచుకోవాలని, వ్యాక్సిన్ శీతలీకరణను సమర్థవంతంగా నిర్వహించాలని వైద్యులకు, సిబ్బందికి సూచించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. పిల్లలకు 100% వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని సూచించారు.

క్యాచ్ ఆఫ్ క్యాంపెయను వాక్సినేషన్ ప్రోగ్రామ్ 23-10-26నుండి 31-10-26 జరుగుతుందని వ్యాక్సినేషన్ తీసుకొని పిల్లలకు, కొన్ని వ్యాక్సిన్లే తీసుకున్న పిల్లలకు ఈ క్యాంపియన్ ద్వారా 100% వాక్సినేషన్ కార్యక్రమం పూర్తి చేయాలని కోరారు.

పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి నాణ్యమైన ఆరోగ్య సేవలు ప్రజలకు అందించాలి అనీ సూచించారు. వైద్యులు ,సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. నాన్ కమ్యూనికేబుల్ డిసీస్ సర్వే, స్క్రీనింగ్, ఫాలో అప్ ప్రతిరోజు చేసి తప్పకుండా సమాచారాన్ని అప్లోడ్ చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

అన్ని రకాల మందులను పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, బస్తీ దవాఖానలో నిల్వఉంచుకోవాలని కోరారు. **HPV** వ్యాక్సిన్ ను అర్హులైన బాలికలకు త్వరితగతిన ఇప్పించండి. ఈ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయండి అని సూచించారు లెప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ వచ్చే నెల 5వరకు కొనసాగుతుందని ఫీల్డ్ సిబ్బంది సర్వే చేసి కేసులను గుర్తించి చికిత్స అందించాలని కోరారు. అనంతరం గర్భిణీల స్త్రీల సంరక్షణ, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధులు నియంత్రణ, మలేరియా, డెంగీ, చికున్‌గునియా నివారణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించి, ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రశీను డా. మురళీధర్ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసరు నాంపల్లి క్లస్టరూ తో కలిసి సందర్శించారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారీ మరియు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

సామాజిక వాస్తవాలను చిత్రిక పెట్టిన తిర్మల్ నీడల ప్రపంచం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26

నీడల ప్రపంచం పుస్తకం ద్వారా సామాజిక వాస్తవాలను రచయిత ఎన్. తిర్మల్ చిత్రిక పట్టారని పలువురు రచయితలు ప్రశంశించారు. నీడలప్రపంచం సమాజంలో నెలకొన్న వివిధ రంగాల్లో ని డొల్లతనాన్ని ఎత్తి చూపుతుంది అన్నారు. వాస్తవాలపై కమ్ముకుంటున్ననీడలను తన కలం వెలుగులో రచయిత పాఠకులకు చూపించారని అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక రవీంద్ర భారతి లో ప్రముఖ కవి హనీఫ్ అధ్యక్షతన జరిగిన ఎన్. తిర్మల్ రాసిన "నీడల ప్రపంచం"పుస్తకావిష్కరణ, అనంతరం సభలోపలువురు ప్రముఖ రచయితలు ప్రసంగించారు.' నీడలప్రపంచం'పుస్తకాన్ని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఆయాచితం శ్రీధర్ ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండను అద్దంలో చూపగల్గిన తిర్మల్ నైపుణ్యం ఈ వ్యాస సంకలనం లోకనిపిస్తుందని అన్నారు. జర్నలిజం,రాజకీయం, సామాజికం, తెలంగాణీయం విభాగాలలో విశ్లేషణాత్మక కథనాలు అందించారని అన్నారు. ప్రముఖ పత్రిక సంపాదకుడు, రచయిత సతీష్ చందర్ మాట్లాడుతూసుదీర్ఘ పాత్రికేయ అనుభవం ఉన్న తిర్మల్ వ్యాసాలు వ్యూహాత్మకంగా ఉంటాయని అన్నారు. ఇవాళ చర్చించాల్సిన ఎజెండాను తిర్మల్ నీడల ప్రపంచం లో చూపించారని అన్నారు. చాలా సాదారణ విషయాలను అసాధారణంగా చర్చించి చూపిన విరుపులు పుస్తకం లో కనిపిస్తాయి. శైలిలో భిన్నత్వం కనిపిస్తుంది అన్నారు. జర్నలిజం పైన సైతం పుస్తకం లో చర్చించిన విషయాలు వ్యక్తీకరణ చేసిన తీరుబాగుందిఅన్నారు. తెలంగాణా సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ నీడల ప్రపంచం పుస్తకం ను విశ్లేషించారు. దిక్కార స్వరం గా మొదలైన తిర్మల్ సాహితీ ప్రస్థానం యాభైఏండ్లుగా ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్నారని అన్నారు. ప్రజాఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచిన తిర్మల్ కలం బలం జవసత్వాలు ప్లశంశించకుండా ఉండలేమని అన్నారు. నిచ్చెన మెట్ల నీడల ప్రపంచం ను కూల్చివేశామని అన్నారు. ఇవాల తిర్మల్ లాంటి రచయితల అక్షారాలకు ప్రత్యేక పాఠకులు ఉన్నారని అన్నారు. శాంతిసంఘం తెలంగాణా అధ్యక్షుడు డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ సామాజిక బృందంతో కూడిన తిర్మల్ జీవితం మట్టి పువ్వు చదువుతుంటే ఆయన జీవితం ఎంతో ప్రజలకు అంకితం అయ్యాడో అర్థం అవుతుంది. నేడు నిర్మల్ రాయిని పత్రిక లేదంటే ఆశ్చర్యం లేదన్నారు. మంచిప్రయోగం చేస్తున్నారని అన్నారు., రచయిత ఎన్. తిర్మల్ పుస్తకం ఆవిష్కరణ కు హాజరైన సాహిత్య కారులకు , తెలంగాణా బాషా, సాంస్కృతిక సంఘం, రవీంద్ర భారతి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మానవాళికి విజ్ఞాన వెలుగులు నింపిన మహనీయుడు మహర్షి వాల్మీకి

బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్



హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 26:

అజ్ఞానపు చీకట్లను తొలగించి,తన రచనల ద్వారా మానవాళికి జ్ఞాన మార్గాన్ని చూపిన మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి రచించిన రామాయణం మానవాళికి ధర్మం, సత్యం, న్యాయం, త్యాగం, మానవతా విలువలను బోధించే గొప్ప ఇతిహాసమని ఆయన పేర్కొన్నారు. వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, విద్య, జ్ఞానం, సంస్కారం ద్వారా సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆయన సందేశం ఇస్తుందని తెలిపారు. వాల్మీకి మహర్షి ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని, విద్యకు ప్రాధాన్యతనిస్తూ సమానత్వం, సామాజిక న్యాయం, మానవతా విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని జాజుల లింగం గౌడ్ పిలుపునిచ్చారు.

నారాయణ స్కూల్ - హయత్నగర్, దిమస్

హయత్నగర్ వెలుతురు అక్టోబర్ 26:

నారాయణ ఒలింపియాడ్ హయత్నగర్ బ్రాంచ్ వార్షిక క్రీడా మహోత్సవం 26 అక్టోబర్ 2026 న ఘనంగా ప్రారంభమైంది. ఒలింపిక్ స్ఫూర్తిని చాటుతూ క్రీడాజ్యోతిని వెలిగించి, క్రీడలను అధికారికంగా యాజమాన్యంవారు ప్రారంభించారు. విద్యార్థులందరు క్రీడలలో విజయాన్ని సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులలో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంచటానికి నారాయణ స్కూల్ దోహదపడుతుందని ప్రిన్సిపల్ అన్నారు. దీనిలో భాగంగా క్రికెట్, రన్నింగ్, కబడ్డీ, ఖోఖో, క్యారమ్స్, చెస్, త్రోబాల్ వంటి పలురకాల ఇండోర్, అవుట్డోర్ క్రీడలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో . గోపాల్రెడ్డి, వీ.రవీంద్ర. బాబు, ప్రిన్సిపల్స్. బి. లావణ్య, మానస, =.N.D., C.O.బసుజన్, దివ్య, ప్రియాంక, డీన్ మంజుల, V.P.\T. కవిత, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

మహర్షి వాల్మీకి జయంతి

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 26:

సోమవారం రోజున మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొండయ్య, వెంకటేష్, తిరుపతి, కుమార్ , సునీత , సురేష్ , డి. రవి , డి. వెంకటేష్ , డి. అంజి , బాలరాజు , నగేష్ వైస్ చైర్మన్ , బొగ్గు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పునరుజ్జీవనానికి అంతర్జాతీయ సహకారం!

మహానగర పరిధిలో చెరువుల పరిరక్షణ, పునరుజ్జీవనానికి అంతర్జాతీయ నిపుణుల సహకారంతో సమగ్ర కార్యాచరణ దిశగా అడుగులు పడుతున్నాయి. జలవనరుల సంరక్షణ, సుస్థిర నిర్వహణ లక్ష్యంగా బోర్డో మెట్రోపోల్--తెలంగాణ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. హైదరాబాద్‌లోని బెల్లా విస్టా, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ)లో సోమవారం నిర్వహించిన జాతీయ, అంతర్జాతీయ నిపుణుల వర్క్‌షాప్‌లో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ వర్క్‌షాప్‌ను ప్రారంభించగా,బోర్డో ప్రాంతానికి చెందిన నిపుణులు, ఏఎస్‌సీఐ పరిశోధన అధ్యయనాల డైరెక్టర్, సీఈయూజీ అండ్ ఐడీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ బి. జనార్దన్ రెడ్డి, హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీ అశోక్ రెడ్డి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పట్టణ స్థానిక సంస్థలు, విద్యా సంస్థలు, పాల్గొన్నారు.

మా వ్యక్తిగత జీవితంపై

అనవసర వ్యాఖ్యలొద్దు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26 : విజయ్ దేవరకొండతో తన వివాహ బంధంపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విమర్శలు, ఊహాగానాలపై నటి రష్మిక మందన్న ఘాటుగా స్పందించారు. పూర్తి సమాచారం తెలుసుకోకుండా అరకొర విషయాలతో నిర్ణయాలకు రావొద్దని హిత వు పలికారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఇటీవల 'కాఫీ విత్ కరణ్' కార్యక్ర మంలో రష్మిక తనను పెళ్లి చేసుకోమని వందసార్లు అడిగిందని విజయ్ వ్యాఖ్యానించడంతో సామాజిక మాధ్యమాల్లో విమర్శలు మొదల య్యా యి. దీనిపై స్పందించిన రష్మిక.. పెళ్లి విషయంలో నిర్ణయం తీసుకోవడానికి విజయ్ సమయం తీసుకోవడంలో తప్పేమీ లేదన్నారు. ఒకరినొకరు అర్థం చేసుకుని, జీవితాన్ని కలిసి నిర్మించుకోవడమే పెళ్లి ఉద్దేశమని పేర్కొన్నారు. 'విజయ్ అంటే నాకు పిచ్చి ప్రేమ. ఇందులో తప్పేముంది? నేను పెళ్లి చేసుకునే వ్యక్తిని ప్రేమించకపోతే ఎందుకు పెళ్లి చేసుకుంటాను? నేను కష్టాల్లో ఉన్నప్పుడు విజయ్ అండగా నిలిచాడు. ఇప్పటికీ ఆ మద్దతు కొనసాగు తోంది. నా మాటల కంటే సామాజిక మాధ్యమా ల్లోని ఊహాగానాలు, ఎడిట్ చేసిన వీడియోలను ఎక్కువగా నమ్ముతున్నారు. మా కుటుంబం గురించి తెలియకుండా ఇష్టానుసారంగా మాట్లాడటం ఫెమినిజం ముసుగులో వేధింపులకు పాల్పడటమే' అని రష్మిక స్పష్టం చేశారు. తన జీవితంలో ఎంతో సంతోషంగా ఉన్నానని తెలిపారు. ఈ వివాదంపై విజయ్ దేవరకొండ కూడా స్పందించారు. రష్మిక తన భార్య అని, ఆమెతో జీవితాన్ని పంచుకోవడం తనకు ఆశీర్వాదమని పేర్కొన్నారు. తామిద్దరం సం తోషంగా ఉన్నామని, ప్రేమను గౌరవిస్తూ సాధారణ జీవితాన్ని ఆస్వాదించే వారికి కృతజ్ఞతలు తెలిపారు. విజయ్ దేవరకొండ, రష్మికలపై ఆన్‌లైన్‌లో జరుగుతున్న దుష్ప్రచారంపై వారి బృందం సైబర్ క్రైమ్ విభాగం డీసీపీకి ఫిర్యాదు చేసింది. 'కాఫీ విత్ కరణ్' కార్యక్ర మంలో విజయ్, రష్మిక చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ కొందరు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొం ది. దీనివల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని బృం దం ప్రతినిధి తెలిపారు. నకిలీ పోస్టులకు సంబం ధించిన సామాజిక మాధ్యమ ఖాతాల వివరాలు, పోలీసులకు అంద జేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పేదోడి ఓటును కాపాడుకుంటేనే రాజ్యాంగాన్ని కాపాడుకున్నట్లు

- నవంబర్ 1న ఢిల్లీలో జరిగే 'ఓట్ బచావో -- దేశ్ బచావో' నిరసన సభను విజయవంతం చేయాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీగా సామా రామ్మోహన్ రెడ్డిని గెలిపించే బాధ్యత కాంగ్రెస్ శ్రేణులదే : మంత్రి వాకిటి

నారాయణపేట, వెలుతురు అక్టోబర్ 26: ఓటు హక్కును పరిరక్షించుకోవడం అంటే భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమేనని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు . ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఆ హక్కును హరించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని తేల్చి చెప్పారు. నారాయణపేటలో 'ఓట్ బచావో -- దేశ్ బచావో' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. దేశంలో మరోసారి అధికారంలోకి రావడానికి బీజేపీ అడ్డదారులు తొక్కుతోందని మంత్రి విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో కోట్లాది ఓట్లను తొలగిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని, అర్హులైన ఒక్క ఓటరుకూ అన్యాయం జరగకూడదని అన్నారు. బీజేపీ ఓట్ల తొలగింపుపై అనుసరిస్తున్న విధానానికి స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించిందని మంత్రి గుర్తుచేశారు. ఎన్నికల్లో ఓటు వేయడం కేవలం బాధ్యత మాత్రమే కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థలో మన గొంతును వినిపించే శక్తి అని పేర్కొన్నారు. ఓటు హక్కు కోల్పోతే ప్రజాస్వామ్యంలో పౌరుడి భాగస్వామ్యం తీవ్రంగా దెబ్బతింటుందని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ఓటు హక్కును కాపాడుకోవడం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దేశంలో అనేక కీలక సంస్కరణలు తీసుకొచ్చి ప్రజల సంక్షేమానికి కృషి చేసిన పార్టీ కాంగ్రెస్ అని మంత్రి తెలిపారు . పేదల హక్కులు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ప్రజల ఓటుతో ఏర్పడిన ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ఓటు హక్కుకు విఘాతం కలిగించే ఏ ప్రయత్నాన్నైనా ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న 'ఓట్ బచావో -- దేశ్ బచావో' నిరసన సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం జరిగే ఈ పోరాటాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కులగణన చేపట్టి సామాజిక న్యాయం దిశగా ధైర్యంగా ముందడుగు వేసిన నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మంత్రి కొనియాడారు. సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన సమాచారం అవసరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమాన అవకాశాలు, సామాజిక న్యాయం లక్ష్యంగా పనిచేస్తోందని అన్నారు. రాబోయే పాలమూరు--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామా రామ్మోహన్ రెడ్డిని గెలిపించే బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని మంత్రి శ్రీహరి అన్నారు. ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించడం, కాంగ్రెస్ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ఎన్నికల్లో పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయడం ద్వారా లక్ష్యాన్ని సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరితో పాటు ఏఐసీసీ పరిశీలకులు రవీంద్ర దాస్, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

అర్హులైన 14 మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు

సిద్దిపేట, వెలుతురు అక్టోబర్ 26: సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన 14 మంది లబ్ధిదారులకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హైమావతి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకంలో భాగంగా ధూళ్‌మిట్ట మండలం జలపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఈ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ హైమావతితో కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, సర్పంచులు కరుణాకర్, కొమ్ము రవి, కొమ్ము నర్సింగరావు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు అందరూ సిద్ధం కావాలి

హుస్నాబాద్, వెలుతురు అక్టోబర్ 26 : హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. నియోజకవర్గంలో నేటి నుంచి 136 కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. రైతులు మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం విక్రయించవద్దని, తూకంలో ఇబ్బందులు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సన్న ధాన్యం బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున తాగు నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. ఇంకుడు గుంతలు, బోర్ల పునరుద్ధరణ, చెరువుల పూడికతీత పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 28న అఖిలపక్ష సమావేశం నిర్వహించి, అనంతరం ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి అవసరమైన సహకారం కోరుతామని వెల్లడించారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల భూసేకరణ వేగవంతంగా సాగుతోందని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని చెప్పారు. హుస్నాబాద్‌లో ఇంజినీరింగ్ కళాశాల, 250 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం, ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఎల్‌నినో ప్రభావం నుంచి తెలంగాణను రక్షించాలి

- అఖిలపక్షం, మేధావుల సూచనలతో ప్రభుత్వం ముందుకు సాగాలి : డాక్టర్ జయప్రకాష్ నారాయణ

హనుమకొండ, వెలుతురు అక్టోబర్ 26: లోక్‌సత్తా ఉద్యమ సంస్థ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సుంకరి ప్రశాంత్ ఆధ్వర్యంలో, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మరియు జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ సంయుక్తంగా హనుమకొండలోని లోక్‌సత్తా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించాయి. ఈ సమావేశంలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి ఎద్దడి సమస్యలను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నీళ్లు లేనప్పుడే నీటి విలువ తెలుస్తుందని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. రాజకీయ విమర్శలను పక్కనపెట్టి, పరస్పర విమర్శలకు తావివ్వకుండా అఖిలపక్ష నాయకులు, మేధావుల సూచనలతో ప్రభుత్వం ముందుకు సాగాలని కోరారు. గోదావరి, ప్రాణహిత నదుల్లో నీరు ప్రవహిస్తున్నప్పటికీ, అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకొని తాగునీటి కొరతను తీర్చే దిశగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపడం ద్వారా తాగునీరు, సాగునీటి అవసరాలను తీర్చాలని పలువురు మేధావులు సూచిస్తున్నప్పటికీ, ప్రభుత్వం ఆ దిశగా ఎందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ప్రాథమిక అవసరాలు ఇంకా పూర్తిస్థాయిలో ఎందుకు తీరడం లేదని జేపీ ప్రశ్నించారు. ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నుల ఆదాయాన్ని అనవసర ఖర్చులకు వెచ్చించకుండా తాగునీరు, సాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలని సూచించారు. తెలంగాణలో మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వ ఆదాయం పెరుగుతున్నప్పటికీ, ప్రజల అవసరాలను తీర్చడంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో మద్యం ద్వారా సుమారు రూ. 10 వేల కోట్ల ఆదాయం వచ్చేదని, ప్రస్తుతం అది రూ. 42 వేల కోట్లకు చేరిందని పేర్కొంటూ, ప్రజల నుంచి వసూలవుతున్న ఈ ఆదాయాన్ని ఏ విధంగా వినియోగిస్తున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని ప్రశ్నించారు. యువత మద్యం, మాదకద్రవ్యాలకు అలవాటు పడటం సమాజానికి ఆందోళనకరమైన పరిణామమని అన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, యువత ఆరోగ్యాన్ని, భవిష్యత్తును కాపాడేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలకే రాష్ట్ర ఆదాయ వనరులన్నీ ఖర్చయిపోతే అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మిగలవని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలే ఓటు వేసి ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారని, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు యజమానులు కాదని, ప్రజాసేవకు లేనని స్పష్టం చేశారు. రాజకీయ సంస్కరణలు, ఎన్నికల సంస్కరణలు, న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థలో సంస్కరణలు అమలు చేసినప్పుడే ప్రజాస్వామ్య విలువలు మరింత బలోపేతమవుతాయని డాక్టర్ జయప్రకాష్ నారాయణ అన్నారు.

ఐహెచ్‌ఎంలో ముగిసిన నేషనల్ బడ్డింగ్ ఈవెంట్స్

రీజెన్సీ, ఐహెచ్‌ఎం గోవా విద్యార్థుల హవా

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26 : ఆతిథ్య రంగంలో ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం హైదరాబాద్) నిర్వహించిన ఐదో సీజన్ 'నేషనల్ బడ్డింగ్ ఈవెంట్స్' విద్యానగర్‌లోని డీడీ కాలనీ క్యాంపస్‌లో ఘనంగా ముగిశాయి. నాలుగు రోజుల పాటు హోరాహోరీగా సాగిన ఈ మెగా పోటీల్లో గౌతమ్ ఆనంద్ (రీజెన్సీ కాలేజ్, హైదరాబాద్), కుమారి ప్రతిష్ఠా సింగ్ (ఐహెచ్‌ఎం గోవా) 'నేషనల్ బడ్డింగ్ ప్రొఫెషనల్స్-2026' విజేతలుగా నిలిచారు. ఐహెచ్‌ఎం గోవాకు చెందిన క్రిస్లిన్ రోజ్, కట్టా నితిన్ శ్రీనివాసరావుల ద్వయం 'నేషనల్ బడ్డింగ్ చెఫ్ 2026' ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఇందులో నేషనల్ బడ్డింగ్ ప్రొఫెషనల్ కాంపిటీషన్ (మేనేజర్), నేషనల్ బడ్డింగ్ చెఫ్ కాంపిటీషన్లు జరిగాయి. ఈ మెగా ఈవెంట్‌లో దేశ వ్యాప్తంగా, హైదరాబాద్‌లోని ప్రముఖ ఐహెచ్ ఎంలు, ఎస్ఐహెచ్ఎంలు, ప్రైవేట్ హాస్పిటాలిటీ సంస్థల నుంచి బడ్డింగ్ ప్రొఫెషనల్, బడ్డింగ్ చెఫ్ విభాగాల్లో ఒక్కో విభాగం నుంచి 16 జట్లు పాల్గొన్నాయి. ఈ వేడుకకు ఐహెచ్‌ఎం-హైదరాబాద్ ప్రిన్సిపాల్, మెంబర్ సెక్రటరీ సంజయ్ ఠాకూర్, హెచ్ఓడీ కుమారి రచన అగాషే, ఎఫ్‌డబి సర్వీస్ హెచ్ఓడీ పునీత్ రజ్దాన్ హాజరయ్యారు. బడ్డింగ్ ప్రొఫెషనల్ (మేనేజర్) విభాగంలోని పోటీదారులు పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా రూపొందించిన వివిధ పోటీల్లో తలపడ్డారు. ఈ పోటీలు వారి సమస్య పరిష్కార సామర్థ్యం, సృజనాత్మకత, నిర్వహణ నైపుణ్యాలను పరీక్షించాయి. ఈ విభాగంలో ఆన్‌లైన్ టెస్ట్, ఫ్రంట్ డెస్క్ షోడౌన్ (సర్వీస్ రికవరీ స్కిల్స్), రెవెన్యూ రంబుల్ (గదుల మెట్రిక్స్ విశ్లేషణ), సెల్ మీ దిస్ పెన్ (విక్రయ నైపుణ్యాలు/సెల్లింగ్ టాక్టిక్స్), టేకాఫ్ (హోటల్ మార్కెటింగ్ ఛాలెంజ్), క్యూరేటెడ్ క్విజీన్ కాంబాట్ (ఎఫ్‌డబి మెనూ ప్లానింగ్), పోషన్ ప్లేఆఫ్ (కాక్‌టెయిల్ తయారీ పోటీ), బియాండ్ బ్లూప్రింట్, ఫ్లోరెస్కో (ఇకెబానా - పూల అలంకరణ పోటీ). ఈ పోటీలన్నింటిలో సాధించిన మొత్తం మార్కుల ఆధారంగా అత్యంత ప్రతిభ కనబరిచిన వారికి ప్రతిష్ఠాత్మక 'మిస్టర్ బడ్డింగ్ ప్రొఫెషనల్ (మేనేజర్)', 'మిస్ బడ్డింగ్ ప్రొఫెషనల్ (మేనేజర్)' అవార్డులను ప్రదానం చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో

గులాబీ జెండా ఎగరాల్సిందే

-ఓటర్ల నమోదుపై బీఆర్ఎస్ శ్రేణులకు ఎంపీ వద్దిరాజు దిశానిర్దేశం

కొత్తగూడెం, వెలుతురు అక్టోబర్ 26: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం తథ్యమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ధీమా వ్యక్తం చేశారు. అయితే, లక్ష్య సాధనకు పార్టీ శ్రేణులు మరింత పట్టుదలతో పనిచేయాలని, పట్టభద్రుల ఓటరు నమోదును ఉద్యమంలా చేపట్టాలని పిలుపుని చ్చారు. వచ్చే ఏడాది మార్చిలో నల్లగొండ-ఖమ్మం-వరంగల్, హైదరాబాద్- మహబూబ్‌నగర్-రంగారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం భద్రాద్రి కొత్తగూడెంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఇందులో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పార్టీ నాయకుడు రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ.. పట్టభద్రుల ఓటర్ల నమోదు విజయానికి కీలకమని స్పష్టం చేశారు. ప్రతి నాయకుడికి అప్పగించిన ప్రాంతంలో ఇంటింటికీ కాలినడకన వెళ్లి పట్టభద్రులను గుర్తించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు చేయించాలని సూచించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ యువత, అధ్యాపకులు, వైద్యులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, పాత్రికేయులు, న్యాయవాదులు, ఎల్ఐసీ ఏజెంట్లు, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు, మాజీ సైనికోద్యోగులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నవంబర్ 6లోగా నమోదు పూర్తి చేయాలి ఎన్నికల సంఘం విడుదల చేసిన ఫారం-18 ద్వారా నవంబర్ 6వ తేదీలోగా ఓటరు నమోదును పూర్తి చేయించాలని రవిచంద్ర స్పష్టం చేశారు. గడువు ముగిసే వరకు వేచి చూడకుండా ఇప్పటి నుంచే వేగం పెంచాలని, అలసత్వానికి తావివ్వకుండా ప్రతి అర్హుడి ఓటు నమోదయ్యేలా చూడాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. నమోదు చేసిన ఓటర్ల వివరాలను పార్టీ అనువర్తనంలో తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. పార్టీ కోసం క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేసే వారికే పదవులు దక్కుతాయని వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు.

సర్వోత్తమ రెడ్డిని తొలి ప్రాధాన్యతా ఓటుతో గెలిపించాలి

- ఎల్‌నినోపై ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పాలేరు నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పిలుపు

ఏదులాపురం, హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26 : ఖమ్మం--వరంగల్--నల్గొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామిరెడ్డి సర్వోత్తమ రెడ్డిని తొలి ప్రాధాన్యతా ఓటుతో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఇందు కోసం కొత్త ఓటర్ల నమోదును ఉద్యమ స్ఫూర్తితో చేపట్టాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచిం చారు. సోమవారం ఏదులాపురం మున్సిపాలిటీలోని నాయుడుపేట జంక్షన్ వద్ద టి.సి.వి. రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పాలేరు అసెంబ్లీ నియోజక వర్గ స్థాయి ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావే శంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిం చారు. రైతులు నాణ్యమైన విత్తనాలు నాటితే మంచి దిగుబడి వచ్చినట్లే, శాసనమండలికి మంచి అభ్యర్థిని పంపితే ప్రజలకు మంచి ఫలితాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, ఈ బలా న్ని ఓట్ల రూపంలో నిరూపించుకోవాలని అన్నారు. మరో ఎనిమిది రోజుల సమయాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబ సభ్యులు, గ్రామాలు, మిత్రవ ర్గాల్లోని అర్హులైన గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలో వివిధ వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారిని గుర్తించి, అర్హులైన గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమో దు చేయించే బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకో వాలని సూచించారు. గతంలో నిర్వహించిన ఎస్ఐ ఆర్ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు చురుగ్గా పనిచేసి నట్లుగానే, ఇప్పుడు కూడా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కాం గ్రెస్ పార్టీకి ఈ మూడు జిల్లాలు కంచుకోటలుగా ఉ న్నాయని, సర్వోత్తమ రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో జరిగిన తప్పులను ఎత్తిచూపిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వంపై పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఢిల్లీలో నిర్వహించనున్న ధర్నాకు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఎల్‌నినోపై ప్రతిపక్షాల దుష్ప్రచారం

ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా దేశాలు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటు న్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలి పారు. అయితే, తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఈ అంశంపై దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ఏర్పడుతున్న పరిస్థితుల ను కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కరువుగా చిత్రీకరిస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఖండిం చాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాలను సైతం రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడం సరికాదని అన్నారు. ప్రతిపక్షాల ప్రచారాన్ని మౌనంగా చూస్తూ ఉండకుండా, వాస్తవాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఎక్కడైనా, ఎప్పుడైనా ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించేలా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ నాయకురాలు స్వర్ణకుమారి అధ్యక్షత వహించగా, ఎమ్మెల్సీ అభ్యర్థి రామిరెడ్డి సర్వోత్తమ రెడ్డి, ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు సత్యనారాయణ, పార్టీ నాయకులు నాగేశ్వరరావు, గోపాల్ రెడ్డి, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, కృష్ణారెడ్డి, నరేష్ రెడ్డి, గోపన్నతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రపతి భవన్ సమీపంలో అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 26 : దేశ రాజధాని ఢిల్లీలోని అత్యంత కీలకమైన వీఐపీ ప్రాంతంలో అగ్నిప్రమాదం కలకలం రేపింది. రాష్ట్రపతి భవన్ సమీపంలోని నార్త్ బ్లాక్‌లో మంటలు చెలరేగాయి. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో దట్టమైన నల్లటి పొగ వ్యాపించింది. సమాచారం అందుకున్న ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ వెంటనే అప్రమత్తమై, ఆరు అగ్నిమాపక వాహనాలను ఘటనాస్థలికి పంపించింది. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించిన తర్వాతే ప్రమాద తీవ్రతపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ ఘటనలో ఎవరైనా గాయపడ్డారా? భవనానికి ఎంత మేరకు నష్టం వాటిల్లింది? అనే వివరాలు కూడా వెల్లడికావాల్సి ఉంది. రాజ్యసభ సభ్యుడు మిలింద్ దేవరా ఈ ఘటనకు సంబంధించిన విషయాన్ని సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పంచుకున్నారు. పార్లమెంట్‌కు వెళ్తున్న సమయంలో నార్త్ బ్లాక్ వెనుక భాగం నుంచి దట్టమైన పొగలు పైకి ఎగసిపడటం చూశానని పేర్కొన్నారు. అక్కడ అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నట్లు చెబుతూ, అందరూ సురక్షితంగా ఉండాలని, అత్యవసర సేవలు వేగంగా స్పందించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పొగలు కనిపిస్తున్న ఫొటోను కూడా షేర్ చేశారు. రాష్ట్రపతి భవన్ సమీపంలోని కీలక ప్రభుత్వ భవనం వద్ద ఈ ఘటన చోటుచేసుకోవడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, అగ్నిప్రమాదానికి గల కారణాలు, మంటలు అదుపులోకి వచ్చాయా లేదా, భవనంలో ఉన్నవారి పరిస్థితి ఏమిటి అనే అంశాలపై అధికారికంగా వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు
మోదీ సర్కార్ ఎత్తుగడలు

- ఓటరు జాబితాల సవరణలో పారదర్శకత ఏదీ?
- ఎస్ఐఆర్‌పై ఖర్గే తీవ్ర ఆరోపణలు

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 26 : ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్ని రకాల ఎత్తుగడలు వేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ఆరోపించారు. ఓటు చోరీకి సంబంధించిన పలు అంశాలు వెలుగులోకి వచ్చినా, ఎన్నికల సంఘం వ్యవహారాల్లో పారదర్శకత కనిపించడం లేదని విమర్శించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్ వివరాలను సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద కోరగా, వాణిజ్య రహస్యాల పేరుతో ఎన్నికల సంఘం వెల్లడించేందుకు నిరాకరించిందని ఖర్గే పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో 16.18 లక్షల ఫామ్-6 దరఖాస్తుల వివరాలను బహిర్గతం చేయలేదని ఆరోపించారు. పిలిభిత్ జిల్లాలో 10,470 మంది ఓటర్ల రికార్డుల్లో అవకతవకలు గుర్తించినట్లు తెలిపారు. ఓటరు జాబితాల్లో పేర్ల నమోదు, తొలగింపు, వివరాల మార్పులకు సంబంధించిన ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8 దరఖాస్తులపై రాష్ట్రవ్యాప్తంగా విచారణ జరపాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఖర్గే అన్నారు. ఓటరు జాబితాల సవరణలో జరుగుతున్న పరిణామాలపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.

యువజన అధికారులకు ఓరియంటేషన్ ఆన్ ది జాబ్ శిక్షణ

నిర్వహించిన మేరా యువ భారత్ తెలంగాణ

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26, 2026 : భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన మేరా యువ భారత్ (వీ దీప్షుతీఫ్), తెలంగాణ రాష్ట్ర కార్యాలయం ఆధ్వర్యంలో, నూతనంగా నియమితులైన మూడవ బ్యాచ్ జిల్లా యువజన అధికారులకు (ఢ్ూం) ఒకరోజు ఓరియంటేషన్ మరియు ఆన్-ది-జాబ్ శిక్షణ కార్యక్రమాన్ని అక్టోబర్ 26, 2026న హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి వల్లూరు క్రాంతి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతనంగా నియమితులైన అధికారులతో ఆమె మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో యువతతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. స్థానిక యువజన సంఘాలతో సమన్వయం చేసుకుంటూ యువతను వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. యువత ఎదుర్కొంటున్న కెరీర్ అభివృద్ధి, ఉపాధి అవకాశాలు తదితర సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆమె అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లేందుకు వారితో తరచుగా సమావేశాలు నిర్వహించాలని, జిల్లా యంత్రాంగం మరియు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ తగిన పరిష్కారాలు కనుగొనాలని ఆమె తెలిపారు. నూతనంగా నియమితులై శిక్షణకు హాజరైన యువ అధికారులను అభినందిస్తూ, జిల్లా యువజన అధికారులుగా తమ బాధ్యతలను ఒక సవాలుగా స్వీకరించి, అంకిత భావం, నిబద్ధతతో పనిచేసి విజయవంతం కావాలని ప్రోత్సహించారు. చివరగా, అధికారులందరికీ ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. మేరా యువ భారత్ తెలంగాణ రాష్ట్ర సంచాలకులు శ్రీ అన్వేష్ చింతాల మాట్లాడుతూ, మేరా యువ భారత్ లక్ష్యాలు, ప్రాధాన్యతలను వివరించారు. జిల్లా స్థాయిలో యువజన అభివృద్ధి కార్యక్రమాల అమలు, యువతను సమీకరించడం, స్థానిక యువజన సంఘాలను బలోపేతం చేయడం, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను ప్రోత్సహించడం వంటి అంశాల్లో జిల్లా యువజన అధికారుల పాత్ర, బాధ్యతలను వివరించారు. వికసిత్ భారత్ ఏ2047 లక్ష్య సాధనలో యువతను భాగస్వాములను చేయడానికి ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు మరియు ఇతర భాగస్వామ్య సంస్థలతో సమన్వయం చేసుకోవాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. మేరా యువ భారత్ తెలంగాణ సహాయ సంచాలకులు శ్రీ గంటా రాజేష్ మాట్లాడుతూ, యువత సాధికారత, నాయకత్వ లక్షణాల అభివృద్ధి, దేశ నిర్మాణంలో యువత చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంలో మేరా యువ భారత్ ప్రాధాన్యతను వివరించారు. శిక్షణలో భాగంగా నిర్వహించిన పరస్పర చర్చా కార్యక్రమాల్లో అధికారులు తమ సందేహాలను నివృత్తి చేసుకొని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లు, విధి నిర్వహణకు సంబంధించిన అంశాలపై అవగాహన పొందారు.

విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ -- 2026

నిర్వహణలో భాగంగా, నూతనంగా నియమితులైన జిల్లా యువజన అధికారులతో విజి లెన్స్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ విధుల నిర్వహణలో నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం మరియు నైతిక విలువలకు కట్టుబడి పనిచేస్తామని అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం చివరలో శ్రీ ఈ. యాదగిరి వందన సమర్పణ చేశారు. శ్రీ ఎం.వి. సాయి కృష్ణ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా నూతన జిల్లా యువజన అధికారులు మేరా యువ భారత్ లక్ష్యాలు, విధివిధానాలు, తమ బాధ్యతలపై అవగాహన పొందడంతో పాటు, తెలంగాణలోని జిల్లాల్లో క్షేత్రస్థాయిలో యువతతో సమర్థవంతంగా పనిచేసి, యువజన అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసేందుకు అవసరమైన మార్గదర్శకత్వాన్ని పొందారు.

ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను ఆదుకోవడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

- మెడికవర్ ఆస్పత్రులపై ఉన్న శ్రద్ధ ఉద్యోగులపై ఏదీ?
- సమ్మెకు మద్దతు తెలిపిన డా. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఇందిరా పార్క్ (హైదరాబాద్), వెలుతురు, అక్టోబర్ 26 : తెలంగాణలో నాలుగు కోట్ల ప్రజల ప్రాణాలను కాపాడే జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగులు గత 14 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. సోమవారం ఇందిరా పార్క్‌లో జరుగుతున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమ్మెలో పాల్గొని ఆయన మద్దతు తెలిపారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలను కాపాడిన ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డున పడేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో 2018లో కేసీఆర్ ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల జీతాలు పెంచి ఆదుకున్నారని, ప్రస్తుత ప్రభుత్వం కనీసం ఉద్యోగులను పిలిచి మాట్లాడటం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులు తమ కుటుంబాల కోసం ప్రత్యేక వైద్యులను నియమించుకుంటున్నారని, ప్రజల ప్రాణాలను కాపాడే ఉద్యోగులను మాత్రం గాలికొదిలేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని చేతబట్టి తిరుగుతున్నా, తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో ఆరోగ్య శాఖ ఉద్యోగులకు కనీసం ప్రసూతి సెలవులు కూడా అమలు కావడం లేదని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో, ప్రైవేటు సంస్థల్లోనూ ప్రసూతి సెలవులు ఇస్తున్నారని, ఆరోగ్య శాఖ ఉద్యోగులకు వాటిని అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఉద్యోగ భద్రత, వేతన శ్రేణి అమలు, విధుల్లో ప్రమాదం జరిగితే వైద్య రక్షణ కల్పించే ఉద్యోగుల ఆరోగ్య పథకం, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కూడా అందడం లేదని ఆరోపించారు. రూ.3 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం రూ.100 కోట్లు కేటాయిస్తే ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 వేల మంది ఉద్యోగులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఉద్యోగులందరికీ ఆరోగ్య బీమా కల్పించేందుకు రూ.17 కోట్లు ఖర్చు చేస్తే సరిపోతుందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి, ప్రభుత్వ అధికారులు విదేశీ పర్యటనలు చేస్తున్నారని, అలా కాకుండా హర్యానా, పంజాబ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను ఎలా క్రమబద్ధీకరించారో అధ్యయనం చేయాలని సూచించారు. ఆ రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణ ఉద్యోగులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవైపు నిధులు లేవని చెబుతున్న ముఖ్యమంత్రి, మరోవైపు భవిష్యత్తు లేని ఫ్యూచర్ సిటీకి రూ.4 వేల కోట్లతో ఎనిమిది వరుసల రహదారి నిర్మిస్తున్నారని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. కార్మిక సంక్షేమ శాఖలో సుమారు రూ.150 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. బోధి పెవిలియన్‌లో రూ.200 కోట్లు ఖర్చు చేసి, ఇప్పటికే నివాస భవనం ఉన్నప్పటికీ మరో భవనం నిర్మించుకున్నారని, మంత్రులు మరుగుదొడ్ల నిర్మాణానికి సైతం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని అన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి మాత్రం కనీసం రూ.100 కోట్లు ఖర్చు చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదని మండిపడ్డారు. మెడికవర్ ఆస్పత్రులను కాపాడటంపై ఉన్న శ్రద్ధ ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను కాపాడటంపై ఎందుకు లేదని ప్రశ్నించారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు తెలంగాణ ఆరోగ్య రంగాన్ని దేశంలో 11వ స్థానం నుంచి మూడో స్థానానికి తీసుకొచ్చారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల శాతాన్ని 31 నుంచి 70 శాతానికి పెంచారని, తల్లి, శిశు మరణాల రేటును తగ్గించారని పేర్కొన్నారు. 2.98 కోట్ల మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అంధత్వ రహిత రాష్ట్రంగా నిలిపేందుకు కృషి చేశారని చెప్పారు. ఇంతటి సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చిన ఉద్యోగులను పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. క్రమబద్ధ ఉద్యోగిగా పనిచేసే అటెండర్ జీతంలో సగం కూడా ఎన్‌హెచ్ఎం వైద్యుడికి రావడం లేదని అన్నారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, త్వరలో ముఖ్యమంత్రికి లేఖ రాస్తామని ప్రవీణ్ కుమార్ తెలిపారు. అసెంబ్లీలో వారి సమస్యలపై గళం వినిపిస్తామని, ఈ అంశాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు బీఆర్ఎస్ వారి పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.

అక్రమబోర్లపై హైడ్రా దాడులు

- సోమవారం తమ్మిడికుంట వద్ద 6 బోర్లకు చెక్
- సున్నం చెరువు వద్ద 25 బోర్లను తొలగించిన హైడ్రా

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26: చెరువుల చెంత బోర్లు వేసి నీటిని తోడేసి వ్యాపారం చేసుకునేవారిపై హైడ్రా దాడులు కొనసాగుతున్నాయి. శనివారం మాధాపూర్‌లోని సున్నం చెరువు చెంత ఉన్న బోర్లకు చెక్ పెడితే.. సోమవారం శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంట వద్ద దాడులు నిర్వహించింది. తమ్మిడికుంట దిగువ భాగంలోని ప్రభుత్వ భూమిలో బోర్లు వేసి దర్జాగా నీటి దందా చేస్తున్న వారిని హైడ్రా కట్టడి చేసింది. వివిధ ప్రాంతాల్లో బోర్లు వేసి..ప్లాస్టిక్ షీట్లతో తయారు చేసిన కుంటకు సరఫరా చేసి వాటర్ ట్యాంకర్లద్వారా దందా నిర్వహిస్తున్న వారికి హైడ్రా చెక్ పెట్టింది. తమ్మిడికుంట వద్ద 6 బోర్లను పైపు లైన్లతో సహా మోటార్లను తొలగించింది. ప్లాస్టిక్ షీట్లతో తయారు చేసిన నీటి మడుగకు నీరు రాకుండా భూగర్భంలో ఉన్న పైపులను హైడ్రా తొలగించింది. మరోవైపు సున్నం చెరువు చెంత కూడా సోమవారం కూడా దాడులు కొనసాగాయి. మరో 10 బోర్లను పైపులతో సహా పెకలించి నీటి దందాకు చెక్ పెట్టింది. ఇలా సున్నం చెరువు చెంత 25 బోర్లను, తమ్మిడికుంట వద్ద 6 బోర్లను ఇప్పటి వరకూ హైడ్రా తొలగించింది.

రాహుల్ గాంధీ పోరాటాన్ని
ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎస్ఐఆర్‌పై సీడబ్ల్యూసీ సభ్యుడు అవినాష్ పాండే సమీక్ష

హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 26: తెలంగాణలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు అవినాష్ పాండే సమగ్ర సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, ఖైరతాబాద్ జిల్లాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఈ ప్రక్రియపై అవగాహన కల్పించి, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. గాంధీభవన్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశాలు, విలేకరుల సమావేశంలో అవినాష్ పాండే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఓటర్ల జాబితాల నుంచి అర్హుల పేర్లు తొలగిపోకుండా చూడటం కాంగ్రెస్ శ్రేణుల బాధ్యతని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల సవరణలో పారదర్శకత, జవాబుదారీతనం, నిష్పాక్షికత ఉండాలని అన్నారు. ప్రజలు తమ ఓటు వివరాలను పరిశీలించుకునేలా కార్యకర్తలు సహకరించాలని సూచించారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఓటు చోరీ ఆరోపణలు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం చేస్తున్న పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంపై ప్రజలకు నమ్మకం కలగాలంటే ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశ పారదర్శకంగా ఉండాలని తెలిపారు. ఎస్ఐఆర్‌పై ప్రజలకు వాస్తవాధారిత సమాచారం అందించాలని సూచించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, ఖైరతాబాద్ జిల్లాల సమీక్షల్లో రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్, ఎమ్మెల్యేలు గణేశ్, నవీన్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దీపక్ జాన్, రోహిత్, ఖాలిద్ తదితరులతో సమావేశమై కార్యాచరణపై చర్చించారు. అనంతరం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గణేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశంలో పాల్గొని, ఓటర్ల జాబితాల పరిశీలన, తప్పుల సవరణ, అర్హుల ఓటు హక్కు పరిరక్షణపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు పి. ప్రసన్నకుమార్ శర్మ, కొప్పుల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అవినాష్ పాండే పిలుపునిచ్చారు.

శివన్నగూడెం రిజర్వాయర్‌కు ఏదుల నుంచి నీరు

- ఎమ్మెల్యే రాజ్‌గోపాల్‌రెడ్డి చొరవతో కీలక ముందడుగు
- డిండి ఎత్తిపోతల పథకానికి రూ.1,800 కోట్లతో పరిపాలనా అనుమతులు.. పనులకు టెండర్లు
- గతంలో నిర్వాసితుల పరిహారం కోసం అసెంబ్లీలో పోరాటం

మునుగోడు వెలుతురు, అక్టోబర్ 26: దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల సాగు, తాగునీటి అవసరాలకు కీలకంగా మారనున్న డిండి ఎత్తిపోతల పథకంలో మరో ముందడుగు పడింది. శివన్నగూడెం రిజర్వాయర్‌కు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించే అంశంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి చొరవ తీసుకున్నారని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతోపాటు, సంబంధిత మంత్రులు, అధికారులతో చర్చలు జరిపి ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించేలా కృషి చేశారని ఆ వర్గాలు వెల్లడించాయి.

పదేళ్ల నిర్లక్ష్యంపై పోరాటం..

నిర్వాసితుల పరిహారం కోసం అసెంబ్లీలో గళం శివన్నగూడెం రిజర్వాయర్‌కు 2015 జూన్ 12న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. అయితే, ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమైనప్పటికీ రిజర్వాయర్‌లోకి నీటిని ఎక్కడి నుంచి తీసుకురావాలనే అంశంపై స్పష్టత లేకపోవడంతో పనుల్లో జాప్యం జరిగిందని కాంగ్రెస్ వర్గాలు విమర్శిస్తున్నాయి. మరోవైపు, 2016 మే 2న ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టును 2019 జూన్ 21న ప్రారంభించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, నల్గొండ జిల్లాలోని వెనుకబడిన మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని వారు ఆరోపిస్తు న్నారు. శివన్నగూడెం రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపులోనూ జాప్యం జరిగిందని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణలో పరిహారం చెల్లింపుతో పోలిస్తే, శివన్నగూడెం నిర్వాసితులకు పరిహారం అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం జరిగిందని విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో, అప్పట్లో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న రాజ్‌గోపాల్‌రెడ్డి నిర్వాసితుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తూ పరిహారం కోసం పోరాడారని కాంగ్రెస్ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. ఆయన రాజీనామా అనంతరం పరిహారం చెల్లింపు ప్రక్రియ వేగవంతమైందని, నిర్వాసితులకు న్యాయం జరిగిందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఏదుల నుంచి నీటి తరలింపునకు ప్రణాళిక

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శివన్నగూడెం రిజర్వాయర్‌కు నీటి తరలింపు అంశంపై రాజ్‌గోపాల్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని డిండి ప్రాజెక్టు ప్రాంతానికి తీసుకెళ్లి, దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు నీటిని అందించాలంటే ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించడం అవసరమని వివరించినట్లు తెలిపారు. దీనికి ముందుగా తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్స్ ఫోరం సభ్యులతో పలుమార్లు సమావేశమై, శివన్నగూడెం రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు అనువైన మార్గాలు, సాంకేతిక అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఏదుల నుంచి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లోని రిజర్వాయర్లకు నీటిని తరలించే పనుల కోసం సుమారు రూ.1,800 కోట్లతో పరిపాలనా అనుమతులు పొందే ప్రక్రియలో రాజ్‌గోపాల్‌రెడ్డి చొరవ తీసుకున్నారని, ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం లభించిందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. సంబంధిత పనులకు టెండర్లు పిలిచారని, పనులు కొనసాగుతున్నాయని తెలిపాయి. నీటి తరలింపు పనుల పురోగతిపై ఆయన ఎప్పటికప్పుడు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారని, ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్స్ ఫోరం సభ్యుడు శ్యాంప్రసాద్‌రెడ్డితోనూ చర్చిస్తున్నారని పేర్కొన్నాయి. గతంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నల్గొండ జిల్లా ప్రాజెక్టులను పూర్తి చేయడంలో తగిన శ్రద్ధ చూపలేదని కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు. అప్పట్లో అధికారంలో ఉన్న స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లలేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, గతంలో ప్రాజెక్టుల విషయంలో తమ పాత్రను కూడా సమీక్షించుకోవాలని కాంగ్రెస్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. మునుగోడు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా రాజ్‌గోపాల్‌రెడ్డి క్షేత్రస్థాయి అధికారుల నుంచి ఉన్నతాధికారుల వరకు సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టుల పురోగతిపై దృష్టి సారిస్తున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఏదుల నుంచి శివన్నగూడెం రిజర్వాయర్‌కు నీటి తరలింపు పనులు పూర్తయితే దేవరకొండ, మునుగోడు ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు ప్రయోజనం చేకూరుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

‘సర్’ నిర్ణయాలన్నీ ఏకగ్రీవమే!

- సుప్రీంకోర్టులో ఎన్నికల సంఘం అఫిడవిట్
- చట్టబద్ధంగానే ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ
- ఫారం-6లో మార్పులు చేశారన్న ఆరోపణలను ఖండించిన ఈసీ

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 26:

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై వస్తున్న ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం గట్టిగా తోసిపుచ్చింది. ‘సర్’కు సంబంధించిన నిర్ణయాలన్నీ చట్టబద్ధంగానే తీసుకున్నామని సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. ఈ ప్రక్రియకు సంబంధించి జారీ చేసిన మూడు ఉత్తర్వులను ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని వెల్లడించింది. ఇతర కమిషనర్ల ఆమోదం లేకుండానే సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలను ఖండించింది. ఓటర్ల నమోదుకు వినియోగించే ఫారం-6లో మార్పులు చేశారంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సోమవారం ఎన్నికల సంఘం అఫిడవిట్ సమర్పించింది. ఈ అఫిడవిట్‌ను సైతం ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు పేర్కొంది.

చట్టంలోగానీ, ఫారం-6లోగానీ ఎలాంటి సవరణలు చేయలేదని ఎన్నికల సంఘం తేల్చిచెప్పింది. ‘సర్’ ప్రక్రియలో వినియోగించిన డిక్లరేషన్ ప్రత్యేక పత్రమేనని, అది ఫారం-6లో భాగం కాదని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వుల ద్వారా ఫారం-6ను సవరించారన్న పిటిషనర్ల వాదనలో వాస్తవం లేదని పేర్కొంది. వార్తాపత్రికల్లో ప్రచురితమైన కథనాలను చట్టపరమైన సాక్ష్యాలుగా పరిగణించలేమని, వాటి ఆధారంగా ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను విధుల నిర్వహణ నుంచి అడ్డుకోలేరని వాదించింది. ఎన్నికల సంఘం నిర్ణయాలపై దాఖలైన పిటిషన్లలో పసలేదని పేర్కొంటూ వాటిని కొట్టివేయాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరింది.

శ్రీవారిని దర్శించుకున్న ఉప రాష్ట్రపతి

తిరుమల, వెలుతురు అక్టోబర్ 26:

భారత ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సోమవారం సాయంత్రం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా క్షేత్ర సాంప్రదాయాన్ని పాటిస్తూ ఉప రాష్ట్రపతి శ్రీ వరాహ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయం వద్దకు ఉప రాష్ట్రపతి చేరుకోగానే టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణలు ఆయనను సాదరంగా ఆహ్వానించగా, అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. తరువాత ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అటు పిమ్మట శ్రీ వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. భారత ఉపరాష్ట్రపతికి టీటీడీ ఈవో, అదనపు ఈవో స్వామి వారి చిత్ర పటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు.

ఉప రాష్ట్రపతి శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయస్వామి వారిని కూడా అనంతరం దర్శించుకున్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖుల్లో జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ,టిటిడి బోర్డు సభ్యులు రామ్మూర్తి, దివాకర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, పలువురు రాష్ట్రస్థాయి మరియు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ గొంతును బలంగా వినిపిస్తాం

బ్రిక్స్ పార్లమెంటరీ సమావేశాల్లో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

న్యూఢిల్లీ / హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26:

ఢిల్లీలోని సంవిధాన్ సదన్ (పాత పార్లమెంట్ భవనం)లో అక్టోబర్ 26, 27 తేదీల్లో జరుగుతున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశాల్లో తెలంగాణ శాసనసభాపతి, వికారా బాద్ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు కూడా పాల్గొన్నారు.

అంతకుముందు సోమవారం ఉదయం శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఢిల్లీలో జరిగే బ్రిక్స్ సమావేశాలకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఆయన మాట్లాడుతూ, బ్రిక్స్ సమావేశాల వేదికపై తెలంగాణ గొంతును బలంగా వినిపిస్తామని స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్ర ప్రగతి, రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలను ఈ సమావేశాల్లో వివరిస్తామని తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ ఖ్యాతిని మరింత పెంచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.స్పీకర్ పర్యటన విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షలు తెలిపారు.

గుజరాత్‌ను మించిపోతున్న ఆంధ్రా

విజయవాడ, వెలుతురు అక్టోబర్ 26:

ఏపీ పోర్టులు 210 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు రవాణాతో దేశంలోనే రెండో స్థానంలో నిలిచాయి. నౌకల టర్న్ ఎరౌండ్ సమయం తగ్గించడం, వసతులు మెరుగుపడటంతో గత ఏడాదితో పోలిస్తే సరకు రవాణాలో 12 శాతం పెరుగుదల నమోదైంది. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ పోర్టులు పూర్తయితే మరో 109 ఎంఎంటీల సామర్థ్యం అదనంగా అందుబాటులోకి వస్తుంది. ఈ లక్ష్యాలు నెరవేరితే నాన్-మేజర్ పోర్టుల సరకు రవాణాలో మొదటి స్థానంలో ఉన్న గుజరాత్‌ను ఆంధ్రప్రదేశ్ త్వరలోనే దాటేయడం ఖాయంగా కనిపిస్తోంది. సముద్ర వాణిజ్యంలో ఆంధ్రప్రదేశ్ రికార్డు స్థాయిలో దూసుకుపోతోంది. 2025-26 సంవత్సరానికిగానూ రాష్ట్రంలోని పోర్టుల ద్వారా సుమారు 210 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఓటు) సరకు రవాణా జరగడంతో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. నాన్-మేజర్ పోర్టుల కార్గో సామర్థ్యంలో ప్రస్తుతం గుజరాత్ టాప్ 1లో ఉంది. ఏపీ వ్యూహాత్మక అడుగులతో భవిష్యత్తులో గుజరాత్‌ను వెనక్కి నెట్టి నెంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకునే దిశగా పయనిస్తోందని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్-డీజీసీఐఎస్ (తాజా లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. 2025-26 సంవత్సరానికి పోర్టుల ద్వారా సుమారు 210 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు రవాణా అయింది. 2024-25 తో పోలిస్తే ఇది సుమారు 12 శాతం ఎక్కువ. దేశంలో నాన్- మేజర్ పోర్టుల సరకు రవాణా సామర్థ్యంలో గుజరాత్ ప్రథమ స్థానంలో ఉంది. ఏపీ రెండో స్థానంలో నిలిచింది. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్-డీజీసీఐఎస్ రీసెంట్‌గా వెల్లడించింది.విశాఖ మేజర్ పోర్టు నుంచి 91.17 ఎంఎంటీల రవాణా జరిగింది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే ఇది 10.35 శాతం పెరుగుదల. గతంలో రవాణా కేవలం 82.62 ఎంఎంటీలుగా ఉంది. ఈ ఏడాది రాష్ట్రంలోని నాన్-మేజర్ పోర్టుల ద్వారా 118.83 ఎంఎంటీల రవాణా జరిగింది. నౌకల టర్న్ ఎరౌండ్ టైమ్‌ని తగ్గించడం, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా తెలుస్తుంది. కాగా ప్రస్తుతం విశాఖ పట్నం, గంగవరం, కృష్ణపట్నం తదితర పోర్టుల మొత్తం సామర్థ్యం 327.5 ఎంఎంటీలు. అందులో కేవలం 64.12 శాతం మాత్రమే వినియోగించుకోవడం జరుగుతుంది. ఈ పూర్తి సామర్థ్యాన్ని వాడుకోవాల్సి ఉంది. దీంతోపాటు కొత్తగా నిర్మాణంలో ఉన్న రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ పోర్టుల తొలిదశ పనులు పూర్తయితే అదనంగా మరో 109 ఎంఎంటీల సామర్థ్యం అందుబాటులోకి వస్తుంది. 2026-27 నాటికి నాన్-మేజర్ పోర్టుల సామర్థ్యాన్ని 191 ఎంఎంటీల నుంచి 285 ఎంఎంటీలకు పెంచాలన్న ఏపీ మారిటైం పాలసీ లక్ష్యం నెరవేరితే, దేశ కార్గో రవాణాలో గుజరాత్‌కు ఏపీ గట్టి పోటీ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

జెడ్పీ ఎన్నికల్లో వారసులొస్తున్నారు...

విశాఖపట్టణం, వెలుతురు అక్టోబర్ 26:

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా పరిషత్ ఎన్నికలు రాజకీయ వారసులకు వేదికగా మారుతున్నాయి. భవిష్యత్తులో ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎదగాలని ఆశిస్తున్న పలువురు నేతల కుటుంబ సభ్యులు జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే రాజకీయాల్లో కీలక పదవులు చేపట్టిన నాయకులు తమ కుటుంబ సభ్యులను ఎన్నికల బరిలోకి దింపడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా అధికార కూటమి పార్టీల్లో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తుండటంతో, ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న ద్వితీయ శ్రేణి నాయకుల్లో అసంతృప్తి పెరుగుతోందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోందిజిల్లా పరిషత్ అధ్యక్ష పదవిని భవిష్యత్తు రాజకీయాలకు పునాదిగా భావిస్తున్న పలువురు నేతలు తమ కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని ప్రయత్నిస్తున్నారు. మరోవైపు వైసీపీలోనూ పలువురు నాయకుల వారసులు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే పార్టీ ఉనికిని కాపాడుకోవడం, స్థానికంగా తమ బలాన్ని నిలబెట్టుకోవడం కూడా ఈ పోటీ వెనుక కారణాలుగా విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఉత్తరాంధ్రలోని విజయనగరం జిల్లాలో జడ్పీ అధ్యక్ష పదవిపై ఆసక్తికరమైన పోటీ కనిపిస్తోంది. సీనియర్ నేత, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు కోడలితోపాటు, మాజీ జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్ర, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు కుమార్తె చంద్రకళ నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీకి చెందిన మాజీ మంత్రి బొత్స కుటుంబ సభ్యులు కూడా నామినేషన్లు వేయడంతో పోటీపై ఉత్కంఠ నెలకొంది. అనకాపల్లిజిల్లాలోనూ కుటుంబ రాజకీయాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు భార్య అరుణ, కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ భార్య సత్యవతి, జనసేన నేత సుందరపు సతీష్ భార్య జడ్పీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి కుమార్తె తేజశ్వి కూడా నామినేషన్ వేశారు. గోదావరి జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గొల్లపల్లి అమూల్య పోటీలో ఉండగా, కాకినాడలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పేరు తెరపైకి వచ్చింది. పశ్చిమగోదావరి జిల్లాలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ కుమారుడు పితాని వెంకట్, ఏలూరులో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె నవ్య, మాజీ ఎంపీ మాగంటి బాబు సతీమణి పద్మావతి పోటీకి సిద్ధమయ్యారు. రాయలసీమలోనూ వారసుల సందడి పెరిగింది. సత్యసాయి జిల్లాలో పరిటాల శ్రీరామ్, నంద్యాల జిల్లాలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సోదరుడు రాజారెడ్డి, కర్నూలులో కేఈ ప్రభాకర్ కుమారుడు రుద్రఫణి నామినేషన్లు దాఖలు చేశారు. ఈ పరిణామాలతో పార్టీ కోసం చాలాకాలంగా పనిచేస్తున్న నాయకుల్లో తమకు అవకాశాలు తగ్గిపోతాయనే ఆందోళన నెలకొంది. కొత్త పదవులు వస్తాయని ఆశించిన వారికి కుటుంబ రాజకీయాలు అడ్డంకిగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నేతలు తమ జిల్లాల్లో రాజకీయ పట్టు నిలబెట్టుకోవడానికి వారసులను ముందుకు తీసుకొస్తుండగా, మరికొందరు భవిష్యత్తులో మంత్రి పదవులు పొందేందుకు పార్టీ నాయకత్వంపై ఒత్తిడి పెంచే వ్యూహంలో ఉన్నారని చర్చ సాగుతోంది. అయితే చివరకు ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆయా పార్టీల అధిష్టానాల నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.

ఎస్ఐఆర్ పెండింగ్ పనులు 4 రోజుల్లో పూర్తి చేయాలి

- రికార్డులు, ఆధారాలు పక్కాగా భద్రపరచాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26:

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను మూడు, నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, ప్రతి దరఖాస్తుకు సంబంధించిన వివరాలు, ఆధారాలను పారదర్శకంగా నమోదు చేసి భద్రపరచాలని స్పష్టం చేశారు.

సోమవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించారు. సుమారు 4.50 లక్షల పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఈ వారాంతంలోగా పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్ నోటీసుల విచారణను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా ముగించాలని ఆదేశించారు.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల దరఖాస్తులను అనర్హమైనవిగా గుర్తించగా, వాటిలో 44 వేల దరఖాస్తులకు సంబంధించిన ప్రక్రియను తుది దశకు తీసుకొచ్చినట్లు తెలిపారు. అనర్హతకు సంబంధించిన కారణాలు, ధ్రువీకరణ పత్రాలు, ఇతర ఆధారాలను తప్పనిసరిగా భద్రపరచాలన్నారు. రాజకీయ పార్టీలు, సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుదారులు వివరాలు కోరినప్పుడు వెంటనే అందించేలా రికార్డులు సిద్ధంగా ఉంచాలని సూచిం చారు. ఫారం-6, ఫారం-7 దరఖాస్తులకు సంబం ధించిన పెండింగ్ పనులను నవంబర్ 5లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపులకు సంబంధించిన పత్రాలను భౌతికంగా, ఆన్‌లైన్‌లో భద్రపరచాలని స్పష్టం చేశా రు. భవిష్యత్తులో న్యాయపరమైన వివాదాలు తలెత్తి నా, సమాచార హక్కు చట్టం కింద వివరాలు కోరినా ఆధారాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

తిరుమలలో సగానికి తగ్గిన నీటి నిల్వలు

తిరుమల, వెలుతురు అక్టోబర్ 26:

తిరుమలలో నీటి అవసరాలను తీర్చేందుకు పాపవినాశనం, గోగర్భం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార జలాశయాలు ఉన్నాయి. ఈ ఐదు రిజర్వాయర్లలో కలిపి 21.60 లక్షల గ్యాలన్ల నీటిని వినియోగించగా.. 40.08 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా నిల్వ ఉందని టీటీడీ తెలిపింది. దీంతో తిరుమల ముఖ్యమైన ఐదు జలాశయాల్లో 61.68 లక్షల గ్యాలన్ల నీటి పెరుగుదల ప్రధాన నీటి వనరులుగా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌నినో ప్రభావం కనిపిస్తోంది.. ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో నీళ్ల సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందంటున్నారు. తిరుమల నీటి అవసరాల కోసం కొన్ని జలాశయాలు ఉన్నాయి.. తిరుమలలో పాపవినాశనం, గోగర్భం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార జలాశయాలు ప్రధాన నీటి వనరులుగా ఉన్నాయి.. వీటిలో నీటిమట్టం గురించి టీటీడీ స్పష్టత ఇచ్చింది. తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాల్లో శుక్రవారం వరకు మొత్తం 61.68 లక్షల గ్యాలన్ల నీటి మట్టం పెరిగిందని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఐదు జలాశయాల్లో కలిపి 21.60 లక్షల గ్యాలన్ల నీటిని వినియోగించగా, 40.08 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా నిల్వ ఉందని తెలిపారు.పాపవినాశనం డ్యామ్ నిల్వ సామర్థ్యం 5,240.00 లక్షల గ్యాలన్లు కాగా.. అంతకముందు 2,667.39 లక్షల గ్యాలన్లు ఉంటే.. ప్రస్తుత నిల్వ 2,688.35 లక్షల గ్యాలన్లకు పెరిగింది.. పెరిగిన నీరు 20.96 లక్షల గ్యాలన్లుగా ఉంది. వినియోగం 14.10 లక్షల గ్యాలన్లు ఉంది.. మిగులు నీరు 6.86 లక్షల గ్యాలన్లుగా ఉంది. గోగర్భం డ్యామ్ నిల్వ సామర్థ్యం 2,833.10 లక్షల గ్యాలన్లు కాగా.. గత రోజు నిల్వ 499.06 లక్షల గ్యాలన్లు ఉన్నాయి.. ప్రస్తుత నిల్వ 508.31 లక్షల గ్యాలన్లుగా ఉంది.. పెరిగిన నీరు 9.25 లక్షల గ్యాలన్లు కాగా, వినియోగం 7.50 లక్షల గ్యాలన్లుగా ఉంది.. మిగులు నీరు 1.75 లక్షల గ్యాలన్లు.ఆకాశగంగ డ్యామ్‌లో నిల్వ సామర్థ్యం 685.00 లక్షల గ్యాలన్లు ఉంటే.. గత రోజు నిల్వ 24.07 లక్షల గ్యాలన్లుగా ఉందని తెలిపారు. ప్రస్తుత నిల్వ 30.40 లక్షల గ్యాలన్లు కాగా.. పెరిగిన నీరు 6.33 లక్షల గ్యాలన్లు.. వినియోగం 0.00 లక్షల గ్యాలన్లు.. మిగులు నీరు 6.33 లక్షల గ్యాలన్లుగా ఉంది. కుమారధార డ్యామ్ నిల్వ సామర్థ్యం 4,259.01 లక్షల గ్యాలన్లు కాగా.. గత రోజు నిల్వ 338.84 లక్షల గ్యాలన్లుగా ఉంది. ప్రస్తుత నిల్వ 363.98 లక్షల గ్యాలన్లు కాగా.. పెరిగిన నీరు 25.14 లక్షల గ్యాలన్లుగా ఉంది. వినియోగం 0 గ్యాలన్లు కాగా.. మిగులు నీరు 25.14 లక్షల గ్యాలన్లుగా ఉంది. పసుపుధార డ్యామ్ నిల్వ సామర్థ్యం 1,287.54 లక్షల గ్యాలన్లు కాగా.. గత రోజు నిల్వ 24.38 లక్షల గ్యాలన్లుగా ఉంది. ప్రస్తుత నిల్వ 24.38 లక్షల గ్యాలన్లు కాగా.. నీరు పెరగలేదు.. వినియోగం లేదు, మిగులు నీరు 0 గ్యాలన్లుగా ఉంది.మొత్తంగా ఐదు జలాశయాల్లో 61.68 లక్షల గ్యాలన్ల నీరు పెరగ్గా, 21.60 లక్షల గ్యాలన్ల నీరు వినియోగమైంది. ప్రస్తుతం 40.08 లక్షల గ్యాలన్ల నీరు మిగులుగా ఉంది. ఆకాశగంగ డ్యామ్ పరిధిలో 8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సమయంలో 7.02 లక్షల గ్యాలన్లు, నవరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో 148.48 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా చేరింది. అక్టోబర్ 23వ తేదీ వరకు మొత్తం 244.46 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా చేరిందని టీటీడీ తెలిపింది.

ఏఈఈ పరీక్షకు మరో అవకాశం

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తు చేసుకున్నవారే ఈ వెసులుబాటుకు అర్హులు. ఇతర అభ్యర్థులకు ఈ అవకాశం వర్తించదు.

పరీక్ష తేదీలపై అభ్యర్థులకు ఊరట

జూనియర్ ఇంజినీర్ (సివిల్) పరీక్షలు నవంబర్ 2 నుంచి 6 వరకు జరగనుండగా, సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ (సివిల్) పరీక్షలు నవంబర్ 6, 7 తేదీల్లో నిర్వహించేందుకు షెడ్యూల్ చేశారు. రెండు పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు తేదీల మధ్య ఏర్పడిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని టీజీపీఎస్సీ ఈ నిర్ణయం తీసుకుంది. అర్హులైన అభ్యర్థులు గడువులోగా అవసరమైన పత్రాలను సమర్పించి, కమిషన్ నుంచి వెలువడే తదుపరి సూచనలను గమనించాలని సూచించారు.

పవన్ వ్యూహాత్మక మౌనమేనా?



తిరుపతి, వెలుతురు అక్టోబర్ 26:

హింసాత్మక సంఘటనలపై ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించకపోవడం నష్టంగానే చూడాలి. నేరుగా బహిరంగంగా తీవ్రస్థాయి లో స్పందించకపోవడంపై రాజకీయ వర్గాల్లో విభిన్న విశ్లేషణలు సాగుతున్నాయి. ఈ మౌనం ఆయనకు రాజకీయంగా నష్టమా లేదా అనేది విశ్లేషకులు మరియు ప్రత్యర్థుల కోణాల్లో భిన్నంగా ఉంది. అయితే, కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ఉమ్మడి ప్రకటన విడుదల చేస్తూ, వైసీపీ హింసను ప్రేరేపిస్తోందని అధికారికంగా ఆరోపించారు. కానీ జరుగుతున్న పరిణామాలపై ఆయన నేరుగా స్పందించలేదు. ఏ చిన్న ఘటన జరిగినా వెంటనే స్పందించే జనసేనాని ఇంత జరుగుతున్నా స్పందించకపోవడం ఏంటన్న ప్రశ్న తలెత్తుతుంది. భవిష్యత్‌లో ఏదైనా జరిగినా పవన్ కల్యాణ్ స్పందించినా ఆయన మాటలకు విలువ ఉండకపోవచ్చన్న విశ్లేషణలు వెలువడుతు న్నాయి. పవన్ కల్యాణ్ కు ఇతర ఏ పార్టీల రాజకీ య పార్టీల అధినేతలకు లేని క్లీన్ ఇమేజ్ ఉంది. అది ఆయన సొంతం. నిజాయితీగా రాజకీయం చేస్తారని నమ్ముతారు. అలాగే ప్రశ్నించడం కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పే పవన్ కల్యాణ్ ఈ ఘటనలపై కనీసం స్పందించకపోవడాన్ని పలువురు రాజకీయ విశ్లేషకులు కూడా తప్పుపడుతున్నారు. కూటమిలో భాగస్వామిగా ఉండకపోవడంతో స్పం దించడం లేదని సర్ది చెప్పుకోవచ్చు. కానీ సామా న్యులలో మాత్రం జరుగుతున్న ఘటనల్లో పవన్ కల్యాణ్‌కు కొంత షేరింగ్ తగులుకుంటుందేమోనన్న ఆందోళన జనసైనికుల్లోనూ,పవన్ అభిమానుల్లోనూ వ్యక్తమవుతుంది. వారి ఆందోళనలకు కారణమదే. జనసైనికులు నేరుగా తమ ఆందోళనలను, అసమ్మ తిని సోషల్ మీడియాలో చెబుతున్నా పవన్ కల్యాణ్ కనీసం పట్టించుకోకపోవడాన్ని పలువురు ప్రశ్నిస్తు న్నారు. గతంలోనూ శాంతి భద్రతల సమస్యపై బహిరంగంగానే తన అసంతృప్తిని పవన్ కల్యాణ్ వ్యక్తం చేసిన విషయాన్ని పార్టీకి చెందిన నాయకులే గుర్తు చేస్తున్నారు. అధికార కూటమిలో ఉపముఖ్య మంత్రిగా కీలక పాత్ర పోషిస్తున్న పవన్ కల్యాణ్, రాష్ట్రంలో ప్రధానంగా పులివెందుల, పుంగనూరు, రాజంపేట వంటి ప్రాంతాల్లో జరిగిన హింసపై ప్రత్యేకంగా గళం విప్పకపోవడం ఆయన ఇమేజ్‌కు మైనస్ అవుతుందని వైసీపీ వంటి ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హింసను, దౌర్జన్యాలను తీవ్రంగా వ్యతిరేకించిన పవన్, ఇప్పుడు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జరుగుతున్న గొడవలపై ఎందుకు దూకుడుగా స్పందించడం లేదనే ప్రశ్నలను సోషల్ మీడియాలో కొందరు లేవనెత్తుతున్నారు. పవన్ కల్యాణ్ ఒంటరిగా కాకుండా కూటమి పరంగా ఉమ్మడి వ్యూహంతో ముందుకు వెళ్తున్నారంటున్నారు. అటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇటు పవన్ కల్యాణ్ సంయుక్తంగా స్పందిస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడానికి వైసీపీ కుట్రలు చేస్తోందని, కోర్టుల్లో పిటిషన్లు వేస్తూ హింసను ప్రేరేపిస్తోందని విమర్శించారు.

లోక కల్యాణం కోసం మహా చండీయాగం

హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో 18వ చండీయాగం నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, వెలుతురు అక్టోబర్ 26 :

లోక కల్యాణం కోసం హుస్నాబాద్‌లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 18వ మహా చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అమ్మవారి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజాపాలన ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి అవరోధాలు కలగకుండా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి రోజున హుస్నాబాద్‌లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మహా చండీయాగం, ప్రతి అమావాస్య రోజున కొత్తకొండలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రేణుకా ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించే మహాచండీయాగంలో హుస్నాబాద్ ప్రజలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని మంత్రి పొన్నం కోరారు.

వరదల నివారణలో.. చెరువుల పునరుద్ధరణ భేష్

- దేశానికి దిక్సూచిగా హైడ్రా నిలుస్తుందన్న ఎండీఎంఏ
- హైడ్రా కార్యక్రమాలను ఎన్‌డీఎంఏ అధికారులకు వివరించిన కమిషనర్

హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 26:

హైడ్రా చేపట్టిన చెరువుల పునరుద్ధరణ బాగుందని ఎన్‌డీఎంఏ అభినందించింది. పట్టణ ప్రాంతాల్లో వరదల కట్టడికి హైడ్రా చర్యలను ఓ నమూనాగా తీసుకోవచ్చని పేర్కొంది. గొలుసు కట్టు చెరువుల పునరుద్ధరణతో చాలావరకు వరదలను నివారించవచ్చునని.. పూర్వీకులు ఇదే ప్రాతిపదికన కాలువలు, చెరువులను అభివృద్ధి చేశారని గుర్తు చేసింది. నగరీకరణలో చెరువులు, వరద కాలువలు కనుమరుగవ్వడంతో పట్టణ ప్రాంతాల్లో వరదలు ముంచెత్తుతున్నాయని అభిప్రాయ పడింది. పట్టణ వరదల నిర్వహణపై కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ నెల 27న ఢిల్లీలో ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీకి వెళ్లిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం ఎన్ఎండీఏ అధికారులను కలిశారు. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, హైదరాబాద్‌లో చెరువుల పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టెక్నోక్రాట్స్ సంస్థ డైరెక్టర్ యూనస్ పర్వేజ్ తో కలిసి హైడ్రా కమిషనర్ ఎన్‌డీఎంఏ అధికారులను కలిసారు. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి (విపత్తుల నిర్వహణ) అధ్యక్షతన పట్టణ వరదల నిర్వహణపై జరగనున్న సదస్సుకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ని రాష్ట్ర ప్రభుత్వం నోడల్ ఆఫీసర్‌గా నియమించింది. ఈ క్రమంలో ఎన్‌డీఎంఏ ఉన్నతాధికారులను కలిసి నగరంలో చెరువులతో పాటు.. వరద కాలువల పునరుద్ధరణలో హైడ్రా చేపట్టిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్‌డీఎంఏ విభాగాధిపతి కృష్ణ ఎస్.వాస్తవ, కార్యదర్శి నీల్‌కాంత్ ఎస్ అవ్‌హాద్, సలహాదారులు కల్నల్ కీర్తి ప్రతాప్‌సింగ్ కార్యదర్శి చందన్ సింగ్ తదితరులతో సమావేశమై పట్టణ వరదల కట్టడికి హైడ్రా చేస్తున్న కార్యక్రమాలను కమిషనర్ రంగనాథ్ తెలియజేశారు. మొదటి విడతగా 6 చెరువుల పునరుద్ధరణ పూర్తి చేయగా.. ఆ పరిసరాల్లో వర్షాకాలంలో వరదలు లేకపోవడమే కాకుండా.. చెరువుల్లో పూడిక తీయడంతో భూగర్భ జలాలు పెరిగాయని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు. సికింద్రాబాద్‌లోని ప్యాట్నీ నాలా, అమీర్‌పేటలోని నాలా, సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఉన్న శ్రీరాంనగర్‌లో వరద కాలువలను అభివృద్ధి చేయడంతో వరదల కట్టడి చేశామని చెప్పారు. నాలాల ఆక్రమణలు తొలగించక ముందు.. తర్వాత పరిస్థితులను కళ్లకు కట్టారు. రెండో విడత చేపడుతున్న 14 చెరువులతో పాటు.. నగరం నలువైపులున్న చేపట్టనున్న 4 ప్రధాన చెరువుల గురించి హైడ్రా కమిషనర్ వివరించారు. ఈ సందర్భంగా హైడ్రా కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన పుస్తకాలను ఎన్‌డీఎంఏ అధికారులకు అందజేశారు. పవర్‌పాయింట్ ప్రదర్శన తిలకించిన తర్వాత.. ఆక్రమణలు తొలగించినప్పుడు వచ్చే ఇబ్బందులపై హైడ్రా అధికారులతో ఎన్ ఎం డీఏ అధికారులు చర్చించారు. తగిన విధంగా ఎన్‌డీఎంఏ, ఎన్‌డీఆర్ ఎఫ్ నుంచి నిధులు సమకూరేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి (విపత్తుల నిర్వహణ) అధ్యక్షతన పట్టణ వరదల నిర్వహణపై మంగళవారం ఢిల్లీలో జరగనున్న సదస్సులో హైడ్రా కమిషనర్ పాల్గొని హైడ్రా చేపట్టిన కార్యక్రమాలను వివరించనున్నారు.

'ఓట్ బచావో - దేశ్ బచావో' ర్యాలీ కోసం సమన్వయ కమిటీ ఏర్పాటు

- ఐదుగురు ప్రజాప్రతినిధులకు బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ అధ్యక్షుడు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26 :

ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నవంబర్ 1, 2026న నిర్వహించనున్న 'ఓట్ బచావో - దేశ్ బచావో' మెగా నేషనల్ ర్యాలీ కోసం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ ఐదుగురు సభ్యులతో కూడిన సమన్వయ కమిటీని నియమించారు. ఈ జాతీయ ర్యాలీకి తెలంగాణ నుంచి హాజరయ్యే నాయకులకు ప్రయాణం, వసతి, ఇతర అవసరమైన సౌకర్యాల కల్పనతో పాటు సంబంధిత ఏర్పాట్లను సమర్థవంతంగా సమన్వయం చేయడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, వాకిటి శ్రీహరి ముదిరాజ్ లు, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, పి. బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డిలను మహేష్ కుమార్ నియమించారు. జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ఈ ర్యాలీకి సంబంధించి తెలంగాణ నుంచి పాల్గొనే నాయకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడం, ప్రయాణం, వసతి అంశాల్లో సమన్వయంతో వ్యవహరించడం కోసం కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించారు.

చెన్నూరును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- గోదావరి తీరంలో రూ.17 కోట్లతో శివాలయం అభివృద్ధి పనులు
- శక్తి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

చెన్నూరు, వెలుతురు అక్టోబర్ 26:

చెన్నూరు పట్టణాన్ని ఆదర్శవంతమైన పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు, పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని శక్తి, గనుల మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ చెన్నూరు రూపురేఖలను మారుస్తున్నామని చెప్పారు. పట్టణంలో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు.

చెన్నూరులో దీర్ఘకాలంగా ఉన్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపేందుకు స్థానిక వ్యాపారుల విజ్ఞప్తి మేరకు రోడ్డు విస్తరణ చేపట్టామని మంత్రి తెలిపారు. తొలుత రూ.1.5 కోట్లతో బైపాస్ రోడ్డును రికార్డు సమయంలో పూర్తి చేశామని చెప్పారు. రోడ్డు విస్తరణలో ఏ ఒక్క చిరువ్యాపారీ నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గతంలో దుకాణాలు తొలగించి తిరిగి నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదని, తమ ప్రభుత్వం మాత్రం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని అన్నారు.

ఇందులో భాగంగా రూ.1.2 కోట్లతో 20 కొత్త దుకాణాల నిర్మాణానికి భూమిపూజ చేశామని, నాలుగు నెలల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. మిగిలిన అర్హులైన చిరువ్యాపారుల కోసం త్వరలో మరో 50 ఆధునిక దుకాణాలను నిర్మించి అందిస్తామని హామీ ఇచ్చారు. చెన్నూరు ప్రధాన రహదారి విస్తరణ పనులను మరో మూడు నెలల్లో పూర్తి చేయాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి ఆదేశించారు. పట్టణంలోని 10వ వార్డులో రూ.3.5 కోట్లతో 750 మీటర్ల మేర రోడ్డు విస్తరణ చేపడుతున్నామని, డబుల్ ఆర్మ్ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. TUFIDC నిధులతో పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాబోయే ఆరు నెలల్లో పట్టణంలోని ప్రధాన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతున్నామని అన్నారు.

గోదావరి పుష్కరాల నేపథ్యంలో చెన్నూరు అభివృద్ధికి రికార్డు స్థాయిలో రూ.70 కోట్ల నిధులు మంజూరు చేయించామని మంత్రి వెల్లడించారు. చెన్నూరుకు ఎక్కువ నిధులు సాధించేందుకు ప్రభుత్వంతో చర్చించి ప్రత్యేకంగా కృషి చేశామని తెలిపారు.

గోదావరి తీరంలో రూ.17 కోట్లతో శివాలయాన్ని అభివృద్ధి చేసి, ఆ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎన్‌హెచ్-63 నుంచి గోదావరి పుష్కర ఘాట్లకు వెళ్లే రహదారి అభివృద్ధికి రూ.6 కోట్లు కేటాయించామని తెలిపారు. పోచమ్మ గుడి వద్ద భక్తులకు, ముఖ్యంగా మహిళలకు అవసరమైన డైనింగ్ హాల్, వాష్‌రూమ్‌లు, ఇతర వసతుల కల్పనకు రూ.2 కోట్లు వెచ్చిస్తున్నామని వివరించారు. మహాశివరాత్రి సందర్భంగా జైపూర్ వెళ్లే భక్తుల సౌకర్యార్థం మరో రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

జైపూర్ రిజర్వ్ ఫారెస్ట్‌లోని క్రొకడైల్ పార్క్ వద్ద ఆధునిక గెస్ట్‌హౌస్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. చెన్నూరు శివాలయం, క్రొకడైల్ పార్క్, కాళేశ్వరం తదితర ప్రాంతాలను అనుసంధానిస్తూ సమగ్ర పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. దీనివల్ల చెన్నూరుకు పర్యాటకుల రాక పెరగడంతో పాటు స్థానిక వ్యాపారాలకు ఊతం లభిస్తుందని, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు.

చెన్నూరు అభివృద్ధి కోసం పట్టణ ప్రజలు, వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రోడ్డు విస్తరణకు సహకరించడం అభినందనీయమని మంత్రి అన్నారు. ఎవరికీ ఇబ్బందులు కలగకుండా, అధికారుల బలవంతపు చర్యలకు తావులేకుండా పనులు చేపట్టేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. చిరువ్యాపారుల ప్రయోజనాలను కాపాడుతూనే పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు.

జైపూర్ మండలం వేళాల గ్రామంలో 4 కోట్ల 25 లక్షల రూపాయలతో గోదావరి పుష్కర ఘాట్ అభివృద్ధి పనులకు కూడా మంత్రి వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేశారు.

మాదాపూర్‌లో వ్యభిచార ముఠా గుట్టురట్టు

- ముగ్గురు విదేశీ మహిళలు అదుపులోకి..
- ప్రధాన నిర్వాహకుడి కోసం పోలీసుల గాలింపు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26:

మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. చంద్రనాయక్ తండాలోని ఓ సర్వీస్ అపార్ట్‌మెంట్‌పై పోలీసులు దాడులు నిర్వహించి ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు మహి ళలను అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారంలో ప్రధాన నిర్వాహకుడిగా అనుమానిస్తున్న వ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం.

సర్వే ఆఫ్ ఇండియా కాలనీలోని ఓరియన్ ఎలిగెంట్ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం రాత్రి పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓ గదిలో ఉన్న ముగ్గురు విదేశీ మహిళలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీకి చెందిన వ్యక్తి మహిళలను హైదరాబాద్‌కు తీసుకొచ్చి వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం.

మహిళలు నేపాల్ మీదుగా ఢిల్లీకి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. వారి ప్రయాణ పత్రాలపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా, ముఠా వెనుక ఇతరుల ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిర్వాహకుడి కోసం గాలిస్తున్నారు.

కొమురం భీం ఆశయాల సాధనకు కృషి

- గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రూ.180 కోట్లు
- జోడేఘాట్‌లో మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ వెల్లడి
- గోయగంలో మిషన్ అమృత్ జల్ పైలట్ ప్రాజెక్టు ప్రారంభం

కెరమెరి, వెలుతురు అక్టోబర్ 26:

గిరిజనుల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం పోరాడిన కొమురం భీం ఆశయాలను కొనసాగిస్తూ, ఆయన కలలుగన్న సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషి చేయాలని మంత్రులు దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. జోడేఘాట్, పరిసర గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రూ.180 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

కొమురం భీం 86వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం కేరమేరి మండలం జోడేఘాట్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు. భీం జెండాను ఆవిష్కరించి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమాధి వద్ద అంజలి ఘటించి, గిరిజన దర్బార్, వివిధ శాఖల ప్రదర్శనశాలలను పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు అటవీ నిబంధనలు అడ్డంకిగా మారకూడదన్నారు. ప్రజల కనీస అవసరాల కోసం చేపట్టే పనులకు అధికారులు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అత్యవసర అభివృద్ధి పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ ఈ ప్రాంతంలో పర్యటించి అవసరమైన పనులపై ప్రతిపాదనలు రూపొందిస్తారని వెల్లడించారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ద్వారా సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థలను బలోపేతం చేసి, జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామన్నారు. టైగర్ జోన్‌కు సంబంధించి ప్రస్తావించిన జీవో నంబర్ 49ను తమ ప్రభుత్వం ఉన్నంతవరకు అనుమతించబోమని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీటి సదుపాయాలు కల్పించడంతోపాటు అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

గోయగంలో మిషన్ అమృత్ జల్ ప్రారంభం

జోడేఘాట్ కార్యక్రమం అనంతరం కెరమెరి మండలం గోయగం గ్రామంలో మంత్రి సీతక్క మిషన్ అమృత్ జల్ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించారు. గ్రామంలో కిడ్నీ సంబంధిత సమస్యలు, ముఖ్యంగా దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధులు గుర్తించిన నేపథ్యంలో ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందించడమే ప్రాజెక్టు లక్ష్యమని జిల్లా కలెక్టర్ కె. హరిత వివరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ కలుషిత నీటిని వినియోగించకుండా శుద్ధి చేసిన నీటినే తాగాలని గ్రామస్తులకు సూచించారు. ప్రాజెక్టును విజయవంతం చేసి, ఇతర గ్రామాలకూ విస్తరించేందుకు సహకరించాలని కోరారు. గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దితే కేంద్రం నుంచి నిధులు, అవార్డులు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి, కలెక్టర్ కె. హరిత, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మట్, ఎస్పీ నితిక పంత్, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కేసముద్రంలో వడ్లకు రికార్డు ధర

- క్వింటా రూ.5,016 పలికిన జై శ్రీరామ్ రకం

మహబూబాబాద్, వెలుతురు అక్టోబర్ 26:

తెలంగాణలో వరి ధాన్యం ధరలు రికార్డు స్థాయికి చేరాయి. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో జై శ్రీరామ్ రకం వడ్లు క్వింటాలుకు ఏకంగా రూ.5,016 ధర పలికాయి. ఈ నెల 23న నిర్వహించిన ఈ-నామ్ వేలంలో ఈ ధర నమోదైంది. ఆర్ఎన్ఆర్ రకం ధాన్యానికి కూడా మంచి ధర లభిస్తోంది. క్వింటాలుకు గరిష్ఠంగా రూ.4,782 ధర నమోదైనట్లు మార్కెట్ సమాచారం వెల్లడిస్తోంది. పెరిగిన ధరలతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఆర్టీసీ కండక్టర్ ప్రవళికకు యాజమాన్యం అండ

- టీజీఎస్ ఆర్టీసీ ఈడీ సిహెచ్. వెంకన్న భరోసా
- హెల్త్ బులెటిన్ పరిశీలిస్తున్న రవాణా శాఖ మంత్రి పొన్నం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 26 :

విధినిర్వహణలో ఉండగా ప్రయాణికురాలి దాడిలో గాయపడి హైదరాబాద్‌లోని సాయి సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మణుగూరు డిపో ఆర్టీసీ మహిళా కండక్టర్ ప్రవళికను టీజీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సిహెచ్. వెంకన్న పరామర్శించారు. సోమవారం పలువు అధికారులతో కలిసి సాయిసంజీవని నేరుగా ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న ప్రవళిక ఆరోగ్య పరిస్థితిని ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గాయపడిన ప్రవళికకు మెరుగైన వైద్యం అందించాలని, వైద్య సేవల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ఆసుపత్రి వైద్యులకు ఈడీ వెంకన్న ప్రత్యేకంగా సూచించారు. అనంతరం బాధితురాలు ప్రవళికతో పాటు ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఈడీ వెంకన్న, వారికి ధైర్యం చెప్పారు. ఆర్టీసీ యాజమాన్యం ప్రవళికకు ఎల్లవేళలా అండగా ఉంటుందని, ప్రవళిక కు సంస్థ అన్ని విధాలా సంపూర్ణ భరోసా కల్పిస్తుందని స్పష్టం చేశారు. కండక్టర్‌పై దాడికి పాల్పడ్డ నిందితురాలిపై చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చట్టపరమైన చర్యలు వేగవంతం చేస్తామని తెలిపారు. విధినిర్వహణలో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడితే ఎంతమాత్రం సహించేది లేదని ఈ సందర్భంగా ఈడీ సిహెచ్. వెంకన్న తీవ్రంగా హెచ్చరించారు. ప్రజాసేవలో నిరంతరం శ్రమిస్తున్న ఉద్యోగుల రక్షణకు యాజమాన్యం ప్రథమ ప్రాధాన్యతనిస్తుందని, ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు తెగబడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రవళిక ఆరోగ్య పరిస్థితి పై ఎప్పటికప్పుడు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి లు వైద్యులతో మాట్లాడుతూ ప్రవళిక కు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com